teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక



## ఆన్లైన్ యూపీఐ ప్రేమెంట్స్ పరిమితి పెంపు

**ఇకపై గూగుల్ పే, ఫోన్‌లో రోజుకు 5 లక్షల వెసులుబాటు**

తెలంగాణ బ్యూరో, ఆగస్టు 08 (తీన్మార్ న్యూస్): ప్రస్తుత రోజుల్లో చెల్లింపులన్నీ ఆన్ లైన్‌లోనే కానిచ్చేస్తున్నారు. గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం వంటి డిజిటల్ పేమెంట్స్ యాప్స్ వాడకం బాగా పెరిగిపోయింది. కాగా ఆన్ లైన్ యూజర్స్ కోసం ఆర్బీఐ మరో సౌకర్యాన్ని తీసుకొచ్చింది. ఇకపై గూగుల్ పే, ఫోన్‌లో రోజుకు 5 లక్షల వరకు ట్రాన్స్ ఫర్ చేసుకునే వెసులుబాటు కల్పించింది. మొదట్లో ఈ లిమిట్ కేవలం రూ50 వేలు ఉండేది. ఆ తర్వాత లక్షకు పెంచారు. కాగా రోజురోజుకు ఆన్ లైన్ చెల్లింపులు పెరిగిపోవడం చిన్నా చితకా చెల్లింపులు కూడా ఫోన్ పే, గూగుల్ పే వంటి వాటితో జరుగుతుండటంతో ఆర్బీఐ రోజూవారి లావాదేవీల పరిమితిని పెంచింది. తాజా రూల్స్ ప్రకారం 24 గంటల్లో రూ.5 లక్షల వరకు ట్రాన్సాక్షన్స్ చేసుకోవచ్చు.

ములుగు | సంపుటి : 03 | సంచిక : 105 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శుక్రవారం | 9 ఆగస్టు 2024 | పేజీలు : 08 | వెల ‘ 5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.



## ఉన్న మాట అంటే ఉలికిపాటు ఎందుకు

పంచాయతీల్లో అటకెక్కిన పారిశుధ్యం

పంచాయతీలను నిర్వీర్యం చేస్తున్న కాంగ్రెస్..?

అన్ని అబద్ధాలంటూ అన్న మంత్రి సీతక్కపై హరీష్ రావు ఫైర్

కాంగ్రెస్ పాలనలో పంచాయతీలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయని తాము ఉన్నమాటే చెప్పామని అందుకు మంత్రి సీతక్కకు ఉలికిపాటు ఎందుకని మాజీ హరీష్‌రావు ప్రశ్నించారు. గురువారం ఆయన ఓ మీడియా చానల్‌తో మాట్లాడుతూ పక్కా ఫేక్ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పంచాయతీలను నిర్వీర్యం చేశాయని మండిపడ్డారు.

తెలంగాణ బ్యూరో, ఆగస్టు 08 (తీన్మార్ న్యూస్): గ్రామాల్లో చేపట్టిన పనులకు బిల్లులు రాకా పారిశుధ్య నిర్వహణ ప్రత్యేక అధికారులకు తలకు మించిన భారంగా పరిణమించిందని అన్నారు. గ్రామాల్లో పరిస్థితులపై తాము చెబుతున్నవి అబద్ధాలంటూ మంత్రి సీతక్క అనడం శోచనీయమని ఫైర్ అయ్యారు. అధికారంలోకి వచ్చి తొమ్మిదో నెలలోకి అడుగు పెడుతున్నా.. ప్రభుత్వం గ్రామాలకు 9 పైసలు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం కేంద్రం నుంచి నిధులు వచ్చినా.. అవి కూడా దారి మళ్లించి మోసం చేశారని ధ్వజమెత్తారు. గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం

మిగతా 2 లో

## నోటీసులతో ఆందోళనలో క్రషర్ ఓనర్లు

క్రషర్ ఓనర్ల పాలిట గుదిబండగా మారిన ప్రభుత్వ నిర్ణయం

నిర్ణయాన్ని మార్చుకోకపోతే మూసివేతే శరణ్యం



మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా తెలంగాణ ప్రభుత్వ నిర్ణయం క్రషర్ ఓనర్ల పాలిట గుదిబండగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు మూడు దశాబ్దాలుగా క్రషర్ ఓనర్లు ఏనాడు ఊహించని నిర్ణయంతో షాక్కు గురవుతున్నారు. ఇలాంటి ప్రమాదం ఒకటి వస్తుందన్నా ఆలోచన కూడా లేకుండా ఉన్న వారిలో ప్రభుత్వ నిర్ణయం వారి పాలిటశాపంగా మారి ఇబ్బందులకు గురయ్యే పరిస్థితులు ఏర్పడ్డయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హన్మకొండ, ఆగస్టు 08 (తీన్మార్ న్యూస్): గత ప్రభుత్వం హయాంలో తెలంగాణలోని కరహర్లాపై ది జిపిఎస్ సర్వే నిర్వహించింది. ఆ సర్వేలో తేలిన వాస్తవాలతో ఇప్పటి ప్రభుత్వం చర్యలకు శ్రీకారం చుట్టింది.ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ఉమ్మడి వరంగల్ జిల్లాలో నిర్వహించబడుతున్న క్రషర్ ఓనర్లకు ముందుగా షోకాజ్ నోటీసులు ఇచ్చారు. 10, 15 రోజుల తర్వాత డిమాండ్ నోటీసిస్తూ పెనాల్టీని చెల్లించాలని పేర్కొన్నారు. ఒక్కొక్రషర్ యజమాని కోట్లల్లోపేనాల్టీ చెల్లించాలని పేర్కొన్నారు. అది అందుకున్న క్రషర్ ఓనర్లు నెత్తినూరు బాదుకుంటూ ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని మొరపెట్టుకుంటున్నారు. వరంగల్ జిల్లాలో మూడు దశాబ్దాలకు పైగా సుమారుగా 170 నుండి 200 క్రషర్ల వరకు

మిగతా 2 లో



## భూములకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యతో జారీ

**ఆర్వోఆర్ చట్టం రాగానే ప్రతి కమతానికీ భూధార్**

**వ్యవసాయేతర భూములకూ హక్కుల రికార్డు**

**ఎలక్ట్రానిక్ రూపంలో భూమి సమగ్ర వివరాలు**

తెలంగాణ బ్యూరో, ఆగస్టు 08 (తీన్మార్ న్యూస్): రెవెన్యూ చట్టంలో మొదటిసారిగా భూధార్ కార్డు రాబోతుంది. వ్యక్తులకు ఆధార్ కార్డు మాదిరిగా రికార్డులో నమోదు చేసిన భూమికి ప్రత్యేక గుర్తింపు సంఖ్యతో భూధార్ కార్డు జారీ చేయనున్నారు. దీన్ని వ్యవసాయ, వ్యవసాయేతర భూములకు ఇవ్వనున్నారు. దీంతో సంబంధిత భూమి సమగ్ర వివరాలు తెలుసుకోవచ్చు. ఇది ఎలక్ట్రానిక్ రూపంలో ఉంటుంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం త్వరలో తీసుకురాబోతున్న కొత్త రెవెన్యూ చట్టం (ఆర్వోఆర్)లో

మిగతా 2 లో

## త్వరలో విద్యుత్ శాఖలో పదోన్నతులు, బదిలీలు

**స్పష్టం చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



తెలంగాణ బ్యూరో, ఆగస్టు 08 (తీన్మార్ న్యూస్): త్వరలో విద్యుత్ శాఖలో పదోన్నతులు, బదిలీలు చేపడతామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. విద్యుత్ శాఖలో 7-8 ఏళ్లుగా ప్రమోషన్లు లేవని దీని వల్ల చాలా మంది ఉద్యోగులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని చెప్పారు. ఈ విషయం సంబంధింత అధికారులు తన దృష్టికి తీసుకువచ్చారని ఈ విషయంలో చర్యలు చేపట్టాలని ఉ న్నతాధికారులను ఆదేశించానన్నారు. గురువారం హైదరాబాద్ లో టీజీఎస్పీడీసీఎల్‌పై ప్రధాన

మిగతా 2 లో



## చివరి విడత రుణమాఫీకి సిద్ధమవుతున్న సర్కార్

**6 లక్షల రైతుల కోసం రూ.8.5 వేల కోట్లు సమకూర్చినట్టు సమాచారం**

తెలంగాణ బ్యూరో, ఆగస్టు 08 (తీన్మార్ న్యూస్): చివరి విడత రుణమాఫీ కోసం కావాల్సిన నిధులను ప్రభుత్వం రెడీ చేస్తున్నది. దాదాపు 6 లక్షల మంది రైతుల కోసం సుమారు రూ.8.5 వేల కోట్ల నిధులను సమకూర్చినట్టు తెలిసింది. పంద్రాగస్టు రోజున ఖమ్మం జిల్లా వైరా పట్టణంలో సీఎం రేవంత్ రెడ్డి రుణమాఫీ స్కీమ్ ను కంప్లీట్ చేయనున్నారు. ఇప్పటికే రెండు విడుతల్లో 17,75,235 మంది రైతు కుటుంబాలకు ప్రభుత్వం రూ. 12,22,498 కోట్ల

మిగతా 2 లో



## మెడికల్ ఇన్సూరెన్స్‌పై జీఎస్టీ తొలగింపు..?

**ఇండియా కూటమి ప్రశ్నకు కేంద్ర ఆర్థిక మంత్రి సమాధానం**

న్యూ ఢిల్లీ, ఆగస్టు 08 (తీన్మార్ న్యూస్): లైఫ్, మెడికల్ ఇన్సూరెన్స్ మీద 18 శాతం జీఎస్టీ తొలగించాలనే ఇండియా కూటమి లేవనెత్తిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమాధానం ఇచ్చారు. జీఎస్టీ రాకముందు నుంచే మెడికల్ ఇన్సూరెన్స్ మీద టాక్స్ ఉండేది. ఇది కొత్తగా

మిగతా 2 లో

## రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం గడువు పొడిగింపు

**ఈ నెల 12 వరకు పొడిగిస్తూ సంస్థ చైర్మన్ ఎన్.బలరామ్ ప్రకటన**



.. వివరాలు 2లో

## కొత్త రేషన్, హెల్త్ కార్డుల జారీకి మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు

**ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ శాంతి కుమారి**

తెలంగాణ బ్యూరో, ఆగస్టు 08 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల జారీకి మరో కీలక ముందడుగు పడింది. కొత్త రేషన్ కార్డులు, హెల్త్ కార్డుల జారీకి మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటైంది. పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చైర్మన్‌గా,



మిగతా 2 లో



## హైదరాబాద్‌లో డోర్-టు-డోర్ డ్రోన్ మ్యాపింగ్

**ప్రతి ఆస్తికి రూపొందించునున్న డిజిటల్ అడ్రస్**

**జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ప్రకటన**

.. వివరాలు 2లో



## స్వచ్ఛందంగా లొంగిపోయిన ఇద్దరు మావోయిస్టులు

**ఎస్పీ రోహిత్ రాజు వెల్లడి**

కొత్తగూడెం క్రైం, ఆగస్టు 08 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర మావోయిస్టు పార్టీకి చెందిన ఇద్దరు సభ్యులు భద్రాద్రి జిల్లా పోలీసులు, సీఆర్‌పీఎఫ్ 141వ, 81వ బెటాలియన్ల అధికారుల ఎదుట స్వచ్ఛందంగా లొంగిపోయారు. ఈ వివరాలను

మిగతా 2 లో



## మూసీ సమీప కబ్జాపై కొనసాగుతున్న అధ్యయనం

**56 కి.మీ పొడువునా నిర్మాణాలను గుర్తించనున్న అధికారులు**

హైదరాబాద్, ఆగస్టు 08 (తీన్మార్ న్యూస్): మూసీ వెంబడి నిర్మాణాలు, కబ్జాలను అధ్యయనం చేసేందుకు మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ అథారిటీ చేపట్టిన సోషియో

మిగతా 2 లో

## మెడికల్ ఇన్సూరెన్స్ పై జీఎస్టీ తొలగింపు..?

**మొదటి పేజీ తరువాయి**

ప్రవేశపెట్టింది కాదు. ఇప్పటికే అన్ని రాష్ట్రాల్లో ఇది ఉందని వెల్లడించారు. ఇక్కడ నిరసన తెలుపుతున్నవారు తమ రాష్ట్రాల్లో ఈ పన్ను తొలగింపు గురించి చర్చించారా.. వారు తమ తమ రాష్ట్రాల ఆర్థిక మంత్రులకు దాని గురించి లేఖలు వ్రాసి, రాష్ట్రాలకు 2/3 వంతు ఉన్న GST కౌన్సిల్‌లో దానిని పెంచాలని కోరారా లేదు. కానీ ఇక్కడ మాత్రం నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇది వారి డ్రామా అని నిర్మలా సీతారామన్ అన్నారు. జీవిత, వైద్య బీమాలకు చెల్లించే ప్రీమియంలపై జీఎస్టీను ఉపసంహరించుకోవాలని ఆర్థిక మంత్రిని కోరుతూ నితిన్ గడ్కరీ మొదట లేఖ రాసారు. ఈ చర్య బీమా సంస్థలపై పన్ను భారాన్ని తగ్గించడమే కాకుండా ప్రపంచంలోని అత్యధిక జనాభా కలిగిన దేశంలో కీలకమైన బీమా ఉత్పత్తుల డిమాండ్‌ను పెంచుతుందని ఆయన అన్నారు. నాగ్‌పూర్ డివిజనల్ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ ఇన్సూరెన్స్ ఇండస్ట్రీకి సంబంధించిన సమస్యల గురించి నాకు మెమోరాండం సమర్పించింది. యూనియన్ లేవనెత్తిన ప్రధాన సమస్య లైఫ్ అండ్ మెడికల్‌పై GST ఉపసంహరణకు సంబంధించినదని గడ్కరీ అన్నారు.

## మూసీ సమీప కబ్జాపై కొనసాగుతున్న అధ్యయనం

**మొదటి పేజీ తరువాయి**

ఎకానమిక్ సర్వే ఇంకా కొనసాగుతూనే ఉన్నది. రెండు నెలల కిందట మొదలైన ఈ సర్వే ద్వారా 56 కిలోమీటర్ల పొడువునా మూసీకి ఇరువైపులా నిర్మాణాలను గుర్తించనున్నారు. తొలి దశలోనే గుర్తించిన సర్వే ఆధారంగా 12వేలకు పైగా నిర్మాణాలు ఉన్నట్లు గుర్తించగా గడిచిన నెల రోజుల వ్యవధిలో వీటి సంఖ్య 13వేలకు పైగా దాటినట్లు తేలింది. మరో 20 రోజుల్లో సర్వే ప్రక్రియ పూర్తి కానున్నది. ఈ తర్వాతే సమగ్రమైన గణాంకాలను వెల్లడించిన తర్వాత, పరిహారం వంటి అంశాలపై స్పష్టత వస్తుందని ఎంఆర్‌డీసీఎల్ వర్గాలు పేర్కొన్నాయి.

## చివరి విడత రుణమాఫీకి సిద్ధమవుతున్న సర్కార్

**మొదటి పేజీ తరువాయి**

రుణాలను మాఫీ చేసింది. అయితే రూ. 2 లక్షల కంటే ఎక్కువ రుణముంటే రైతులు ముందుగా అదనపు మెత్తాన్ని చెల్లించిన తరువాతే రుణమాఫీ చేయనున్నది

**ఇచ్చిన మాట ప్రకారం.**

పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఆగస్టు 15 లోపు రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఆ ప్రకటనను చూసిన విపక్షాలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎద్దేవ చేశాయి. రూ.2 లక్షల రుణమాఫీ చేయడం సాధ్యం కాదని, అంత మొత్తంలో నిధులు సేకరించడం సులువు కాదని విమర్శించాయి. కానీ ఎన్నికలు ముగిసిన తర్వాత రుణమాఫీ కోసం కావాల్సిన నిధుల సమీకరణపై సీఎం రేవంత్ రెడ్డి ఫోకస్ పెట్టారు. ఇచ్చిన మాట ప్రకారం గడువులోపు రూ. 2 లక్షల రుణాలను మాఫీ చేయాలని కంకణం కట్టుకున్నారు. అందులో భాగంగా ఇతర అనవసరాల కోసం ఖర్చు చేయకుండా కేవలం రుణమాఫీ కోసం మాత్రమే నిధులను వ్యయం చేస్తున్నారు. మొదటి దశలో జూలై 18న లక్షలోపు రుణాలను మాఫీ చేసేందుకు 11,34,412 మంది రైతుల కోసం 6034.96 కోట్లను వ్యయం చేశారు. జూలై 29న రెండో దశలో 6,40, 823 మంది రైతులకు రూ. 6190.01 కోట్లు ఖర్చు చేసి లక్షన్నర లోపు రుణాలను మాఫీ చేశారు. చివరి విడత ఆగస్టు 15న దాదాపు 6 లక్షల మంది రైతుల కోసం రూ. 8.5 వేల కోట్లను ఖర్చు చేసేందుకు ప్రభుత్వం రెడీ గా ఉంది.

**రూ. 2 లక్షల దాటిన రుణాలపై షరతులు**

రూ. 2 లక్షల వరకు రుణం ఉన్న ప్రతి రైతుకు ప్రయోజనం కల్పించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. ఆగస్టు 15న కేవలం రూ. 2 లక్షల వరకు అప్పు చేసిన రైతుల అకౌంట్లలో డబ్బులు జమ చేస్తారు. ఆ తరువాత రూ. 2లక్షల కంటే ఎక్కువ రుణం తీసుకున్న రైతుల రుణాలను మాఫీ చేయనున్నారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా ఒక టైమ్ షెడ్యూలును ప్రకటించి, బ్యాలెన్స్ అమౌంట్ ను కట్టేందుకు గడువు ఇవ్వనున్నారు. ఆ గడువులోపు రైతులు బ్యాలెన్స్ అమౌంట్ కట్టిన తరువాత రూ. 2 లక్షలను రైతుల అకౌంట్లలో వేసేందుకు ప్రభుత్వం ప్లాన్ చేస్తున్నది.

## త్వరలో విద్యుత్ శాఖలో పదోన్నతులు, బదిలీలు

**మొదటి పేజీ తరువాయి**

కార్యలయంలో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో భట్టి విక్రమార్క సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో చేపట్టిన ప్రాజెక్టులలోని లోపాలను కాంగ్రెస్ పైకి నెట్టే ప్రయత్నం బీఆర్ఎస్ చేస్తున్నదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. కాళేశ్వరంతో పాటు సుంకిశాల కూలిన పాపం బీఆర్ఎస్ దే అని ధ్వజమెత్తారు. సుంకిశాల రిటైనింగ్ వాల్ ఘటన పాపం తమపై మోపాలని బీఆర్ఎస్ చూస్తున్నదని దుయ్యబట్టారు. నల్గొండ జిల్లాలో నాగార్జునసాగర్ బ్యాక్ వాటర్ లో నిర్మించిన సుంకిశాల ప్రాజెక్టును 11 జూలై 2021న గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించి జూలై 2023 న టన్నెల్ సైడ్ వాల్ పూర్తి చేశారని వివరించారు. ఇన్నాళ్లు వారు నిర్మించిన కాళేశ్వరంలోని మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం మాత్రమే నాసిరకం అని అనుకున్నామని కానీ సుంకిశాల ఘటనతో వాళ్లు గోదావరినే కాదు కృష్ణ నదిని కూడా వదిలిపెట్టలేదని తేటతెల్లమైందని ఆరోపించారు. ఓ పత్రిక, టీవీ చానెల్, సోషల్ మీడియా చేతిలో ఉన్నదని తప్పుడు కథనాలు రాసి ప్రజలను మభ్యపెట్టాలని చూస్తే వారికి ప్రజలు బుద్ధిచెబుతారన్నారు. సుంకిశాల ఘటనను సీరియస్ గా తీసుకోవడంతో పాటు బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాన్నారు. సుంకిశాల ఘటనపై పూర్తి నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించామని, దీనిపై విచారణ జరిపి దోషులను తేలుస్తామన్నారు. బీఆర్ఎస్ హయంలోని ప్రాజెక్టు డిజైన్లు లోపభూయిష్టంగా ఉన్నాయని ఆరోపించారు.

**1912 హెల్ప్ లైన్ విస్తృతంగా ప్రచారం చేయండి.**

హైదరాబాద్ లో అన్ని రంగాలకు నిరంతర విద్యుత్ అందివ్వాలని ఆదేశించామని భట్టి విక్రమార్క చెప్పారు. హైదరాబాద్ నగరం భారత దేశానికే తలమానికం అని అనేక మల్టీలెవల్ సంస్థలు ఈ నగరానికి వస్తున్నాయని చెప్పారు. ఆ కంపెనీలతో పాటు ప్రజలకు అంతరాయం లేకుండా నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందివ్వాలన్నారు. అమెరికా పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబులు పెట్టుబడిదారులతో మాట్లాడుతున్నారు. వారు నాణ్యమైన విద్యుత్తు, లా అండ్ ఆర్డర్, మంచినీటి వసతి అడుగుతున్నారు. హైదరాబాద్ లో పెట్టుబడులు పెడితే సంస్థలకు ఇబ్బందులు ఉండవనేలా వారికి నమ్మకం కలిగించే బాధ్యతు సిబ్బందిపై ఉందన్నారు. నాణ్యమైన విద్యుత్తు నిరంతరాయం అందిస్తే పరిశ్రమలు ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది, జీడీపీ పెరుగుతుంది అన్నారు. ఉద్యోగాలు రావాలని, జీవనస్థితిగతులు మారాలని, ప్రపంచంతో పోటీ పడాలని బాధ, ఆవేదనతో కోరి తెచ్చుకున్న రాష్ట్రం తెలంగాణ అన్న విషయాన్ని విద్యుత్ సిబ్బంది గమనంలో పెట్టుకొని నాణ్యమైన సేవలు అందించాలన్నారు. వర్షాల కాలంలో విద్యుత్ స్తంభాలు ఒరిగే అవకాశం ఉందని అందువల్ల నిరంతరం అప్రమత్తంగా ఉంటూ తీసుకోవాల్సిన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎవరికైనా విద్యుత్ సమస్యలు తలెత్తితే టోల్ ఫ్రీ నంబర్ 1912కు తెలిపారని నగర ప్రజలకు సూచించారు. ఈ హెల్ప్ లైన్ పై విస్తృతంగా ప్రచారం చేయాలని సిబ్బందికి సూచించారు.

## భూములకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యతో జారీ

**మొదటి పేజీ తరువాయి**

భూధార్ కార్డుకు ప్రత్యేక స్థానం కల్పిస్తోంది. ఈ చట్టం అమల్లోకి రాగానే రెవెన్యూ శాఖ రికార్డుల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా ప్రతి కమతాని(భూమి)కి భూధార్ నెంబరు కేటాయించనున్నారు. అయితే ఇది తాత్కాలికంగానే ఉంటుంది. భూములు రీసర్వే చేసిన తర్వాత శాశ్వత గుర్తింపు నెంబరు జారీ చేస్తారు. కొత్త ఆర్వోఆర్-2024 చట్టం అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుందని రెవెన్యూ, న్యాయ నిపుణులు, రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. ప్రజాభిప్రాయ సేకరణ కోసం సీసీఎల్ఏలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశారు. ఈ-మెయిల్, లేఖల ద్వారా ఈ నెలాఖరు వరకు ప్రజాభిప్రాయాలు సేకరించనున్నారు. వాటిలో వచ్చే అభ్యంతరాలు, సలహాలు, సూచనల మేరకు ముసాయిదాలో మార్పులు చేర్పులు చేస్తారు. అనంతరం అసెంబ్లీ ఆమోదంతో చట్టంగా మారనుంది.

## రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం గడువు పొడిగింపు

హైదరాబాద్, ఆగస్టు 08 (తీన్మార్ న్యూస్): సింగరేణి కాలరీస్ సామాజిక బాధ్యతతో చేపట్టిన రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం గడువును ఈ నెల 12 తేదీ వరకు పొడిగించినట్లు సంస్థ ఛైర్మన్ మరియు ఎండీ ఎన్.బలరామ్ గురువారం ఒక ప్రకటన ఇందులో తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన యువత సివిల్స్ ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణత సాధిస్తే సింగరేణి తరపున రూ.లక్ష ఆర్థిక సహాయం అందించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు చేతుల మీదుగా గత నెల 20వ తేదీన ఈ పథకం ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ పథకంలో దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 6వ తేదీ వరకు గడువు విధించారు. అయితే గడువు పొడగించాల్సిందిగా అభ్యర్థుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఈ నెల 12 వ తేదీకు పెంచినట్లు ఆయన తెలిపారు. అర్హులైన అభ్యర్థులు సింగరేణి వెబ్సైట్ %ఎఎశ్రీఎఱఅవం.ఱశీఎ% ను సందర్శించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# ఉన్న మాట అంటే ఉలికిపాటు ఎందుకు

**మొదటి పేజీ తరువాయి**

అటకెక్కడం మేం చెప్పింది అబద్ధమా సీతక్క అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

**ఏది అబద్దం.. ఇవి అబద్దాల..?**

ప్రభుత్వం 9వ నెలలోకి అడుగుపెడుతున్నపటికీ గ్రామ పంచాయతీలకు 9 పైసలు కూడా చెల్లించలేదు అనేది అబద్ధమా?

కేంద్రం నుంచి ఉపాధి హామీ, హెల్త్ మిషన్ వంటి పథకాల కింద వచ్చిన 2100 కోట్ల నిధులను గ్రామాలకు ఇవ్వకుండా దారి మళ్ళించింది అబద్దమా?

15 ఆర్థిక సంఘం నుంచి వచ్చిన 500 కోట్ల నిధులను గ్రామ పంచాయతీలకు ఇవ్వకుండా ఆపింది అబద్దమా?

మాజీ సర్పంచ్‌లు పెండింగ్ బిల్లుల కోసం ఛలో సచివాలయం పిలుపు నిస్తే వారిని పోలీస్ స్టేషన్లలో నిర్బంధించింది అబద్దమా?

గ్రామ పంచాయతీలలో పారిశుద్ధ్యం అటకెక్కడం మేం చెప్పిన అబద్దమా?



గ్రామాల్లో పారిశుద్ధ్య లోపంతో డెంగీ, మలేరియా వంటి సీజనల్ రోగాలు ప్రబలడం అబద్ధమా?

రెండు నెలలుగా పారిశుద్ధ్య కార్మికుల జీతాలు చెల్లించకపోవడం అబద్ధమా?

8 నెలలుగా జడ్పీటీసీలు, ఎంపీటీసీలకు గౌరవ వేతనం ఇవ్వకపోవడం అబద్ధమా?

బీఆర్ఎస్ హయాంలో గ్రామ పంచాయతీలకు నెలనెల 275 కోట్లు, సంవత్సరానికి 3,300 కోట్ల నిధులు విడుదల చేసింది నిజం కాదా?

ఈ ప్రభుత్వం వాస్తవాలను అంగీకరించకుండా, సమస్యలు పరిష్కరించకుండా ప్రతిపక్షాల గొంతు నొక్కాలనుకోవడం సరికాదు.

ఈ ఎనిమిది నెలల కాంగ్రెస్ పాలనలో గ్రామాలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయన్నది పచ్చి నిజం. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని గ్రామ పంచాయతీలకు వెంటనే నిధులు విడుదల చేయాలని కోరుతున్నాను' అని తెలపారు.

## నేడు విడుదల కానున్న సీపీగెట్ ఫలితాలు

తెలంగాణ బ్యూరో, ఆగస్టు 08 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల పరిధిలోని పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్ (సీపీగెట్) - 2024 ఫలితాలు నేడు విడుదల కానున్నాయి. ఈ ఫలితాలను ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి, ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పీ లక్ష్మీనారాయణ కలిసి శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఫలితాలను విడుదల చేయనున్నారు. సీపీగెట్ ఫలితాలను ఉస్మానియా యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి గానూ ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ, పాలమూరు, మహాత్మాగాంధీ, శాతవాహన, తెలంగాణ మహిళా యూనివర్సిటీతో పాటు జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలాజికల్ యూనివర్సిటీల్లో పీజీ కోర్సులు ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్, ఎంఎల్ఐసీ, ఎంఈడీ, ఎంపీఈడీతో పాటు పలు కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు.



ఈ ప్రవేశాలకు సంబంధించిన రాతపరీక్షలను కంప్యూటర్ బేస్డ్ విధానంలో జులై 6 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించారు. రోజుకు మూడు షిఫ్టుల్లో మొత్తం 41 పీజీ కోర్సులు, నాలుగు ఐదేండ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులకు రాతపరీక్షలు నిర్వహించారు. ఈ 45 కోర్సులకు 73,342 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 64,765 మంది పరీక్షలకు హాజరయ్యారు.

## స్వచ్ఛందంగా లొంగిపోయిన ఇద్దరు మావోయిస్టులు

**మొదటి పేజీ తరువాయి**



భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు గురువారం కొత్తగూడెంలో వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం తెలంగాణ రాష్ట్ర మావోయిస్టు పార్టీ శబరి ఏరియా కమిటీ సభ్యుడు వెట్టి లక్ష్మయ్య అలియాస్ కల్లు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర మావోయిస్టు పార్టీ గొల్లపల్లి లోకల్ ఏరియా స్కాడ్ (ఎల్‌వోఎస్) సభ్యుడు మల్లం దేవా పోలీసుల ఎదుట లొంగిపోయారు. చర్ల మండలం కిష్టారంపాడు గ్రామానికి చెందిన లక్ష్మయ్య 2021లో చర్ల-శబరి ఏరియా కమిటీ మిలీషియా కమాండర్ వెట్టి దేవా అలియాస్ బాలు వద్ద మిలీషియా సభ్యుడిగా చేరాడు. అతడి వద్దే ఉంటూ పార్టీకి నిత్యావసర సరుకులు, పార్టీ ఆదేశించిన పనులు చేస్తూ 2022 అక్టోబర్‌లో దళ సభ్యుడిగా పదోన్నతి పొందాడు. కొన్ని రోజులు భద్రాద్రి కొత్తగూడెం - అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ సభ్యుడు ఆజాద్‌కు గార్డుగా పనిచేశాడు. అనంతరం కొన్ని రోజులకు చర్ల ప్లాటూన్‌లో దళ సభ్యుడిగా పని చేసి 2023లో శబరి ఏరియా కమిటీకి బదిలీ అయ్యాడు. ఛత్తీస్‌గఢ్ సుక్మా జిల్లా గొల్లపల్లి గ్రామానికి చెందిన మల్లం దేవా 2007 నుంచి 2015 వరకు మావోయిస్టు పార్టీకి చెందిన బాలల సంఘంలో పనిచేశాడు.

## నోటీసులతో ఆందోళనలో క్రషర్ ఓనర్లు



**మొదటి పేజీ తరువాయి**

నిర్వహిస్తున్నారు. వీటిలో కొన్ని మూతపడగా 150 క్రషర్లు నడుస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం నుండి నిబంధనల కంటే ఎక్కువగా మైనింగ్ చేశారంటూ నోటీసులు అందాయి. నోటీసులు అందుకున్న క్రషర్ ఓనర్లు షాక్కు గురవుతున్నారు. ఎప్పుడు ఇలాంటి నోటీసులు అందుకోలేదని లబోదిబోమంటున్నారు. మైనింగ్ అధికారులు చూపించిన పరిదికంటే ఎక్కువగా మైనింగ్ చేయలేదని అధికారులు చూపించిన ఏరియాను దాటిపోలేదని క్రషర్ ఓనర్లు వాపోతున్నారు. ఈ నేపద్యంలిలో ప్రభుత్వం ఇచ్చిన డిమాండ్ నోటీసులతో ఉక్కిరిబిక్కిరికి గురవుతున్నారు. రెండు మూడు నెలల క్రితం వరంగల్ జిల్లా క్రషర్ ఓనర్ల సంఘం, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న క్రషర్ ఓనర్లు తెలంగాణ ప్రభుత్వ పెద్దలతో సంప్రదింపులు జరిపారు. ఐనా ప్రభుత్వం ఆ నోటీసులను వెనక్కి తీసుకోకపోవడంతో తీవ్ర ఆందోళన గురవుతున్నారు. ఇంత మొత్తంలో తాము ఏనాడు మైనింగ్ చేయలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయం వలన జిల్లాలో ఉన్న క్రషర్లు మూతపడే అవకాశాలు ఉన్నాయని వారుఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరంగల్ జిల్లాలో 16 క్రషర్లు ఉండగా 12 క్రషర్లకు మైనింగ్ శాఖ అధికారులు షోకాజ్ నోటీసులతో పాటు డిమాండ్ నోటీసులను అందించారు. వాటిని అందుకున్న క్రషర్ ఓనర్లు చేసేదేమీ లేక తీవ్రమైన మానసిక ఒత్తిడి గురవుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. మిగిలిన నాలుగు క్రషర్ ఓనర్లకు కొద్ది రోజుల్లో డిమాండ్ నోటీసులు అందిస్తామని మైనింగ్ శాఖ అధికారులు తెలిపారు. హన్మకొండ జిల్లాలో వివిధ మండలాలలో సుమారు 60 క్రషర్లు నడుస్తున్నాయి. వీటికీ రెండు మూడు నెలల క్రితం హనంకొండ మైనింగ్ శాఖ అధికారులు షోకాజు నోటీసులతో పాటు డిమాండ్ నోటీసులను అందించారు. వరంగల్ జిల్లా క్రషర్ ఓనర్ల సంఘం అధికారులు జిల్లా కలెక్టర్,మైనింగ్ శాఖ అధికారులను కలిసి తమ గోడును వెల్లబోసుకున్నట్లు తెలిపారు. తాము ఏనాడు మైనింగ్ శాఖ అధికారులు నిర్ణయించిన హద్దులను దాటి మైనింగ్ చేయలేదని ప్రతి నెల పర్మిట్ల ఆధారంగా మైనింగ్ చేస్తూ క్రషర్లు నిర్వహించుకుంటున్నామని తెలిపారు. రెండు మూడు దశాబ్దాల అనంతరం తెలంగాణ ప్రభుత్వం డిమాండ్ నోటీసులు ఇచ్చి తమను వేధింపుల గురిచేస్తున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిదిదాటి మైనింగ్ చేసినట్లయితే సంబంధిత అధికారులు ప్రతినెల పర్మిట్లు తీసుకునే సమయంలో చెప్పినట్లయితే మాకు ఇబ్బంది ఉండేది కాదని వాపోతున్నారు.

**నోటీసులతో ఆందోళన**

తెలంగాణ ప్రభుత్వం ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న క్రషర్ల ఓనర్లతో పాటు వరంగల్ జిల్లాలో నిర్వహిస్తున్న క్రషర్ ఓనర్లకు షోకాజు నోటీసులు డిమాండ్ నోటీసులను అందించారు. నోటీసులు అందుకున్న క్రషర్ ఓనర్లు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రతినెల సంబంధిత మైనింగ్ శాఖ అధికారులను సంప్రదించి పరిమితులు తీసుకొని వారు నిర్ణయించిన హద్దుల పరిధిలో మైనింగ్ చేశామే కానీ పరిధి దాటి ఎప్పుడు వెళ్లలేదని తెలిపారు. గతంలో ఒక్కో క్యూబిక్ మీటర్ కు ధర తక్కువగా ఉండేదాని,దాన్ని ప్రభుత్వం రూ.165 పెంచునుందన్నారు. దాని మూలంగా క్రషర్ ఓనర్లకు లాభాలు రావటం లేదన్నారు. నోటీసులతో తమ బ్రతుకులు బజారున పడే పరిస్థితి ఉందని వారు వాపోయారు. నోటీసుల కారణంగా ఏమి చేయాలో తెలియని అయోమయ పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు. మైనింగ్ చేసిన మెటల్ ను తెలంగాణ ప్రభుత్వం చేసిన రోడ్లు, భవనాలు గ్రామాలలో సిసి రోడ్ల నిర్మాణంతో పాటు అనేక ప్రభుత్వ కార్యక్రమాలకు ఉపయోగిస్తున్నామే కానీ ప్రైవేటు వ్యక్తులకు అమ్మేది తక్కువేనని అంటున్నారు. ఈ నేపథ్యంలో కాంట్రాక్టర్ల వద్ద నుండి తెలంగాణ ప్రభుత్వం రాయల్టీ రూపంలో బిల్లులు వసూలు చేస్తున్నారని తిరిగి తమపై డిమాండ్ నోటీసులతో భయపెట్టడం ఏమిటని ప్రభుత్వం నిర్ణయం పట్ల తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఉన్న మైనింగ్ అధికారులు గతంలో ఇచ్చిన పర్మిట్ల వరకు నిర్దేశించిన ప్రదేశంలో మైనింగ్ చేశామే కానీ వేరే ఎక్కడ పరిధి దాటి మైనింగ్ చేయలేదని వారు అంటున్నారు. మైనింగ్ చేసినట్లయితే సంబంధిత అధికారులు క్రషర్ ఓనర్లపై ఎప్పుడో చర్యలకు దిగేదని వారు అంటున్నారు. ప్రభుత్వ నిర్ణయం మార్చుకోకపోతే జిల్లాలోని క్రషర్లు డిమాండ్ నోటీసుల కారణంగా మూతపడే పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు.తెలంగాణ ప్రభుత్వం అందించిన డిమాండ్ నోటీసుల్లో ఒక్కో ప్రసార యజమాని లక్షల్లో కోట్లల్లో పెనాల్టీ చెల్లింది చాలని పేర్కొనడం ఇబ్బందిగా మారిందని అంటున్నారు. ఆ నిర్ణయం కారణంగా జిల్లాలో ఉన్న క్రషర్లు ప్రభుత్వ నిర్ణయించిన పెనాల్టీని కట్టే పరిస్థితిలో లేవని ప్రభుత్వ నిర్ణయం మార్చుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

## కొత్త రేషన్, హెల్త్ కార్డుల జారీకి మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు

**మొదటి పేజీ తరువాయి**

దామోర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సభ్యులుగా మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేశారు. ఇటీవల కేబినెట్ నిర్ణయం మేరకు సీఎస్ శాంతి కుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త రేషన్ కార్డులు, హెల్త్ కార్డుల జారీకి అర్హతలు, విధి విధానాలను మంత్రివర్గ ఉపసంఘం సిఫారసు చేయనుంది. రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డులు వేర్వేరుగా ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. రేషన్ కార్డుల కోసం వార్షికాదాయం, భూ పరిమితి తదితర అంశాలపై సబ్ కమిట అధ్యయనం చేయనుంది.

## ఆ నిర్ణయం సరైనదే: తెలంగాణ హైకోర్టు

**మొదటి పేజీ తరువాయి**

భూదాన్ యజ్ఞ బోర్డును రద్దు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సబబేనంటూ తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. భూదాన్ బోర్డును రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి ఉందని, దాన్ని ప్రశ్నించే చట్టబద్ధమైన హక్కు మాజీ ఛైర్మన్, సభ్యులకు లేదని తేల్చి చెప్పింది. భూదాన్ బోర్డు నిర్వహణ నిమిత్తం ప్రత్యేక అధికారిగా రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శిని నియమిస్తూ జారీ చేసిన ఉత్తర్వు సబబేనని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోలేమంటూ ఛైర్మన్, సభ్యులు దాఖలు చేసిన అప్పీళ్లను కొట్టివేసింది. భూదాన్ బోర్డును రద్దు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 59ను సవాలు చేస్తూ భూదాన్ యజ్ఞ బోర్డు ఛైర్మన్ జి.రాజేందర్ రెడ్డి, సభ్యులు సుబ్రమణ్యం తదితరులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన సింగిల్ జడ్జి పిటిషన్ కొట్టివేయడంతో వారు అప్పీలు దాఖలు చేశారు. అప్పీలుపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జె. శ్రీనివాసరావులతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. 2012లో ఉమ్మడి ఏపీలో భూదాన్ యజ్ఞ బోర్డు ఛైర్మన్ రాజేందర్ రెడ్డి, సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. రాష్ట్ర విభజన తరువాత భూదాన్ బోర్డును రద్దు చేస్తూ ప్రత్యేక అధికారిని నియమిస్తూ ప్రభుత్వం జీవో 11 జారీ చేసిందని పేర్కొన్నారు.

## హైదరాబాద్ లో డోర్-టు-డోర్ డ్రోన్ మ్యాపింగ్

హైదరాబాద్, ఆగస్టు 08 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని ప్రాపర్టీలు, యుటిలిటీలను మ్యాప్ చేయడానికి సమగ్ర ఇంటిగ్రేటెడ్ జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ సర్వేను నిర్వహిస్తోంది. డ్రోన్‌లను ఉపయోగించి ఏరియల్ సర్వేలు, ప్రతి పార్సిల్‌కు సంబంధించిన సమాచారాన్ని క్యాప్చర్ చేయడానికి డోర్-టు-డోర్ మ్యాపింగ్, ఆన్-గ్రౌండ్ సర్వేయర్‌లు సేకరించిన జియోలొకేషన్ డేటాతో తీసుకోబడుతున్నాయి. ఈ విషయాని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఆస్తికి డిజిటల్ అడ్రస్ అని కూడా పిలువబడే ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్య రూపొందించబడుతుంది. ఈ ఐడీ చెత్త సేకరణ, అత్యవసర నిర్వహణ వంటి సేవల డెలివరీ కోసం లక్షణాలను గుర్తించడంలో సహాయపడుతుందని తెలిపారు. నగరం అన్ని భవనాలు, రోడ్లు, నీరు, విద్యుత్ వంటి వినియోగాలను చూపే స్పష్టమైన మ్యాప్‌ను కలిగి ఉంటుందని, ఇది ప్రభుత్వ భవిష్యత్తు ప్రణాళికకు దోహదపడుతుందని ఆమె తెలిపారు. వీధిలైట్లు, పైపులు వంటివి ఎక్కడ ఉన్నాయో నగరం ట్రాక్ చేయవచ్చు, అవసరమైనప్పుడు వాటిని పరిష్కరించడం సులభం అవుతుందన్నారు. విద్యుత్, నీరు లేదా గ్యాస్ అందించే కంపెనీలు కొత్త కనెక్షన్‌లు లేదా మరమ్మతుల కోసం మీ ఇంటిని సులభంగా కనుగొనవచ్చు అని అన్నారు. మీరు చిరునామాలను మరింత ఖచ్చితంగా కనుగొనడానికి మీ ఫోన్‌ని ఉపయోగించవచ్చు, ఇది నగరం చుట్టూ ప్రయాణించేటప్పుడు సహాయపడుతుందని పేర్కొన్నారు. అదనంగా, జీహెచ్ఎంసీ సర్వే ప్రయత్నాలను వేగవంతం చేయడానికి, సమగ్ర కవరేజీని నిర్ధారించడానికి స్వయం-సహాయక బృందాలు, నివాసితుల సంక్షేమ సంఘాలతో సహకరిస్తుంది.

## రీఛార్జ్ ప్లాన్స్ పై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న వేళ అంబానీ గుడ్ న్యూస్

**మొదటి పేజీ తరువాయి**

ప్రవేశపెట్టిన నాలుగు బడ్జెట్ ఫ్రెండ్లీ ప్రీపెయిడ్ ప్లాన్‌లు

తెలంగాణ బ్యూరో, ఆగస్టు 08 (తీన్మార్ న్యూస్): జియో రీఛార్జ్ ప్లాన్స్ భారీగా పెంచేసిందని యూజర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్న వేళ ముకేశ్ అంబానీ గుడ్ న్యూస్ చెప్పారు. ఇందులో భాగంగానే అంబానీ నాలుగు బడ్జెట్ ఫ్రెండ్లీ ప్రీపెయిడ్ ప్లాన్‌లను ప్రవేశపెట్టారు. జియో కొత్త ప్రీపెయిడ్ ఆఫర్‌లు

రూ.199 ప్లాన్: ఈ ప్లాన్‌తో రీఛార్జ్ చేసుకుంటే రోజుకు 1.5 జీబీ డేటా, అపరిమిత కాల్స్, రోజుకు వంద ఎస్ఎంఎస్‌లు మాత్రమే కాకుండా జియో టీవీ, జియో సినిమా, జియో క్లౌడ్ వంటి సబ్‌స్క్రిప్షన్‌లు (18 రోజులు) ఉన్నాయి.

రూ.209 ప్లాన్: ఈ ప్లాన్‌తో రీఛార్జ్ చేసుకుంటే రోజుకు 1 జీబీ డేటా, అపరిమిత కాల్స్, రోజుకు వంద ఎస్ఎంఎస్‌లతో పాటు 22 రోజుల చెల్లుబాటుతో జియో ఎంటర్‌టైన్‌మెంట్ యాక్సిస్ లభిస్తుంది.

రూ.249 ప్లాన్: రోజుకు 1జీబీ డేటా, అపరిమిత కాల్స్, రోజుకు వంద ఎస్ఎంఎస్‌లతో పాటు 28 రోజుల చెల్లుబాటుతో జియో ఎంటర్‌టైన్‌మెంట్ యాక్సిస్ లభిస్తుంది.

రూ.299 ప్లాన్: రోజుకు 1.5 జీబీ డేటా, అపరిమిత కాల్స్, రోజుకు వంద ఎస్ఎంఎస్‌లతో పాటు 28 రోజుల చెల్లుబాటుతో జియో ఎంటర్‌టైన్‌మెంట్ యాక్సిస్ లభిస్తుంది.

రీఛార్జ్ ప్లాన్స్ పెంచడం వల్ల ఇప్పటికే చాలామంది జియో యూజర్లు బీఎస్ఎన్ఎల్’కు మారిపోతున్నారు. ఇప్పటికే లక్షలమంది యూజర్లు బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ తీసుకున్నట్లు సంస్థ అధికారికంగా వెల్లడించింది. దీంతో ఇక యూజర్లను మళ్ళీ ఆకట్టుకోవడానికి సంస్థ ఈ ప్లాన్స్ ప్రకటించినట్లు తెలుస్తోంది.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# మార్కెట్లను ముంచెత్తుతున్న మాంద్యం భయం

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాలతో ముగుస్తున్నాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచే భారీ నష్టాలతో మొదలైంది. 2400 పాయింట్ల నష్టంతో మొదలైన సెన్సెక్స్ 2600 పాయింట్ల వరకు నష్టాలను చూసింది. ఇక నిఫ్టీ సైతం ట్రేడింగ్ ప్రారంభం నుంచే నష్టాలు చూసింది. చివర్లో కోలుకుని 24,000కి పైన ముగిసినప్పటికీ మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో 729 పాయింట్ల నష్టంలో 23,983 వద్ద ట్రేడ్ అయింది. గత వారం 25 వేల మార్కును తాకి రికార్డు సృష్టించిన నిఫ్టీ వారం చివర్లో మాత్రం అమ్మకాల తాకిడిని ఎదుర్కొంది. ప్రస్తుతం అంతర్జాతీయంగా వస్తోన్న ప్రతికూల సంకేతాలతో దేశీయ మార్కెట్లు నష్టాలు చవిచూశాయి. అమెరికా విడుదల చేసిన జులై నెల జాబ్స్ డేటాలో అంచనాల కంటే ఉద్యోగాల కల్పన తగ్గిపోయినట్లు తేలింది. నిరుద్యోగ రేటు మూడేళ్ల గరిష్ఠానికి చేరింది. దీంతో ఆ దేశంలో మాంద్యం భయం మొదలైంది. దీంతో అక్కడి మార్కెట్లు నష్టాలు ఎదుర్కొంటున్నాయి. దీంతోపాటు మిడిల్ ఈస్ట్‌లో జియోపాలిటిక్స్ ప్రమాదకరంగా మారాయి. ఈ భయాలన్నీ ప్రస్తుతం ఆసియా మార్కెట్లను దెబ్బతీస్తున్నాయి. జపాన్ నిక్కీ 225 ఇండెక్స్ ఏకంగా 13 శాతం క్రాష్ అయి ఏడు నెలల కనిష్ఠానికి పడిపోయింది. 2011 అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభం తర్వాత జపాన్ నిక్కీ ఇంత పెద్ద మొత్తంలో నష్టాలను చూడడం మళ్లీ ఇప్పుడే. తైవాన్‌లోని ప్రధాన స్టాక్ సూచీ కూడా 7.7 శాతం నష్టపోయింది. చిప్ దిగ్గజం టీఎస్ఎంసీ షేర్లు 8.4 శాతం పడిపోయాయి. దక్షిణ కొరియా కోస్పి ఇండెక్స్ 6.6 శాతం పడింది. శాంసంగ్‌తో పాటు చిప్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీలు నష్టాలు పాలయ్యాయి. క్రిప్టోకరెన్సీలు కూడా నష్టాలను ఎదుర్కొన్నాయి. ఒక బిట్ కాయిన్ ధర 53 వేల డాలర్లకు చేరుకుంది. ఫిబ్రవరి నుంచి ఇదే కనిష్ఠ స్థాయి. భారత్, తైవాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, హాంకాంగ్, షాంఘై అన్ని స్టాక్ మార్కెట్లు నష్టాలను నమోదు చేశాయి. స్టాక్ మార్కెట్లు భారీగా నష్టపోతుండటంతో డాలర్ మారకంలో దేశీయ కరెన్సీ రూపాయి విలువ కూడా జీవన కాల కనిష్ఠ స్థాయిలకు పడిపోయింది. డాలర్ మారకంలో రూపాయి విలువ శుక్రవారం రూ. 83.75గా ఉంటే.. సోమవారం రూ. 83.85 వద్ద ట్రేడైంది.

ఇదే సమయంలో బ్యాంకు ఆఫ్ జపాన్ వడ్డీ రేట్లను పెంచడంతో అమెరికా డాలర్‌తో పోలిస్తే యెన్ బలపడింది. విదేశీ ఇన్వెస్టర్లకు టోక్యో స్టాక్స్ మరింత ఖరీదైనవిగా మారాయి. గ్లోబల్ మార్కెట్ల పతనం, అమెరికాలో మాంద్యం భయాలు, జియోపాలిటిక్స్ కారణంగా రూపాయి విలువ పడిపోయిందని విశ్లేషకులు చెప్పినట్లు వార్తా సంస్థ ఏఎన్ఐ పేర్కొంది. అమెరికాలో మాంద్యం భయాలతో భారత్, ఎమర్జింగ్ మార్కెట్ల నుంచి పెద్ద ఎత్తున నిధులు తరలిపోతున్నాయని విశ్లేషకులు చెప్పారు. జులై జాబ్స్ డేటా అంచనాల కంటే తగ్గడంతో అమెరికా సెంట్రల్ బ్యాంకు ఫెడరల్ రిజర్వు వడ్డీ రేట్లకు కోత పెడుతుందని మార్కెట్ వర్గాలు అంచనావేస్తున్నాయి. వాస్తవానికి ఇటీవల బలహీనమైన ఆర్థిక డేటా మధ్య అమెరికాతో పాటు ప్రపంచవ్యాప్తంగా అన్ని ప్రధాన మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడి కొనసాగుతోంది. దీనికి తోడు అమెరికా రానున్న కాలంలో మానిటరీ పాలసీ కింద వడ్డీ రేట్లను వేగంగా సెప్టెంబర్ నుంచి తగ్గిస్తుందనే ఊహాగానాలు ఈ పరిస్థితులకు దారి తీశాయి. అమెరికాలో జూన్ డేటా ప్రకారం ఊహించిన స్థాయిలో ఉద్యోగాల కల్పన కూడా జరగలేదని డేటా వెల్లడించింది. అయితే సెప్టెంబర్ 17-18 మధ్య జరగనున్న సమావేశంలో అర శాతం వడ్డీ రేట్లను ఫెడ్ తగ్గించవచ్చను అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే గోల్డ్ మాన్ సాచ్స్, సిటీ గ్రూప్, జేపీ మోర్గన్ చేజ్ వంటి ప్రముఖ సంస్థలు సైతం సెప్టెంబర్, డిసెంబర్ సమావేశాల్లో వడ్డీ రేట్ల తగ్గింపు ప్రకటన ఉండొచ్చని ఇప్పటికే సూచిస్తున్నాయి. ఏఖ మోర్గాన్ కూడా ఫెడ్ తదుపరి షెడ్యూల్ సమావేశానికి ముందు ఆఫ్-సైకిల్ రేటు తగ్గింపుకు బలమైన అవకాశాన్ని సూచించింది. గ్లోబల్ మార్కెట్లు ఫెడ్ జాగ్రత్త వైఖరికి ప్రతికూలంగా ప్రతిస్పందించాయి. జపాన్ నిక్కీ ఇండెక్స్ సోమవారం 14 శాతానికి పైగా పడిపోయింది. బ్యాంక్ ఆఫ్ జపాన్ బిగుతును కొనసాగిస్తుందనే అంచనాలతో యెన్ ఒక శాతం కంటే ఎక్కువ ర్యాలీ చేసింది. జూ ఫ్యూచర్స్ పడిపోయాయి. ాడఖ 500 ఫ్యూచర్స్ 2.64 శాతం తగ్గగా, నాస్డాక్ ఫ్యూచర్స్ దాదాపు 5 శాతం తగ్గాయి. చాలా మంది ఈ సారి షెడ్యూల్ మీటింగ్ ముందే ఫెడ్ రేట్ల తగ్గింపుకు వెళ్లొచ్చని బెట్ వేస్తుండగా, బలమైన కారణాలు లేకుండా ఇకపై రేట్లతగ్గింపులను ఆపలేదని నిపుణులు ఊహిస్తున్నారు. ఇదే క్రమంలో వడ్డీ రేట్లను రెండు దశాబ్దాల గరిష్ఠ స్థాయిలో ఉంచాలన్న ఫెడ్ నిర్ణయం వల్ల ఆర్థిక వ్యవస్థ మరింత మందగించే ప్రమాదం ఉందన్న ఆందోళనలు కూడా పెరుగుతున్నాయి. ఈ క్రమంలో గోల్డ్‌మన్ సాచ్స్ ఆర్థికవేత్తలు వచ్చే ఏడాది అమెరికా మాంద్యం సంభావ్యతను 15 శాతం నుంచి 25 శాతానికి పెంచారు. అయితే తిరోగమనానికి భయపడకుండా ఉండటానికి అనేక కారణాలు ఉన్నాయని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా చెడు వార్తల కారణంగా బేర్స్ రంగంలోకి దిగటంతో గ్లోబల్ మార్కెట్లు కుదేలవుతున్నాయని స్వస్తిక ఇన్వెస్ట్‌మార్ట్ రీసెర్చ్ హెడ్ సంతోష్ మీనా పేర్కొన్నారు. జపాన్‌లో వడ్డీ రేటు పెంపు తర్వాత, రివర్స్ యెన్ క్యారీ ట్రేడ్ భయం ప్రారంభ ఉత్ప్రేరకంగా నిలవగా.. అమెరికాలో అత్యంత పేలవమైన జాబ్ డేటా మాంద్యం ఏర్పడుతుందనే భయాలను మరింతగా పెంచిందని అన్నారు. ఈ క్రమంలో చైనా, యూరప్ ఇప్పటికే మందగమనంతో సతమతమవుతుండటంతో పాటు పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు మార్కెట్లపై మరింత ఒత్తిడిని పెంచుతున్నాయని మీనా వెల్లడించారు. స్టాక్ మార్కెట్లు పడిపోవడంతో, దేశీయ ఇన్వెస్టర్ల సంపద రూ.17 లక్షల కోట్లు హరించుకుపోయిందని ఎకనమిక్ టైమ్స్ రిపోర్టు చేసింది. బీఎస్ఈలో అన్ని లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.440.16 లక్షల కోట్లకు పడిపోయిందని తెలిపింది. జులై 2 తర్వాత తొలిసారి నిఫ్టీ 24 వేల మార్కు కిందకు వచ్చినట్లు ఎకనామిక్ టైమ్స్ రిపోర్టు చేసింది. బడ్జెట్ డే రోజు నిఫ్టీ 24,074కి పడిపోయింది.

# నగల కోసం గొంతు నులుమీ వృద్ధురాలి హత్య



టేక్మాల్, ఆగస్టు 08 (తీన్మార్ న్యూస్): బంగారు నగల కోసం గొంతు నులిమి వృద్ధురాలిని హత్య చేసిన సంఘటన మెదక్ జిల్లా టేక్మాల్ మండలం కాదులూరు శివారులో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. అల్లాదుర్గం ఇన్చార్జి మెదక్ రూరల్ సిఐ రాజశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కాదులూరు గ్రామానికి చెందిన ఓబలి అంజమ్మ 75 గ్రామ శివారులోని మెదక్ బోడ్మట్ పల్లి రోడ్డు పక్కన ఎల్లమ్మ గడ్డ దత్తాత్రేయ ఆశ్రమం వద్ద నివాసం ఉంటుంది. మృతురాలి అల్లుడు వేముల రాములు సోలార్ లో సెక్యూరిటీ గార్డ్ గా విధులు నిర్వహిస్తున్నాడు. ప్రతిరోజు లాగే డ్యూటీ ముగించుకుని వెళ్లేటప్పుడు తన అత్తమ్మని పలకరించడానికి వెళ్ళగా ఆమె పలకక పోవడంతో లోపలికి వెళ్ళి చూడగా ఓ మూలన అదే గ్రామానికి చెందిన నదరి శివకుమార్ కనిపించాడు. ఇక్కడేమీ చేస్తున్నావు అని అడుగగా కట్టెతో కొట్టడానికి రావడంతో నేను బయటకి రాగానే పారిపోయాడు. వెంటనే 100 కు ఫోన్ చేయగా సంఘటన స్థలానికి పోలీసులు చేరుకున్నారు. మృతురాలి అల్లుడు రాములు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దయానంద్ తెలిపారు. డెడ్ బాడీని పోస్ట్ మార్టం నిమిత్తం జోగిపేట ఆసుపత్రి కి తరలించారు. మృతురాలికి ఇద్దరూ కొడుకులు ఇద్దరూ కూతుర్లు ఉండగా కొడుకులు చనిపోయారు. కోడలు మనుమడు హైద్రాబాద్ లో ఉంటున్నారు.

# మరదలిపై బావ అత్యాచారయత్నం



## కేసు నమోదు చేసి రిమాండ్ కు పంపిన పోలీసులు

పెబ్బేరు, ఆగస్టు 08 (తీన్మార్ న్యూస్): భార్య చనిపోయిందని అన్న వద్దే కురుమూర్తి అతని ఇద్దరు పిల్లలను ఆదరించి తనతో పాటు ఆదరించిన తమ్ముడి భార్యపై బావ అత్యాచారయత్నానికి పాల్పడిన సంఘటనపై గురువారం పెబ్బేరు ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి కేసు నమోదు చేశారు. పెబ్బేరు మండలం కంచిరావుపల్లి గ్రామానికి చెందిన వివాహితను తన భర్త అన్న వద్దే కురుమూర్తి అత్యాచారానికి యత్నించాడు. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదుచేసి రిమాండ్ కు పంపినట్లు ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు.

# స్వచ్ఛతనం - పచ్చదనం ద్వారా అంటువ్యాధుల నివారణ

## గ్రామ ప్రజలకు పరిశుభ్రతపై పై అవగాహన మండల స్పెషల్ అధికారి సుబ్బారెడ్డి



ఆత్మకూర్, ఆగస్టు 08 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛతనం పచ్చదనం కార్యక్రమం ద్వారా అంటూ వ్యాధుల నివారణను చేపట్టవచ్చని ఆత్మకూర్ మండల స్పెషల్ ఆఫీసర్ సుబ్బారెడ్డి అన్నారు. స్వచ్ఛతనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా నాలుగవ రోజు అయిన గురువారం వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం మూలమల్ల గ్రామంలో గ్రామ స్పెషల్ ఆఫీసర్ స్థానిక తహసిల్దార్ రాజు అధికారుల సిబ్బంది కలిసి గ్రామంలోని పలు వార్డుల్లో పర్యటించి పరిశుభ్రతకు సంబంధించిన పనులు చేపట్టారు. గ్రామంలోని మురుగు కాలువలను శుభ్రం చేయడం గ్రామంలోని వీధుల గుండా రోడ్లపై నిలిచిన వర్షపు నీటిని తొలగించడం వంటి పనులు విధిగా నిర్వహించారు. అంతేకాకుండా ప్రజలకు మంచినీటి బోర్ల వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లి మురుగునీటిని తొలగించడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా మండల స్పెషల్ ఆఫీసర్ సుబ్బారెడ్డి గ్రామంలోని ప్రజలకు పరిశుభ్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను పలు సూచనలు సలహాలు తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి రాజశేఖర్ రెడ్డి, ఎంపీవో శ్రీరామ్ రెడ్డి, మహిళా సంఘం ఏపీఎం వెంకటేష్, గ్రామ నాయకులు ఎంపిటిసి లక్ష్మన్న, ఉషన్న, పట్నం ఆనంద్ కుమార్, శేఖర్, టి హెచ్ రాజు, దేవన గౌడ్, అంగన్వాడి సిబ్బంది, ఆశా వర్కర్లు, టెక్నీషియన్ ఆఫీసర్ నాగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ అరుణ, మహిళా సంఘం సిసి అన్వర్ పాషా, మహిళా సంఘం సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది కొండన్న, కురుమూర్తి,మహేష్, మజేష్, దేవన్న తదితరులు పాల్గొన్నారు.



# మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షునిగా ఆశీర్వదించండి

## పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సంగేపాగా వంశీ



ఆత్మకూర్, ఆగస్టు 08 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం యూత్ కాంగ్రెస్ నూతన అధ్యక్షునిగా ఆత్మకూరు పట్టణ యూత్ అధ్యక్షులు సంగేపాగా వంశీ ఆశీర్వదించాలని విలేకరుల సమావేశంలో ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదింటి బిడ్డను కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతి కృషి కోసం ఎంతగానో కృషి చేశానని కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని పార్టీకి కట్టుబడి ఉంటానని మక్తల్ నియోజకవర్గ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ఎంతగానో రెయిన్ పగలు శ్రమించి వాకిటి శ్రీహరి గెలుపు కోసం శ్రమించాను. కావున ఇట్టి విషయాన్ని స్థానిక యువకులు గమనించి జరగబోయే యూత్ కాంగ్రెస్ ఎన్నికలో నన్ను ఆశీర్వదించాలని ఆయన సందర్భంగా కోరారు.

# 10వ వార్డులో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం






పరకాల, ఆగస్టు 08 (తీన్మార్ న్యూస్): గురువారం పరకాల మున్సిపల్ పరిధిలోని 10వ వార్డులో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం స్థానిక కౌన్సిలర్ పసుల లావణ్య రమేష్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి పరకాల మున్సిపల్ చైర్మన్ సోదా అనిత రామకృష్ణ హాజరై వారు మాట్లాడుతూ స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం చెట్లు నాటడం, ఇంకుడు గుంతలు, ఇంకా అనేక కార్యక్రమాలు తోపాటు డెంగూ, మలేరియా రోగాలు రాకుండా ఈరోజు దోమల మందు పిచికారి చేయడం జరిగింది, ఇంటి చుట్టూ పరిశుభ్రత ఉంచుకోవడం మనం బాధ్యత వహించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహ మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్ రెడ్డి, వార్డు ఆఫీసర్ కే శోభ రాణి, జవాన్ సతీష్, శిరీష, అంగన్వాడి టీచర్ చంద్రకళ, హంస, ఆశా వర్కర్స్ సరిత, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

# గృహ ప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్న వైస్ చైర్మన్ విజయపాల్ రెడ్డి



పరకాల, ఆగస్టు 08 (తీన్మార్ న్యూస్): పరకాల వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ బండి సారంగపాణి నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పరకాల మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయాపాల్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చందుపట్ల నరసింహ రెడ్డి, కౌన్సిలర్స్ అడప రామన్న, శనిగరపు రజినీ నవీన్, చందుపట్ల సుజాత సాయి తిరుపతి రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షులు దుంపేటి నాగరాజు, యూత్ ప్రధాన కార్యదర్శి దుప్పటి సుజయ్ రణదేవ్, పీఏసిఎస్ డైరెక్టర్ పంచగిరి శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యులు షబ్బీర్ అలీ, ముఫీన ఫాతిమా హమీద్, మైనారిటీ నాయకులు యం.డి జలాలుద్దీన్, నాయకులు గొర్రె స్వామి లు పాల్గొన్నారు.

# విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నా

- సర్టిఫికెట్స్ ఇవ్వకుండా జీవితాలతో చెలగాటం ఆడద్దు
- ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం ఏర్పాటుకు డిమాండ్



పరకాల, ఆగస్టు 08 (తీన్మార్ న్యూస్): పరకాల డివిజన్ కేంద్రంలో డిబిఎఫ్, డివైఎఫ్ఐ, ఎబిఎస్ఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేయాలనీ ధర్నా నిర్వహించారు. డిబిఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు అంబాల అనిల్, ఎబిఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగుల పవన్ కళ్యాణ్ డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మంద సురేష్ మాట్లాడుతూ తెలంగాణ ఇంటర్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం అయ్యిందని అన్నారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం పెట్టాలని డిమాండ్ చేసారు. అలాగే పెండింగ్ లో ఉన్న ఫీజు రెయింబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలనీ అన్నారు. రెయింబర్స్మెంట్ విడుదల చేయక ప్రైవేట్ విద్యాసంస్థలు సర్టిఫికెట్స్ ఇవ్వకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయని అన్నారు. వెంటనే మధ్యాహ్న భోజన పథకాన్ని, రెయింబర్స్మెంట్ విడుదల చేసి విద్యార్థుల పక్షాన ప్రభుత్వం నిలుచొవాలని అన్నారు. సర్టిఫికెట్స్ ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బందికి గురి చేస్తున్న కాలేజ్ పర్మిషన్ రద్దు చేయాలనీ డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు అభిరామ్ మనోజ్, ఈశ్వర్, నరేష్, రమేష్, రమ్య, సంధ్య, రజిని, అనూష విద్యార్థులు పాల్గొన్నారు.

# బాధితులకు సత్వర న్యాయం అందేలా చూస్తా: ఎస్సై ఉపేందర్




పెద్దవంగర: మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎస్సై ఉపేందర్ అన్నారు. నవతెలంగాణ దినపత్రిక కు 9 వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వివిధ కేసుల పరిష్కారం కోసం పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందించేలా చూస్తాం అన్నారు. అసాంఘిక శక్తుల ఆటలు సాగనివ్వమని పేర్కొన్నారు. చట్టానికి వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారి పట్ల మరింత కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. నూతన చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కళా జాతర బృందాలతో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తాం అన్నారు. ప్రజలు తమ సమస్యలను తెలిపేందుకు, అసాంఘిక కార్యకలాపాలు, అనుమానిత వ్యక్తుల సమాచారం తెలిపేందుకు ప్రజలు 100 ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# నూతన డిఐఈఓకి ఘన సన్మానం

## జిల్లా ఒకేషనల్ లెక్చరర్స్ ఆధ్వర్యంలో




ఆత్మకూర్, ఆగస్టు 08 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా నూతన డిఐఈఓగా ఏ.అంజయ్య గోపాల్పేట్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం రోజు వనపర్తి జిల్లా ఒకేషనల్ లెక్చరర్స్ ఆధ్వర్యంలో స్థానిక డిఐఈఓ కార్యాలయంలో నూతన డిఐఈఓ అంజయ్యను శాలువాతో సన్మానించి పుష్పగుచ్చంతో శుభాకాంక్షలు తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో ఒకేషనల్ లెక్చరర్స్ పి.చంద్రశేఖర్ రెడ్డి,పిఎస్.శ్రీనివాసులు, ఉదయ్ భాస్కర్ రెడ్డి, టీజే.విశ్వేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# అపరిశుభ్రంగా ఉన్న ఇంటర్ కళాశాల గ్రౌండ్, డిఈఓ ఆవరణం

### టిడబ్ల్యూఎస్ఎస్ జిల్లా యూత్ అధ్యక్షులు పవన్ నాయక్



ములుగు, ఆగస్టు 08 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న జిల్లా విద్యాశాఖ కార్యాలయం మరియు ఇంటర్మీడియట్ కళాశాల ప్లేగ్రౌండ్ దీనిని ఆనుకునే ఉన్న మెడికల్ హబ్ కార్యాలయం వెనకాల అపరిశుభ్రంగా మరియు నీటి నిలువ ఉండడంతో పాటుగా విపరీతంగా దోమలు సంచరిస్తూ కళాశాలలకు విచ్చేస్తున్న విద్యార్థిని విద్యార్థులకు కాటు వేస్తూ అనారోగ్యానికి గురి అవుతున్న పట్టించుకోని స్థానిక అధికారులు సంబంధిత.కనుక జిల్లా అధికారులు దీనిని పట్టించుకోకుండా ఎవరి పనుల్లో వారు చేసుకుంటూ కనీసం దీని వైపు చూడకుండా వెళ్ళిపోతున్నారు. ఈ దోమల వల్ల పేద విద్యార్థులు అనారోగ్యానికి గురై విద్యార్థుల తల్లిదండ్రులు కష్టపడి సంపాదించిన డబ్బులను ప్రైవేటు ఆస్పత్రులలో ఖర్చు పెట్టడం జరుగుతుంది. కనుక సంబంధిత అధికారులు వెంటనే ఇట్టి విషయాన్ని గ్రహించి నీరు నిలువ కాకుండా ఒక కాలవకుండా పంపిస్తే బాగుంటుందని లేనియెడల విద్యార్థిని, విద్యార్థుల ప్రాణాలకే ముప్పుందని తగు చర్యలు తీసుకోవాలని టి డబ్ల్యూ ఎస్ ఎస్ ములుగు డిస్ట్రిక్ట్ యూత్ ప్రెసిడెంట్ జరుపుల పవన్ నాయక్ తెలిపారు.

# తల్లి పాలతోనే శిశువుకు సంపూర్ణ ఆరోగ్యం

### ప్రముఖ స్త్రీ వైద్య నిపుణులు ఎం.రోజా

జగిత్యాల: తల్లి పాలతోనే శిశువుకు సంపూర్ణ ఆరోగ్యం అని ప్రముఖ స్త్రీ వైద్య నిపుణులు ఎం.రోజా తెలిపారు. స్థానిక ప్రభుత్వం మహిళ డిగ్రీ కళాశాల జగిత్యా లలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా కళాశాల ప్రిన్సిపల్ ఎన్ఎస్ఎస్ చైర్మన్ ప్రొఫెసర్ కలువకుంట రామకృష్ణ మాట్లాడుతూ తల్లిపాలతోనే శిశువు ఆరోగ్యంగా పెరుగుతుందని అందువల్ల విద్యార్థులు ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలని తద్వారా భవిష్యత్తులో ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో తోడ్పడాలని చెప్పారు. ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ రోజా మాట్లాడుతూ 1992 నుండి తల్లిపాల వారోత్సవాలు నిర్వహించడం ఆరంభమై, ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 120 దేశాల్లో ప్రతి సంవత్సరం ఆగస్టు ఒకటి నుండి ఏడవ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తూ స్త్రీలలో అవగాహన కల్పిస్తున్నాయని చెప్పారు. తల్లిపాలతో శిశువుకు రోగనిరోధకత శక్తి మెదడు పెరుగుదల ఏర్పడి తద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, మొదటి మూడు రోజులలో వచ్చే పసుపు రంగు ముర్రుపాలలో అనేక ప్రతిరక్షక కణాలు (ఆంటీ బాడీస్) ఉంటాయని వాటివల్ల సహజ నిరోధకత ఏర్పడి తద్వారా శిశువు అనేక ఇన్ఫెక్షన్లకు దూరంగా ఉంటుందని వివరించారు.

శిశువుకు పాలు ఇవ్వటం ద్వారా తల్లి కూడా బ్రెస్ట్ క్యాన్సర్, ఒవేరియన్ క్యాన్సర్ లాంటి భయంకర వ్యాధుల నుండి రక్షణ పొందవచ్చునని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ చంద్రయ్య ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎన్ సంగీతారాణి, డాక్టర్ జి శ్రీలత, డి సుజాత, అధ్యాపకులు డాక్టర్లు వాసవి, నీరజ, ప్రమోద్ కుమార్, వరప్రసాద్ రామచంద్రం, జమున తదితర అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు ఆరోగ్యపరమైన వివిధ సమస్యలు గూర్చి తెలుపగా వాటన్నిటికీ డాక్టర్ రోజా వివరించి వారిలో అవగాహన కల్పించారు.

# నియోజకవర్గ వ్యాప్తంగా అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ఆదేశాలు



పరకాల, ఆగస్టు 08 (తీన్మార్ న్యూస్): పరకాల నియోజకవర్గ వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులను గుర్తించి,వెంటనే పూర్తి చేయాలని పరకాల శాసన సభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పరకాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్ మరియు ఆర్ డబ్ల్యూ ఎస్ అధికారులతో ఎమ్మెల్యే శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి అబివృద్ధి పనులపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే అధికారులు తన దృష్టికి తీసుకురావాలని, గ్రామాలలోనీ సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా కృషి చేయాలని అన్నారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేయిస్తానని అన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయడంతో పాటు, కొత్త అభివృద్ధి పనులను ప్రణాళికా బద్ధంగా చేపట్టాలని ఆయన అధికారులకు సూచించారు. నూతనంగా మంజూరైన పనుల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పనుల ప్రగతిని వేగవంతం చేసి రోడ్లు మరియు భవనాలను నాణ్యతగా నిర్మించాలన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా కొత్తగా ఏర్పాటు చేస్తున్న రహదారులు, మంచినీటి, పైపులైన్ల పనుల పురోగతిని ఎంఎల్ఏ అడిగి తెలుసుకున్నారు. వివిధ శాఖల అధికారులతో సమన్వయం చేసికొని నియోజకవర్గ వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి పనుల మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. గ్రామాలలో కొత్తగా ప్రతిపాదించిన పనుల నిర్మాణాలకు అంచనా వ్యయాన్ని సిద్ధం చేయాలన్నారు. అంతే కాకుండా పనుల చేపడుతున్న సమయంలో ప్రజలకు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. సమస్యల పరిష్కారానికి తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత పరిష్కారం చేయాలని ఎమ్మెల్యే సూచించారు.

# విద్యార్థులకు మంచి విద్య, ఆహారం అందించాలి

జయశంకర్ భూపాలపల్లి: విద్యార్థులకు మెరుగైన విద్య, నాణ్యమైన ఆహారం అందించాలి, సీజన్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. గురుకుల పాఠశాలలలో మౌలిక వసతులు కల్పనపై కెజిబివి, ఎస్సి, బిసి, గిరిజన సంక్షేమ, గురుకుల పాఠశాలలు, వసతి గృహ సంక్షేమ అధికారులతో గురువారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు మెరుగైన విద్య నాణ్యమైన ఆహారం అందించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఐడిఓసి కార్యాలయపు సమావేశ మందిరంలో కేజిబివి, ఎస్సి, బిసి జిల్లా అధికారులు, గిరిజన, గురుకుల, మహాత్మా జ్యోతి భా పూలే, మోడల్ పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాల్స్, వసతి గృహ సంక్షేమ అధికారులతో సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ విద్యార్థుల సంఖ్య ,గైర్హాజరు శాతం, మౌలిక సౌకర్యాలు కల్పన, సిబ్బంది వివరాలు, మెనూ ప్రకారం భోజనం అందచేయుట తదితర అంశాలపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని గురుకుల, సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మెరుగైన విద్య అందించాలని ఆదేశించారు. ఎస్సి 11, బిసి 7, కెజిబివిలు 11, మోడల్ పాఠశాలలు 5, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల 1, గిరిజన సంక్షేమ 23, మైనార్టీ 9 నిర్వహించబడుతున్నాయని వాటిలో 8795 మంది విద్యార్థులు విద్య నభ్యసిస్తున్నట్లు తెలిపారు. అన్ని సంక్షేమ వసతి గృహాలల్లో విద్యుత్ సరఫరా, తరగతి గదుల సంఖ్య, ఆర్.ఓ ప్లాంట్, సోలార్ వాటర్ హీటర్లు ప్రహరిలు, మౌలిక వసతులు, భవనాలు, మంచి నీటి బోర్లు, మిషన్ భగీరథ నల్లా కనెక్షన్, మురుగునీటి నిల్వలు, డ్రైనేజీ సమస్యలు వంటి సమస్యల పరిష్కారానికి ప్రతి ప్రతిపాదనలు ఇవ్వాలని, అట్టి ప్రతిపాదనలు ఆధారంగా ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించి అంచనా నివేదికలు తయారు చేయనున్నట్లు ఆయన తెలిపారు. వసతి గృహాలకు సరఫరా చేయు నిత్యావసర సరుకుల్లో నాణ్యత ఉండాలని తెలిపారు. మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందించాలని స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబల కుండా విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించు విధంగా అవగాహన కల్పించాలని అన్నారు. వంట చేయు ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆహారాలను తనిఖీ చేయాలని ఎవరైనా విద్యార్థులు జ్వరాలు, ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతుంటే సంబంధిత వైద్య శాఖ అధికారులకు సమాచారం అందించి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, బీసీ, మైనారిటీ శాఖ అధికారి శైలజ, ఎస్సీ అభివృద్ధి అధికారి సునీత, గురుకుల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వసతి గృహ సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సమాజ వికాసానికి పరిశోధనలే గీటురాయి

### ప్రభుత్వ పాలనా విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ గంగిడి శ్రీనివాసరెడ్డి



హన్మకొండ కేయు, ఆగస్టు 08 (తీన్మార్ న్యూస్): గురువారం కాకతీయ విశ్వవిద్యాలయంలోని ప్రభుత్వ పాలన మరియు మానవ వనరుల విభాగం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలన మరియు మానవ వనరుల విభాగం పరిశోధక విద్యార్థుల ప్రయోజనార్థం విభాగం అధిపతి ప్రొఫెసర్ పెదమళ్ళ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పీహెచ్. డి విద్యార్థులకు ఐదు రోజుల గేస్ట్ లెక్చర్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం నాలుగో రోజులో భాగంగా ప్రభుత్వ పాలన రిటైర్డ్ ప్రొఫెసర్ గంగిడి శ్రీనివాసరెడ్డి అమెరికా నుండి ఆన్ లైన్ లో హాజరై "పరిశోధన పద్ధతి ప్రక్రియ" అనే అంశం పై మాట్లాడుతూ పరిశోధక విద్యార్థులకు పలు సూచనలు సలహాలు చేశారు. సమాజ వికాసానికి సామాజిక శాస్త్ర పరిశోధనలు చాలా ప్రాముఖ్యత కలిగి ఉన్నాయని పరిశోధకులు పరిశోధన అంశం ఎంపిక విషయంలో శాస్త్రీయ పద్దతిలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పరిశోధన శీర్షిక క్లుప్తంగా ఉండాలని ప్రతి పరిశోధన ఒక కొత్త విషయం మరియు కొత్త పరిష్కారం తెలియజేస్తుందని ఎవరు చెప్పని విషయం చెప్పేదే పరిశోధన అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విభాగం అధ్యాపకులు డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు "డేటా సేకరణలో పరిశోదనా పద్ధతులు" అనే అంశం పై మాట్లాడుతూ పరిశోధకులు పరిశోధన అంశం పై పూర్తిగా అవగహన కలిగివుండాలని పరిశోధకులు క్షేత్రస్థాయిలో పరిశోధన అంశానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని నిబద్ధత తో సేకరించాలని సమాచార సేకరణలో వాస్తవికతను ప్రపంచానికి తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాలనా సీనియర్ ప్రొఫెసర్ మరియు చైర్మన్ బోర్డు అఫ్ స్టడీస్ ప్రొఫెసర్ తోపుచర్ల యాదగిరిరావు, విభాగం అధ్యాపకులు, డాక్టర్ చీకటి శ్రీను, డాక్టర్ బుర్రి ఉమా శంకర్ డాక్టర్ మోహన్, డాక్టర్ బండి శ్రీనివాస్, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

# రాంగ్ సైడ్ తో ఇక చిక్కులే...

హైదరాబాద్: హైదరాబాద్‌లో ఎంత కఠినంగా ట్రాఫిక్ రూల్స్ అమలు చేస్తున్నా రోజూ ఏదో చోట ప్రమాదం జరుగుతూనే ఉంది. సక్రమంగా వెళ్లే వారితో ఎలాంటి సమస్యలు ఉండటం లేదు. కానీ తక్కువ దూరమే కదా అని రాంగ్ రూట్‌లో వెళ్లేవారితో, నిమిషాలు కూడా సిగ్నల్ వద్ద ఆగలేని వారితోనే సమస్య వచ్చి పడుతోంది. ఇలాంటి వారిని నియంత్రించేందుకు చట్టానికి మరింత పదును పెడుతున్నారు హైదరాబాద్ పోలీసులు. కొందరికి యూ టర్న్ వరకు వెళ్లడానికి కొందరు ఇష్టపెట్టుకోరు. కొద్ది దూరమే కదా అని రాంగ్ రూట్‌లో వెళ్తుంటారు. అలాంటి వారు రోజురోజుకూ పెరిగిపోతున్నారు. ఇలాంటి వారితో జరిగే ప్రమాదాలు కూడా ఎక్కువ అవుతున్నాయి. అందుకే వీరిని నియంత్రించేందుకు పోలీసులు కఠిన చర్యలకు సిద్ధమవుతున్నారు. ఇకపై యూ టర్న్ తీసుకోకుండా రాంగ్ రూట్‌లో డ్రైవింగ్ చేస్తే జైలుకు వెళ్లాల్సి ఉంటుందని చెబుతున్నారు. రాంగ్ రూట్‌లో వెళ్తూ ప్రమాదానికి కారణమైతే ఎఫ్ఐర్ నమోదు చేసి వారిని కోర్టులో హాజరుపరిచే ప్రక్రియ సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో మే నుంచే అమల్లో ఉంది. దీన్ని మిగతా కమిషనరేట్ పరిధిలో కూడా అమలు చేసేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. సైబరాబాద్ పరిధిలో నెలరోజుల్లోనే రెండు వందల మందికిపైగా వాహనదారులపై ఎఫ్ఐఆర్ నమోదు అయింది. అంటే ఎంత మంది ఇలా రాంగ్ రూట్‌లో వెళు_న్నారో అర్థమవుతుందని పోలీసులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ర్యాష్ డ్రైవింగ్, డ్రంకన్ అండ్ డ్రైవ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ ప్రధాన కారణంగా పోలీసులు గుర్తించి ఇప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. వీటి కారణంగానే మూడు కమిషనరేట్ పరిధిలో రోజూ పదుల సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇందులో ఒకరిద్దరు ప్రాణాలు కూడా కోల్పోతున్నారు. మూడు కమిషనరేట్ పరిధిలో బుధవారం స్పెషల్ డ్రైవ్ చేపడితే భారీగా వాహనదారులు పట్టుబడ్డారు. ఇందులో దాదాపు ఏడు వందల మంది వరకు రాంగ్ రూట్‌లో వస్తూ పోలీసులకు చిక్కారు. వీరిలో టూ వీలర్స్ డ్రైవ్ చేసే వాళ్లే ఎక్కువ మంది ఉన్నారు. ఇలాంటి వారి వల్లే ఈ ఏడాది ఇప్పటి వరకు వందల ప్రమాదాలు జరిగాయని అందులో వందమందికిపైగా గాయపడగా.. ఒకరు చనిపోయినట్టు పోలీసులు రికార్డులు చెబుతున్నాయి. ఇలా రాంగ్ సైడ్ డ్రైవింగ్‌తో ప్రజల ప్రాణాలు హరిస్తున్న వారిని గుర్తించేందుకు పోలీసులు సడెన్‌గా డ్రైవ్‌లు చేపట్టడంతోపాటు చాలా ప్రాంతాల్లో ప్రత్యేక కెమెరాలు ఏర్పాటు చేశారు. ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్న దాదాపు 125 ప్రాంతాల్లో అత్యాధునిక కెమెరాలతో నిఘా పెట్టారు. వీటి ఫుటేజ్ ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని ఎవరైనా రూల్స్ అతిక్రమిస్తే కచ్చితంగా వారిపై ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేస్తామని హెచ్చరిస్తున్నారు

# నేడు మున్సిపాలిటీలో డ్రైడే కార్యక్రమం

### – స్వచ్ఛదనం పచ్చదన కార్యక్రమంలో భాగంగా మొక్కల పంపిణీ కార్యక్రమం

### – ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ ఏ.నాగరాజు



ఆత్మకూర్, ఆగస్టు 08 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డులో వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదేశానసారం ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం రోజు నిర్వహించడం జరుగుతుందని. ఇట్టి కార్యక్రమానికి ఆత్మకూర్ మున్సిపల్ చైర్ పర్సన్ ఏం.గాయత్రి రవి కుమార్ యాదవ్, వైస్ చైర్పర్సన్ విజయభాస్కర్ రెడ్డి,కౌన్సిలర్లు,వార్డ్ ఆఫీసర్లు, ఆర్పీలు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొనున్నారు. అదేవిధంగా స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం ఉంటుంది. మొక్కల పంపిణీ కార్యక్రమం కూడా ఉంటుంది కావున ఇట్టి కార్యక్రమాన్ని మున్సిపల్ ప్రజలు ప్రతి ఒక్కరు తమ వంతు కృషిగా పాల్గొని పర్యావరణ పరిశుభ్రతకు సహకరించాలని ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# సిటీ బస్సుల పెంపదల కోసం సీపీఐ(ఎం) ఆందోళన

హైదరాబాద్: సిటీ బస్సులు పెంచాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) నగర కమిటీ ఆధ్వర్యంలో ఈరోజు ఆర్టీసీ క్రాస్ రోడ్ లోని బస్ భవన్ ముందు ధర్నా జరిగింది. ఈ ధర్నాకు ముఖ్యఅతిథిగా హాజరైన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడిన ముఖ్యాంశాలు.




– ప్రజా రవాణా పెరగడమే హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యలకు కీలకమైన పరిష్కారం లభిస్తుంది, రోడ్ల వెడల్పు ఫ్లైఓవర్ల ఎన్ని నిర్మించినా ప్రజారవాణా పెరగడమే ముఖ్యం.

– మహాలక్ష్మి స్కీం ప్రకటించిన తర్వాత అనేకమంది మహిళలు సొంత వాహనాలను వదిలేసి బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు, ఇది స్వాగతించాల్సిన పరిణామం. పెరిగిన ప్రయాణికులకు అనుగుణంగా బస్సులు పెంచడం మీద ప్రభుత్వం దృష్టి పెట్టాలి.

– నగరంలో ఆర్టీసీ బస్సుల సంఖ్యను రెట్టింపు చేయాల్సిన అవసరం ఉన్నది, అవసరమైన బస్సుల కొనుగోలు చేయాలి, రాష్ట్ర ప్రభుత్వం బస్సుల కొనుగోలుకు తగిన బడ్జెట్ కేటాయించాలి

– రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజా రవాణాకు ప్రాధాన్యతని ఇవ్వాల్సిన అవసరం ఉంది.

– మెట్రో రైల్ బోగీలను మూడు నుంచి ఆరుకు పెంచడం, ఎం ఎం టి ఎస్ లోకల్ రైళ్లను పెంచడం, సమయపాలన పాటించేటట్లు చూడడం ద్వారా ప్రచారవాణాను పెంచవచ్చు.

ధర్నాను ఉద్దేశించి సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నరసింహారావు, నగర కార్యదర్శి ఎం శ్రీనివాస్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం శ్రీనివాసరావు, ఎం మహేందర్, ఎం దశరథ్, కె నాగలక్ష్మి తదితరులు ప్రసంగించారు. సీపీఐ(ఎం) నగర కమిటీ సభ్యులు, వివిధ జోన్ ల కార్యదర్శులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ధర్నా అనంతరం ఎమ్మెల్సీ నర్సిరెడ్డి నాయకత్వంలో ఆర్టీసీ ఎండి వీసీ సజ్జనార్ ని కలిసి నగరవ్యాప్తంగా ప్రజల నుండి సేకరించిన సంతకాలతో కూడిన మెమోరాండం ఇవ్వడం జరిగింది, సిటీ బస్సులు పెరగాల్సిన అవసరం ఉందని, ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాస్తానని వీసీ సజ్జనార్ చెప్పారు.

# కాపర్ వైర్, ఆయిల్ చోరీలకు పాల్పడుతున్న ముఠా అరెస్ట్



నల్లగొండ : కొంతకాలంగా నల్లగొండ జిల్లాలో ట్రాన్స్‌ఫార్మర్లను డ్యామేజ్ చేసి అందులోని కాపర్ వైర్, ఆయిల్ చోరీలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. జిల్లాలోని చందంపేట మండలం యల్మలమంద గ్రామానికి చెందిన మెగావత్ రంగా నాయక్, జటావత్ ఇమామ్ నాయక్, జటావత్ మౌలాన నాయక్, షేక్ జటావత్ వలీ నాయక్, కేతావత్ సునిల్ ఐదుగురు ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లను డ్యామేజ్ చేసి అందులోని కాపర్ వైర్, ఆయిల్ చోరీ చేసి ఎవరికి అనుమానం రాకుండా కారులో హైదరాబాద్‌కు తరలించి అమ్ముకొని సొమ్ము చేసుకునే వారని చెప్పారు. విశ్వసనీయ సమాచారం మేరకు వాడపల్లి వద్ద ముఠా సభ్యులను అదుపులోకి తీసుకొని నిందితుల వద్ద నుంచి రూ.9 లక్షల నగదు, ఓ కారు, నాలుగు మొబైల్స్ స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు. చాకచక్యంగా దొంగలను పట్టుకున్న పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో జీరో విద్యుత్తు బిల్లులు

**– హర్షం వ్యక్తం చేస్తున్న ప్రధానోపాధ్యాయులు**



మల్హర్ రావు: గత కొంతకాలంగా ప్రభుత్వ పాఠశాలల సమస్యల్లో విద్యుత్తు బిల్లులు ఒకటి. రాష్ట్ర ప్రభుత్వం ఏటా తీసుకొస్తున్న సంస్కరణలు, బోధన సౌకర్యాలతో విద్యుత్తు వాడకం పెరుగుతుంది. పాఠశాలల నిర్వహణ నిధులు సరిపోక బిల్లుల బకాయిలు పేరుకుపోతున్నాయి. మండలంలో మెజారిటీ పాఠశాలలు వేల రూపాయాల బిల్లులు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సీఎం ప్రకటనతో మండలంలోని ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


వేలల్లో బకాయిలు: మన ఊరు–మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల కార్యక్రమాల ద్వారా మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఫ్యాన్లు, లైట్లు, బోర్ పంపులు, శుద్ధజల ప్లాంట్లు ఏర్పాటు చేశారు. ఇంతకుముందే డిజిటల్ విద్యలో బాగంగా ప్రొజెక్టర్లు, కంప్యూటర్లు పాఠశాలల్లో ఉన్నాయి. మరో వైపు అధికారులు పాఠశాలలకు కేటగిరీ–7ఏ కింద విద్యుత్తు కనెక్షన్లు ఇచ్చారు. పాఠశాలల్లో సెలవుల్లో మినహా కరెంటు వాడకం తప్పనిసరి కావడంతో బిల్లులు పెరుగుతున్నాయి. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో నెలకు రూ.800 నుంచి రూ.వెయ్యి వరకు, ఉన్నత పాఠశాలల్లో గదులు, డిజిటల్ తెరలు, విద్యార్థులు ఎక్కువ ఉండటంతో రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు.. కేజీ బీవీలు, ఆదర్శ పాఠశాలలకు రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు విద్యుత్తు బిల్లులు వస్తున్నాయి. ప్రధానోపాధ్యా యులు, ప్రిన్సిపాల్ల నిర్వహణ నిధులు సరిపోక ఇబ్బందులు పడుతున్నారు.కొందరైతే సొంత డబ్బులు ఖర్చు చేస్తున్నారు.

నిర్వహణకు సరిపోని నిధులు..

ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం ఏటా విద్యా ర్థుల సంఖ్య ఆధారంగా రూ.10 వేల నుంచి రూ.75 వేల వరకు నిర్వహణ నిధులు అందిస్తోంది.మండలంలో రూ.50 వేల నిధులిచ్చే పాఠశాలలు లేవు. రూ.10 వేలు, రూ.25 వేలు వచ్చేవి ఉన్నాయి. ఈ నిధులు జాతీయ పండుగలు, కంప్యూటర్లు, ల్యాబ్స్ నిర్వహణ, స్టేషనరీ, విద్యుతు బిల్లులు, చిన్న చిన్న మరమ్మతులు, నెట్ చార్జీలు,తాగునీరు తదితర సదుపాయాలకు సరిపోవడంలేదని ప్రధానోపాధ్యాయులు పేర్కొంటున్నారు. విద్యుత్తు బిల్లులు చెల్లిస్తే మిగిలిన వాటికి ఒక్క పైసా కూడా మిగలడం లేదని వాపోతున్నారు. దీంతో పెద్దమొత్తం విద్యుత్తు బిల్లులు బకాయిలుగా పేరుకుపోతున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటనతో పాఠశాలల నిర్వహణకు నిధుల కొరత తప్పనుంది.

# మైనర్ బాలికలపై జరుగుతున్న హత్యాచారాలను అరికట్టాలి

**– ఐద్వా ఆధ్వర్యంలో ఏవో కు వినతి**



కంటేశ్వర్ : మైనర్ బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలని కోరుతూ గురువారం ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఏవో ప్రశాంత్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు అనిత, జిల్లా కార్యదర్శి సుజాత మాట్లాడుతూ..

నిజామాబాద్ జిల్లాలో ఈ మధ్యకాలంలో మైనర్ బాలికలపై అత్యాచారాలు విపరీతంగా పెరిగిపోయయి. ఈ మధ్యకాలంలో దాదాపు ఆర్మూర్లో ఒక ఆరు సంఘటన జరిగాయి . నిజామాబాద్ నగరంలో దాదాపు నాలుగు నుంచి ఐదు సంఘటనలు జరిగాయి అని తెలియజేశారు. బోధనలో రెండు రోజుల క్రితం జరిగింది ఇలా అనేక మండలాల్లో జిల్లా వ్యాప్తంగా జరుగుతూ ఉన్నాయి. మైనర్ బాలికల పై హత్యాచారానికి పాల్పడుతున్న మృగాళ్లకు పసి పిల్లల జీవితాలతో ఆటలాడుతున్న వారిపై ఫోక్సో చట్టం అమలు పరిచి కఠినమైన చర్యలు తీసుకోవాలి అని డిమాండ్ చేశారు. ఆడపిల్లలకు బడిలో గుడిలో సమాజంలో బయటకు వెళ్లిన ఆడపిల్ల ఇంటికి వచ్చేంతవరకు కన్న తల్లిదండ్రులకు నిరంతరం భయపడుతూ బ్రతకాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది. వీటిపై నిజామాబాద్ పోలీస్ కమిషనర్ ప్రత్యేక దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలి ఐద్వా డిమాండ్ చేశారు. లేదంటే రానున్న కాలంలో నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

# అకారణంగా సస్పెండ్ చేసిన కండక్టర్‌ను విధుల్లోకి తీసుకోవాలి

**– జనగామ ఆర్టీసీ డిపోలో కార్మికుల ఆందోళన**
**– ఆరు గంటలపాటు నిలిచిన ఆర్టీసీ సేవలు**
**– సీపీఐ(ఎం) మద్దతు**




జనగామ: అకారణంగా సస్పెండ్ చేసిన జనగామ జిల్లా ఆర్టీసీ డిపో కండక్టర్‌ను విధుల్లోకి తీసుకోవాలని ఆ డిపో కార్మికులు ఆందోళన చేపట్టారు. కండక్టర్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరుతూ బుధవారం ఆర్టీసీ డిపో ఎదుట బైటాయించి ధర్నా చేపట్టారు. దాంతో గంటల తరబడి బస్సులు డిపోకే పరిమితమయ్యాయి. కండక్టర్‌కు–ప్రయాణికు నికి మధ్య తలెత్తిన వివాదంలో ఎలాంటి విచారణ లేకుండా కండక్టర్‌ని సస్పెండ్ చేశారని కార్మిక నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులు ఎస్ఆర్‌రెడ్డి, నగందుల సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. హన్మకొండ నుంచి వస్తున్న ఓ గర్భిణీకి.. సీటు ఇవ్వాలని తోటి ప్రయాణికురాలిని కండక్టర్ కోరగా సదరు ప్రయాణికురాలితో అతనికి వాగ్వాదం చోటుచేసుకుంది. దాంతో సదరు ప్రయాణికురాలు మధ్యలోనే బస్సు దిగిపోయి ఆర్టీసీ అధికారులకు ట్విటర్ ద్వారా ఫిర్యాదు చేశారు. దాంతో డిపో మేనేజర్ స్వాతి విచారణ జరపకుండా ఆ కండక్టర్‌ను విధుల నుంచి తొలగిస్తున్నట్టు మెమో జారీ చేశారు. దీన్ని తీవ్రంగా ఖండించిన ఆర్టీసీ ఉద్యోగులు.. కండక్టర్ శంకర్‌కు తిరిగి ఉద్యోగం ఇవ్వాలని నిరసిస్తూ ఆర్టీసీ డిపో ముందు ధర్నాకు దిగారు. కండక్టర్‌పై సస్పెన్షన్ ఎత్తేసే వరకు ఆందోళన విరమించేది లేదని కార్మికులు భీష్మించి కూర్చున్నారు. దాంతో అక్కడికి వచ్చిన ఆర్టీసీ ఆర్ఎం విజయభాను.. విచారించి, వెంటనే చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

కాగా, గంటల తరబడి డిపో ఎదుట కార్మికులు ఆందోళన చేపట్టడంతో ఒక్క బస్ కూడా డిపో నుంచి బయటికి రాలేదు. దాంతో జనగామ ఆర్టీసీ బస్టాండ్ నిర్మానుష్యంగా మారింది. ఆర్టీసీ కార్మికుల ఆందోళనకు సీపీఐ(ఎం) మద్దతు జనగామ ఆర్టీసీ డీఎం స్వాతి, సీఐ హుస్సేన్ తప్పుడు నివేదిక ఆధారంగా సస్పెండైన కండక్టర్ బానోతు శంకర్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ కార్మికులు చేపట్టిన ధర్నాకు సీపీఐ(ఎం) మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి మాట్లాడుతూ.. పూర్తి విచారణ చేయకుండానే ఇచ్చిన నివేదిక ఆధారంగా సస్పెండ్ చేయడం చట్టవిరుద్ధమని అన్నారు. కండక్టర్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఆ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఇర్రి అహల్య, జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, జోగు ప్రకాష్, సీనియర్ నాయకులు గురజాల లక్ష్మీనరసింహారెడ్డి, మైబల్లి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సుంచు విజేందర్, జిల్లా ఉపాధ్యక్షులు బొట్ల శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం, నాయకులు పాల్గొన్నారు.

# సాగర్‌లో 18 గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటివిడుదల

**– శ్రీశైలం నుంచి 3,50,730 క్యూసెక్కుల ఇన్ ఫ్లో పర్యాటకుల సందడి**



నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ డ్యామ్ 18 క్రస్ట్ గేట్లలో 14గేట్లను 10 అడుగులు, నాలుగు గేట్లను 5 అడుగులు ఎత్తి 2,24,574 క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. బుధవారం ఉదయం నుంచి 20గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగగా.. సాయంత్రానికి ఎగువ నుంచి ఇన్ ఫ్లో తగ్గడంతో రెండు గేట్లను మూసేశారు. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి 3,50,730 క్యూసెక్కుల నీరు సాగర్ రిజర్వాయర్‌లోకి చేరుతోంది. నాగార్జునసాగర్ డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు కాగా, ప్రస్తుతం 584.60 అడుగుల వద్ద నీరు నిల్వవుంది. డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా, ప్రస్తుతానికి 296.2810 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 29,151 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్ నుంచి మొత్తం 2,70,574 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

కొనసాగుతున్న పర్యాటకుల సందడి

నాగార్జునసాగర్ ప్రాజెక్టు 18 గేట్ల ద్వారా నీరు విడుదలవుతుండటంతో డ్యామ్ అందాలను చూసేందుకు పర్యాటకులు బుధవారం కూడా భారీగా తరలివచ్చారు. హిల్ కాలనీ లాంచీ స్టేషన్ వద్ద, డ్యామ్, కొత్త బ్రిడ్జి, పాత వంతెన వద్ద పర్యాటకుల సందడి నెలకొంది. డ్యామ్ విద్యుత్ జలకేంద్రం వద్ద రద్దీ ఉంది. పర్యాటకులు సెల్ఫీలు దిగుతూ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# 'మా సమస్యను పట్టించుకోరు'.. నిజాం కాలేజీ విద్యార్థుల వినూత్న నిరసన



హైదరాబాద్: బషీర్‌బాగ్ నిజాం కాలేజీలో డిగ్రీ విద్యార్థులు వినూత్న పద్ధతిలో నిరసన వ్యక్తం చేస్తున్నారు. గత ఆరు రోజులుగా విద్యార్థులు ధర్నా చేస్తున్న విషయం తెలిసిందే.

అయినా కూడా వీరి బాధను సమస్యలను ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. దీంతో విద్యార్థులు అందరూ కలిసి వినత్న రీతిలో నిరసన వ్యక్తం చేస్తున్నారు. గత ఆరు రోజులుగా డిగ్రీ విద్యార్థులు గర్ల్స్ హాస్టల్ లో 100% అడ్మిషన్లు కేవలం డిగ్రీ విద్యార్థినిలకే కేటాయించాలని నిరసన వ్యక్తం చేస్తున్నారు. గర్ల్స్ హాస్టల్లో డిగ్రీ విద్యార్థుల కోసం 2022లో నిర్మించినట్లు విద్యార్థులు తెలిపారు. ఆ ఏడాది డిగ్రీ విద్యార్థుల అడ్మిషన్లు తక్కువగా ఉండటం వల్ల పీజీ విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించారు.

కానీ ఈ ఏడాది డిగ్రీ విద్యార్థుల అడ్మిషన్లు ఎక్కువగా వచ్చాయని తమకే పూర్తిస్థాయిలో హాస్టల్లో అడ్మిషన్లు కల్పించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. అయినా కూడా తమ సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే విద్యార్థులు తమ నిరసనను కొనసాగిస్తూ ఉన్నారు. ఈ రోజు విద్యార్థులు వినూత్నంగా కాలేజీ ఆవరణంలో వంట మార్పు చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఇదేమి రాజ్యం ఇదేమి రాజ్యం.. దొంగల రాజ్యం దోపిడీ రాజ్యం.. అంటూ నినాదాలు చేశారు. తమ డిమాండ్ ఒప్పుకునే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదన్నారు. ప్రిన్సిపాల్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ విద్యార్థులందరూ పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు.

# ఢిల్లీలో గులాబీ నేతలు...

హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీలో ఏం జరుగుతోంది? ఆ పార్టీకి చెందిన ఇద్దరు కీలక నేతలు ఢిల్లీలో ఎందుకు మకాం పెట్టారా? కవితతో సమావేశం అయ్యేందుకు వెళ్లారా? లేక రాజకీయ వ్యవహారాల కోసం వెళ్లారా? ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో మాజీ సీఎం కేసీఆర్ కూతురు కవిత అరెస్టయి జైలులో ఉన్నారు. దాదాపు ఐదు నెల లు గడిచిపోయాయి. బెయిల్‌పై బయటకు వచ్చేందుకు తెగ ప్రయత్నాలు చేస్తున్నారు. సీబీఐ, ఈడీ అభ్యర్థనతో న్యాయస్థానం బెయిల్ ఇవ్వలేదు. కవితను బయటకు తీసుకొచ్చేందుకు తెగ ప్రయత్నాలు చేస్తున్నారు గులాబీ బాస్ కేసీఆర్. కానీ ఎలాంటి ఫలితాలు ఇవ్వలేదు.మంగళవారం ములాఖత్ సమయంలో తీహార్ జైలులో ఉన్న కవితతో మరోసారి భేటీ అయ్యారు కేటీఆర్, హరీష్‌రావులు. ఇరువురు మధ్య దాదాపు అరగంట సేపు మాట్లాడుకున్నారు. నాన్న కేసీఆర్ ఆరోగ్యం ఎలా వుందని కేటీఆర్‌ను కవిత అడిగినట్టు తెలుస్తోంది.అసెంబ్లీ సమావేశాలకు వచ్చినప్పుడు వార్తల్లో చూశానని గుర్తు చేశారట. పిల్లలు ఎలా ఉన్నారని, తనను బయటకు వేగంగా తీసుకెళ్లాలని కోరినట్టు వార్తలు వస్తున్నాయి. ఇక్కడ ఉండలేకపోతున్నారని చెప్పారట. బెయిల్ విషయమై సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం.ఢిల్లీలో బీజేపీతో బీఆర్ఎస్ మంతనాలు జరుపుతున్నట్లు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. కానీ అలాంటి దేమీ జరగలేదని అంతర్గత సమాచారం. ఈ తరహా ఫీలర్ బీఆర్ఎస్ పార్టీ వర్గాలు బయటకు వదిలాయని సమాచారం. దీనిపై కాంగ్రెస్, బీజేపీ నేతలు ఏ విధంగా రియాక్ట్ అవుతారోనని గులాబీ బాస్ గమనిస్తున్నార ట. ఈ విషయంలో టీ బీజేపీ నేతలు రియాక్ట్ కాకుండా ఉండాలనే ఆలోచనతో ఈ స్కెచ్ వేశారన్నది కొందరు నేతల మాట.బీజేపీతో గనుక చర్చలు జరిపితే కవితకు బెయిల్ ఎప్పుడో వచ్చేదని అంటున్నారు. గతంలో చాలామంది నేతలు కమలనాథులతో చర్చలు జరిపిన వారం, పది రోజులకు జైలు నుంచి బయటకు వచ్చిన విషయా లను గుర్తు చేస్తున్నారు. అటు కాంగ్రెస్ నేతలను నోరు ఎత్తుకుండా ఉండేందుకు.. పార్టీ మారిన నేతల విషయమై ఢిల్లీలో సీనియర్ అడ్వకేట్లతో చర్చిస్తున్నట్లు పైకి చెబుతున్నారు. మొత్తానికి ఢిల్లీ చర్చల గురించి రాబోయే రోజుల్లో ఇంకెన్ని విషయాలు వెలుగులోకి వస్తాయో చూడాలి.


# డ్రమ్ములో శవం స్టోరీ...

కర్నూలు: కర్నూలు జిల్లా ఆస్పరి మండలం చిన్న హోతూరు గ్రామంలో గత నెల 28న డ్రమ్ములో శవం లభ్యమైంది. ఈ హత్యఆస్పరి పోలీసులకు సవాల్‌గా మారింది. కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఆటోలో వచ్చి డ్రమ్ము పడేసి పోయారన్న సమాచారంతో తీగలాగినన పోలీసుల విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. అవి పోలీసులకే షాక్ ఇచ్చాయి. ఎమ్మిగనూరు మండలం మసీదుపురం గ్రామానికి చెందిన పేటయ్య, నరసింహుడు ఇద్దరు స్నేహితులు. పేటయ్య తనకున్న స్థలం అమ్మి 7,50,000 రూపాయలు తన దగ్గర ఉంచుకున్నాడు. ఎలాగైనా ఆ సొమ్మును కొట్టేయాలని నరసింహుడు ఆలోచించాడు. పేటయ్యకు మాయ మాటలు చెప్పి దొంగ నోట్లు ఇప్పిస్తానని హోలెబీడు గ్రామానికి చెందిన హనుమంతు, పంపన్న దగ్గరకు తీసుకెళ్లాడు. అందరూ అప్పటికే భారీ స్కెచ్ వేశారు. అనుకున్నట్టుగానే గత నెల 25న పేటయ్యకు సైనేడ్ కలిపిన మద్యం బలవంతంగా తాగించి హత్య చేశారు. ఆ తర్వాత ఆ శవాన్ని పంపన్న పొలంలో ఉన్న షెడ్ దగ్గర పూడ్చిపెట్టారు. అక్కడ దుర్వాసన రావడంతో ఆ శవాన్ని బయటకు తీసి ఓ ప్లాస్టిక్ డ్రమ్ములో పెట్టి చిన్న హోతురు గ్రామ సమీపంలో ఉన్న వంకలో పడేసి పోయారు.డ్రమ్ములో నుంచి వాసన వస్తుండడంతో స్థానిక ప్రజలు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు డ్రమ్మును ఓపెన్ చేసి చూడగా అందులో శవం కనిపించింది. ఆశ్చర్యపోయిన పోలీసులు అది మర్డర్‌గా అనుమానించి విచారణ చేపట్టారు. విచారణలో తన ప్రాణ స్నేహితుడే పేటయ్యను కిరాతకంగా చంపి ఈ ఘటనకు పాల్పడినట్లు పోలీసులు పేర్కొన్నారు. పేటయ్య హత్యకు పాల్పడిన నరసింహుడు, హనుమంతు, పంపన్నను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా గతంలో నరసింహుడు తండ్రినే చంపిన కేసులో నిందితుడు. తండ్రి ఉద్యోగం కోసం ఈ పని చేశాడని తేలింది. మాజీ నక్షలైట్ అని జనాన్ని హనుమంతు బెదిరించిన డబ్బులు దండుకుంటున్నాడని పోలీసులు తెలిపారు. వారి నుంచి 7 లక్షల 50 వేల రూపాయలు రికవరీ చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్ కు తరలించారు.

# భూసేకరణకే ఏడాది !

**– ఆర్ఆర్ఆర్ నిర్మాణానికి ఐదారేండ్లు ?**
**– రూ.2500 కోట్లు డిపాజిట్ చేయండి**
**– సర్కారుకు ఎన్‌హెచ్ఏఐ మెలిక**
**– పనికొద్దీ నిధులిస్తాం : రాష్ట్రం స్పష్టీకరణ**

హైదరాబాద్: ప్రాంతీయ వలయ రహదారి(ఆర్ఆర్ఆర్) నిర్మాణానికి ఆటంకాలు ఒక్కొక్కటిగా సమసిపోతున్న దశలో కొత్త కొత్త సమస్యలు పుట్టుకొస్తున్నాయి. ప్రాజెక్టుకు భూసేకరణే అత్యంత కీలకం. ఈ విషయంలో ప్రాజెక్టును పట్టాలెక్కిస్తే ఇక భౌతిక నిర్మాణ పనులు చేపట్టడానికి వీలవుతుంది. ఇందులో ప్రగతి ఉంటేనే ప్రాజెక్టును ముందుకు సాగించడానికి పరిస్థితులు అనువుగా మారుతాయని అధికారుల అంచనా. ఇటీవల ఢిల్లీలో, రాష్ట్రంలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశాల నేపథ్యంలో ప్రాజెక్టు పరిపాలనా అనుమతుల ప్రక్రియ కొంత ముందుకెళ్లింది. కేంద్ర మంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయిలో జరిగిన చర్చలు ఆర్ఆర్ఆర్ ప్రక్రియ వేగవంతానికి అడుగులు పడ్డాయి. రెండింతలు ఔటర్ రింగు రోడ్డు(ఓఆర్ఆర్) నిర్మాణానికి, రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) నిర్మాణానికి చాలా తేడా ఉంది. ఓఆర్ఆర్ కేవలం 180 కిలోమీటర్లు అయితే, ఆర్ఆర్ఆర్ దాదాపు 350 కిలోమీటర్లు. అంటే దాదాపు రెండింతలు ఎక్కువ. అప్పట్లోనే భూసేకరణకు చాలా సమయం పట్టింది. అనుకున్న నిర్మాణ అంచనాలు సైతం దాటింది. రైతుల భూములు ఓఆర్ఆర్‌లో చాలా పోయాయి. రాజకీయ పక్షపాతం చూపించారనే ఆరోపణలు, విమర్శలు అనేకం వచ్చాయి. కోర్టుల్లో కేసులు పడ్డాయి. దీంతో అనుకున్నంత వేగంగా పనులు సాగలేదు. ప్రస్తుత పరిస్థితి సైతం అలాగే ఉంది. ఆర్ఆర్ఆర్‌కు భూసేకరణకు అనేక అడ్డంకులు ఉన్నట్టు సమాచారం. ఉత్తర, దక్షిణ భాగాల్లో భూసేకరణకే దాదాపు రూ. 5000 కోట్లు కావాలి. ఇందులో 50:50 నిష్పత్తి చొప్పున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరించాల్సి ఉంది. అయితే కేంద్రం 50 శాతం అంటే రూ. 2500 కోట్లు ముందుగానే ఎన్‌హెచ్ఏఐ ఖాతాలో డిపాజిట్ చేయాలని మెలికపెట్టింది. ఈ మేరకు రాష్ట్ర జాతీయ రహదారుల విభాగానికి సమాచారం పంపింది. దీనిపై రాష్ట్ర ప్రభు త్వంతో చర్చించిన సంబంధిత అధికారులు ఎన్‌హెచ్ఏఐకి ఉత్తరం రాశారు. ఇప్పటికే బడ్జెట్‌లో ఆర్ఆర్ఆర్ భూసేకరణ కోసం రూ.




100 కోట్లు కేటాయించింది. అయితే కేంద్రం ఒకేసారి మొత్తం డబ్బును డిపాజిట్ చేయాలని కోరడంతో సర్కారు ఇరకాటంలో పడింది. రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలుకే ఆర్థిక వెసులుబాటు తక్కువగా ఉన్న నేపథ్యంలో ఆలోచనలో పడింది. వెంటనే భూసేకరణ చేసే కొద్ది డబ్బును విడుదల చేస్తామంటూ ఎన్‌హెచ్ఏఐకి రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. 4781 ఎకరాలకు 1459 ఎకరాలు మొత్తం ప్రాజెక్టుకు 4781 ఎకరాల భూమికి గాను ఇప్పటివరకు 1459 ఎకరాలను మాత్రమే సేకరించారు. గత బీఆర్ఎస్ సర్కారు ఎన్‌హెచ్ఏఐ పదే పదే విజ్ఞప్తులు చేసినా భూసేకరణపై దృష్టిపెట్టకపోవడంతో ప్రాజెక్టు దాదాపు రెండున్నరేండ్లు ఆలస్యమైంది. ఇటీవల సమీక్షలపై సమీక్షలు చేస్తున్న తాజా సర్కారు, భూసేకరణను వచ్చే సెప్టెంబరు నాటికి పూర్తిచేయాలని భావిస్తున్నది. అక్టోబరులో ప్రధానితో శంకుస్థాపన చేయాలని నిర్ణయించింది. అయితే నిధుల కోణంలో పరిశీలిస్తే భూసేకరణకే ఏడాది సమయం పడుతుందని అధికారులు అంటున్నారు. ప్రభుత్వాలు తొందర పెడుతున్నా, ఆచరణలో భూసేకరణ అంత సులభం కాదని చెబుతున్నారు. ఓఆర్ఆర్‌లో తలెత్తిన సమస్యలకంటే, ఆర్ఆర్ఆర్ భూసేకరణలో ఆ సమస్యలు ఎక్కువగా వస్తాయనే అంచనాతో ఉన్నారు. వీటన్నింటినీ పరిష్కరించాల్సి వస్తుందనీ, అలా చేయకపోతే కోర్టు కేసులై ప్రాజెక్టు మరింత ఆలస్య మయ్యే ప్రమాదం ఉంటుందని అధికారిక సమాచారం.

# ఖమ్మం జిల్లా డెంగ్యూ విజృంభణ

ఖమ్మం: ఖమ్మం జిల్లాలో డెంగీ కేసుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. డెంగీ వ్యాప్తితో రాష్ట్రంలోని ఐదు జిల్లాలు హైరిస్క్ జోన్లో ఉన్నట్లు గుర్తించగా.. జాబితాలో ఖమ్మం జిల్లా పేరు సైతం ఉండటం ఆందోళన కలిగిస్తోంది. దీంతో ఉన్నతాధికా రుల సూచనలతో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమ య్యారు.గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా జ్వరాలు జనాన్ని మంచాన పడేస్తున్నాయి. కాగా డెంగీ కేసుల నమోదు మాత్రం గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువగా ఉ ండటం గమనార్హం. ఇటీవల రోజుల తరబడి ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలతో నివాస ప్రాంతాలు మురుగు నీరుతో నిండిపోయాయి. దీంతో దోమల వ్యాప్తి బాగా పెరిగిపోయింది. ఈ ఫలితంగానే ప్రజలు డెంగీ బారిన పడుతున్నారు జ్వరాలతో బాధపడుతూ ఆస్పత్రుల్లో చేరే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆస్పత్రితో పాటు జిల్లాలో రెండు ఏరియా ఆస్పత్రులు, నాలుగు సీహెచ్ సీలు, 26 పీహెచ్సీలు, 224 సబ్సెంటర్లు, 161 పల్లె దవాఖానాలు ఉన్నాయి. జ్వరాలతో బాధపడుతూ వచ్చిన వారితో ఇవన్నీ కిటకిటలాడుతున్నాయి. మరికొందరు ప్రైవేట్ ఆస్పత్రులకు కూడా క్యూ కడుతున్నారు. డెంగీతో పాటు మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు కూడా విజృం భిస్తుండడంతో వైద్య ఆరోగ్యశాఖ ర్యాపిడ్ యాక్షన్ టీమ్ లను ఏర్పాటు చేసి ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తోంది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో డెంగీ కేసులు నమోదైనా వెంటనే అదుపులోకి వస్తున్నాయి.వర్షాకాల సీజన్లో ఏటా జిల్లాను డెంగీ వణికిస్తోంది. ఈ ఏడాది జూలై నుంచి డెంగీతో బాధపడు తున్న వారి సంఖ్య పెరుగుతూ వస్తుండడం ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది. 2021లో 944 మందికి, 2022 ఏడాదిలో 711 మందికి, 2023లో 530 మందికి అధికారిక లెక్కల ప్రకారం డెంగీ సోకింది. అయితే ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన వారు ఇంకా ఎక్కువ మందే ఉంటారని అంచనా. ఈ గణాంకాల ఆధారంగా గతంలో ఎక్కువ కేసులు నమోదైన ప్రాంతాలపై వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక దృష్టి సారించి స్థానికులకు అవగాహన కల్పించడమే కాక వైద్య శిబిరాలు నిర్వహిస్తోంది. ఈ ఏడాది జిల్లాలో డెంగీ కేసులు ఎక్కువ ప్రభావం చూపుతున్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు 12,621 మంది నుంచి శాంపిళ్లు సేకరించగా.. 306 కేసులు నమోదయ్యాయి. సీజన్తో సంబంధం లేకుండా జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్లో కూడా నెలకు 30 నుంచి 40 కేసులు నమోదవడం గమనార్హం. మే, జూన్లో కాస్త తగ్గినా జూలైలో మళ్లీ కేసుల సంఖ్య పెరిగింది. జూలైలో 109 కేసులు నమోదయ్యాయి.డెంగీ కేసుల విషయంలో జిల్లా హైరిస్క్ జోన్లో ఉ ండడంతో వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత రెండో స్థానంలో ఖమ్మం జిల్లా నిలవడం ఆందోళన కలిగిస్తోంది. ఈసారి అత్యధికంగా తెలంగాణాలో అత్యధికంగా కేసులు నమోదవుతాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించిన నేపథ్యంలో రాష్ట్రంలో హైరిస్క్ ప్రాంతాలను గుర్తించారు.ఇందులో ఖమ్మం జిల్లా కూడా ఉండటంతో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. కొన్నేళు ్లగా నమోదైన డెంగీ కేసుల ఆధారంగా హైరిస్క్ జోన్లను గుర్తించి పరీక్షలు పెంచడంతో పాటు తరచుగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈనెల 1వ తేదీనే ఆరు కేసులు నమోద య్యాయి. ఏటా జూలై నుంచి అక్టోబర్ వరకు జిల్లాలో ఎక్కువ కేసులు నమోదవుతుండగా ఈ ఏడాది జనవరి నుంచే డెంగీ పంజా విసిరింది.తాజా పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అధికారులు అప్రమత్తమయ్యారు. అయితే కేవలం వైద్య ఆరోగ్య శాఖ స్పందిస్తేనే సరిపోదు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తేనే డెంగీ వ్యాప్తిని అరికట్టడం సాధ్యమవుతుంది. ఇందుకోసం వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీరాజ్, గ్రామీణా భివృద్ధి సంస్థలు సమన్వయంతో పని చేయాల్సి ఉంటుంది.ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున మురుగు నీరు నిలిచి దోమలు వృద్ధి చెందకుండా చూడాలి. ఫ్రెడే-డ్రైడే వంటి కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పించడంతో పాటు నీరు నిల్వ ఉండకుండా చూసుకునేలా ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అవసరముంది. అటు వైద్య, ఆరోగ్య శాఖతో పాటు ఇతర శాఖలు అప్రమత్తంగా ఉండి విధులు నిర్వర్తిస్తూ ప్రజల్లో కూడా అవగాహన కల్పిస్తే డెంగీ బారిన పడకుండా కాపాడినట్లవుతుంది.

# శ్రావణంలో పదవుల జాతర

వరంగల్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి చాలా కీలక విషయాలపై నిర్ణయాన్ని వాయిదా వేస్తూ వచ్చారు. అందులో ఒకటి మంత్రి వర్గ విస్తరణ, రెండోది పీసీసీ చీఫ్ నియామకం, మూడోది నామినేటెడ్ పోస్టుల భర్తీ. ఈ మూడు విషయాల కోసం కాంగ్రెస్ నేతలు ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన తర్వాత ఇదిగో విస్తరణ, అదిగో కొత్త పీసీసీ అంటూ రకరకాల లీకులు వచ్చాయి. కానీ అవేవీ నిజం కాదని తేలిపోయింది. అన్నింటికీ శ్రావణ మాసాన్ని ముహూర్తంగా చేసుకున్నారని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ప్రస్తుతం అమెరికా టూర్లో ఉన్న రేవంత్ రెడ్డి స్వరాష్ట్రానికి వచ్చిన తర్వాత ఢిల్లీ వెళ్తారని తెలుస్తోంది. అధినాయకత్వం తో ఈ మూడు విషయాలపై ఫైనల్గా మాట్లాడుకొని మంచి ముహూర్తం చూసుకని కీలక ప్రకటన చేస్తారని అంటున్నారు. ఇప్పటికే ఒక దఫా నామినేటెడ్ పదువులు భర్తీ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇంకా కీలకమైన విభాగాలు ఉండనే ఉన్నాయి. వాటిలో కొన్నింటినీ రెండో దఫాలో ప్రకటిస్తారని అంటున్నారు. మంత్రివర్గ విస్తరణ, తెలంగాణ పీసీసీ చీఫ్ నియామకం, నామినేటెడ్ పోస్టుల భర్తీపై ఎప్పటి నుంచో కసరత్తు జరుగుతోంది. వివిధ దఫాలు ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్, ఇతర సీనియర్ నేతలు అధినాయకత్వంతో ఈ మూడు అంశాలపై చర్చించారు. ఇంతలో బీఆర్ఎస్ నుంచి కీలకమైన నేతలు కాంగ్రెస్లో చేరడంతో వారికి ఛాన్స్ ఇస్తారేమో అని మరికొందరు కంగారు పడి అధినాయకత్వానికి విన్నపాలు చేశారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్లోకి కొత్తగా వచ్చి చేరే వారిని కీలక పదువులు అప్పగించవద్దని చాలా మంది సీనియర్లు డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలో లేనప్పుడు చాలా మంది పార్టీ కోసం కష్టపడి పని చేశారని వారినే పరిగణలోకి తీసుకొవాలని చెప్పుకొచ్చారు. దీన్ని పరిశీలించిన కాంగ్రెస్ నాయకత్వం కొత్తగా పార్టీలో చేరే వారికి మంత్రిపదవులు ఇవ్వడం లేదని తేల్చి చెప్పినట్టు సమాచారం. ఇన్ని రోజులు వివిధ కారణాలతో మూడు విషయాలపై దాటవేత ధోరణితో వచ్చిన కాంగ్రెస్కు ఇప్పుడు నిర్ణయం తీసుకోవాల్సిన టైం వచ్చింది. మరికొన్ని రోజుల్లో లోకల్ బాడీ ఎన్నికలు జరగనున్నాయి. అందులో కాంగ్రెస్ కార్యకర్తలు చురుగ్గా పనిచేయాలంటే వారిని ప్రోత్సహించాల్సి ఉందని అంటున్నారు నేతలు. ఇప్పుడు ఇటు పీసీసీ చీఫ్గా అటు సీఎంగా రెండు పదవులను నిర్వహిస్తున్న రేవంత్కు నేతల సమన్వయం ఇబ్బంది మారుతోందని చెబుతున్నారు. అందుకే పీసీసీ చీఫ్ నియామకం కూడా తప్పనిసరికానుంది. ఖాళీగా ఉన్న ఆరు పోర్ట్పోలియోలకు మాత్రం భారీగా పోటీ ఉందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. దాదాపు 15 మంది వరకు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారట. సామాజిక కోటాలు, స్థానికత అంశాలను తెరపైకి తీసుకొచ్చి మంత్రిగా అవ్వాలని తీవ్రంగా లాబీయింగ్ చేస్తున్నారని టాక్ నడుస్తోంది. కొందరు రేవంత్ రెడ్డితో ప్రయత్నాలు చేస్తుంటే మరికొంత మంది నేరుగా అధినాయకత్వంతోనే సంప్రదింపులు జరుపుతున్నారని సమాచారం. తెలంగాణ పీసీసీ చీఫ్ పదవి మాత్రం బీసీ, లేదా ఎస్సీ, ఎస్టీ సమాజిక వర్గానికి ఇవ్వాలని ఓ అభిప్రాయానికి వచ్చినందున ఆ సామాజిక వర్గ నేతలే లాబీయింగ్ చేసుకుంటున్నారు.

# బారీగా పెరగనున్న మద్యం ధరలు



హైదరాబాద్ : తెలంగాణలో మద్యం అమ్మకాలు గడిచిన పదేళ్లలో ఏ ఏడుకాయేడు రికార్డులను తిరగరాస్తున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో కూడా లేనంతగా అమ్మకాలు సాగుతున్నాయి. దేశంలోనే తెలంగాణ మద్యం అమ్మకాల్లో రెండో స్థానంలో నిలిచింది అంటే ఏమేరకు జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. దీంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం మద్యం అమ్మకాలను ప్రభుత్వానికి ఆదాయ వనరుగా మార్చుకుంది. జనంతో వీలైనంత ఎక్కువ మద్యం తాగించేందుకు బెల్టు షాపులను ప్రోత్సహించింది. ఎక్సైజ్ శాఖకు టార్గెట్ విధించి మరీ మద్యం అమ్మకాలు సాగించింది. ఇక మద్యం షాపుల లైసెన్స్ ఫీజులను భారీగా పెంచింది. మూడు నాలుగుసార్లు మద్యం ధరలను కూడా పెంచింది. ఇలా మద్యంతో కోట్ల రూపాయలు ఖాజానాకు కూడబెట్టింది. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ కూడా అదే బాటలో పయనిస్తోంది. తాము అధికారంలోకి వస్తే బెల్ట్ షాపులు ఎత్తేస్తామన్న రేవంత్రెడ్డి.. ఏడు నెలలు గడిచినా ఒక్క బెల్ట్ షాపును ముట్టుకోలేదు. మద్యం అమ్మకాలపై ఎలాంటి నియంత్రణ విధించలేదు. ఎంత తాగితే అంత తాగించండి అన్నట్లుగా సైలెంట్గా ఉండిపోయారు. వేసవిలో బీర్ల కొరత తీర్చేందుకు కొత్త బీర్ల తయారీ కంపెనీలకు అనుమతులు కూడా ఇచ్చారు. ఇలా మద్యపానాన్ని తనవంతుగా ప్రోత్సహిస్తోంది కాంగ్రెస్ సర్కార్. రోజురోజుకు లిక్కర్ అమ్మకాలు జోరుగా పెరిగిపోతున్నాయి. అయితే ధర ఎంత ఉన్నా అమ్మకాలు మాత్రం ఆగవు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ రాష్ట్రంలో బీర్ల ధరలు పెంచాలనే ఆలోచేన చేస్తున్నట్లు తెలుస్తోంది.బ్రూవరీలు ప్రస్తుతం బీర్ల ధరలు గిట్టుబాటు కావడం లేదని ప్రభుత్వానికి విన్నవించాయి. 10 నుంచి 12 శాతం ఎంచాలని ప్రతిపాదించాయి. ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో బీర్ల అమ్మకాలు కూడా తగ్గాయి. ఈ నేపథ్యంలో ధరల పెంపునకు ప్రభుత్వం కూడా సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడమే ఆలస్యం అన్నట్లుగా బ్రూవరీలు ఎదురు చూస్తున్నాయి.ఇదిలా ఉంటే రాష్ట్రంలో ఆరు బ్రూవరీల్లో ఏటా 68 కోట్ల లీటర్ల బీరు తయారు చేస్తున్నాయి. ఆ బీరును తెలంగాణ రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ కొనుగోలుచేసి.. మద్యం దుకాణాలకు సరఫరా చేస్తోంది. ఈ నేపథ్యంలో 12 బీర్ల కేసుకుగాను బ్రూవరీలకు బేవరేజెస్ కార్పొరేషన్ రూ.289 చెల్లిస్తోంది. పన్నులన్నీ కలుపుకొని కేసుకు రూ.1,400 చొప్పున రిటైలర్లకు (మద్యం దుకాణాలు) విక్రయిస్తుండగా.. ఇతర ఖర్చులన్నీ కలిపి మద్యం దుకాణాలవారులు కేసు రూ.1,800 చొప్పున విక్రయిస్తున్నారు. అంటే ఒక్కో బీరుకు ప్రభుత్వం బ్రూవరీల నుంచి కేవలం రూ.24.08కి కొనుగోలు చేస్తుంది. మద్యం షాపులకు ఒక్కో బీరును రూ.116.66 ధరకు అమ్ముతుంది. వినియోగదారు నుంచి రూ.150 వసూలు చేస్తున్నారు. రాష్ట్రంలో బీర్ల డిమాండ్కు తగ్గట్టు ప్రభుత్వ ఆర్డర్లపై బ్రూవరీలు బీర్లను ఉత్పత్తి చేస్తాయి.ఇక బీర్ల ధరలపై ప్రభుత్వం, బ్రూవరీలు రెండేళ్లకోసారి ఒప్పందం కుదుర్చుకుంటాయి. గడువు పూర్తయ్యాక ధరలను సవరిస్తాయి. ప్రతి రెండేళ్లకూ బ్రూవరీలకు చెల్లించే ధరను ప్రభుత్వం దాదాపు 10 శాతం మేర పెంచుతూ ఉంటుంది. చివరిసారిగా 2022 మేలో 6 శాతంచొప్పున రెండుసార్లు పెంచింది. నిర్వహణ ఖర్చులు పెరిగిన నేపథ్యంలో ఈసారి 20?25 శాతం పెంచాలంటూ బ్రూవరీలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ఈ మేర పెంచినట్లయితే ధరలను పెంచాల్సి ఉంటుంది. దీంతో ఈ ప్రభావం మందుబాబుపై పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో 10 నుంచి 12 శాతం పెంపునకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశం ఉంది. ధరలు పెంచాలని నిర్ణయిస్తే కేవలం బీర్లపైనే ఉండనుంది.

# డైలామాలో బీఆర్ఎస్ క్యాడర్..

కరీంనగర్: త్వరలోనే కవితక్క వస్తది.. అక్క నేను గల్లీ గల్లీ తిరుగుతాం..పార్టీకి మళ్ళీ మంచి రోజులు వస్తాయి అంటూ ఇటీవల జగిత్యాల జిల్లాలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీర్ క్యాడర్ లో జోష్ నింపే ప్రయత్నం చేశారు. కేటీర్ పర్యటన తర్వాత వలసలకు బ్రేక్ పడినట్లే అని బీఆర్ఎస్ హైకమాండ్ భావించింది. కానీ మీటింగ్ జరిగిన కొద్ది రోజుల వ్యవది లోనే కోరుట్ల మున్సిపల్ ఛైర్పర్సన్ అనూహ్యంగా కాంగ్రెస్ గూటికి చేరారు. త్వరలోనే మెట్ పల్లి మున్సిపల్ లో కొద్ది మంది ముఖ్య కౌన్సిలర్లు కూడా హస్తం గూటికి చేరతారనే ప్రచారం ఊపందు కుంది. దీంతో వలసల నేపథ్యంలో ఇంతకాలం గులాబీ పార్టీకి కంచుకోటగా జగిత్యాల జిల్లాలో ప్రస్తుతం ఆ పార్టీ మనుగడ కష్టంగా మారింది.వలసల నేపథ్యంలో బీఆర్ఎస్ సెకండ్ క్యాడర్ డైలమాలో పడినట్లు గా తెలుస్తుంది. పార్టీకి పెద్ద దిక్కుగా ఉన్న ఎమ్మెల్సీ కవిత జైలు పాలవడం.. రాష్ట్రంలో అధికారం కోల్పోవడం, మరోవైపు పార్టీ ఫిరాయింపులతో బీఆర్ఎస్ క్యాడర్ పూర్తిగా ఢీలా పడింది. జగిత్యాలలో గెలిచిన సంజయ్ పార్టీ మారడం, ధర్మపురి కి కొప్పుల దూరంగా ఉంటూ వస్తుండటంతో ఆ రెండు నియోజకవర్గా లలో పరిస్థితి పూర్తిగా తారుమారైంది. కోరుట్లలో ఎమ్మెల్యేగా ఉన్న డాక్టర్ సంజయ్ ఒంటరి పోరాటం చేస్తున్నప్పటికి వలసలకు బ్రేక్ వేయలేక పోతున్నారు. దీంతో చాలా వరకు సెకండ్ క్యాడర్ లీడర్లు కూడా పార్టీలో కొనసాగుదామా లేదా అనే విషయంలో తర్జనభర్జన పడుతున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో బీఆర్ఎస్ అధిష్టానం క్యాడర్ కాపాడుకోవడం లో సక్సెస్ అవుతోందో లేదో అన్నది చూడాల్సి ఉంది.అసెంబ్లీ ఎన్నికలకు ముందే అవిశ్వాసం అస్త్రంతో జగిత్యాల మున్సిపల్ కాంగ్రెస్ ఖాతాలో పడింది. ఆ తర్వాత జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కారు దిగి కాంగ్రెస్ గూటికి చేరారు. ఇటీవల కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ కూడా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మెట్ పల్లి బల్దియా ను కూడా హస్తగతం చేసుకు నేందుకు కాంగ్రెస్ లీడర్లు పావులు కదుపుతూ వస్తున్నారు. వచ్చే స్థానిక ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ ఈ ఆపరేషన్ ఆకర్ష్ కు తెరలేపినట్లు గా తెలుస్తుంది. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో గ్రామ స్థాయి నుండి మున్సిపాలిటీ ల వరకు చాలా మంది గులాబీ లీడర్లు ఇప్పటికే కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్రంలో అధికారం చేజిక్కించుకున్న జోష్ లో ఉన్న కాంగ్రెస్ లీడర్లు స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలనే లక్ష్యం తో కారు పూర్తిగా ఖాళీ చేయాలని చూస్తున్నారు. జిల్లాలో గులాబీ పార్టీ గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటుంది. ఇంతకాలం పార్టీకి విధేయులుగా ఉన్న లీడర్లే ఒక్కొక్కరుగా చేజారుతుండడం ఆ పార్టీ హైకమాండ్ ను కలవరపెడు తుంది.

దీంతో చివరి అస్త్రంగా త్వరలోనే ఎమ్మెల్సీ కవిత జైలు నుండి వస్తుందని, రాగానే జగిత్యాల కేంద్రంగా బీఆర్ఎస్ బలోపేతా నికి కృషి చేస్తుందని బీఆర్ఎస్ అధిష్టానం ప్రచారం చేస్తోంది. నిజామా బాద్ పార్లమెంట్ పరిధిలోని జగిత్యాల, కోరుట్ల లో ఎమ్మెల్సీ కవితకు పట్టు ఉండటమే కాక సెపెరేట్ క్యాడర్ ఉంది. దీంతో వలసలకు పులిస్టాప్ పెట్టేందుకే ఎమ్మెల్సీ కవిత పేరు తెరపైకి తీసుకు వస్తున్నట్లు గా స్పష్టం అవుతుంది. ఇటీవల జగిత్యాలలో పర్యటించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ త్వరలోనే కవిత బయటకు వస్తుందని చేసిన వ్యాఖ్యలు ఇందుకు బలాన్ని చేకూర్చుతున్నాయిజిల్లా కేంద్రంతో పాటు, కోరుట్ల, మెట్ పల్లి, ధర్మపురి, రాయికల్ పట్టణాలలో బిఆర్ఎస్ టౌన్ లీడర్లు పార్టీకి దూరంగా ఉ ంటూ వస్తున్నారు. ఇప్పటికే చాలామంది పార్టీ మారగా పార్టీని అంటిపెట్టుకొని ఉన్నవాళ్లు పార్టీ కార్యక్రమాలతో సంబంధం లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఆ పార్టీ హైకమాండ్ పిలుపునిస్తున్న కార్యక్రమాలను సక్సెస్ చేసేందుకు గ్రామాల్లో ఉండే లీడర్లపైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది.

# హైకోర్టు తీర్పుపై ఉత్కంఠ...



హైదరాబాద్: పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకునేలా స్పీకర్కు ఆదేశాలివ్వాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దాఖలు చేసిన పిటిషన్పై తెలంగాణ హైకోర్టులో జస్టిస్ విజయసేన్రెడ్డి బెంచ్ బుధవారం విచారణ చేపట్టింది. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలపై వచ్చిన ఫిర్యాదులను నిర్దిష్ట సమయంలోగా పరిష్కరించాలని స్పీకర్కు గడువు విధిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తామని దీనిపై మీ వైఖరి చెప్పాలని అడ్వకేట్ జనరల్ను హైకోర్టు ప్రశ్నించింది. అయితే స్పీకర్కు కోర్టులు ఆదేశాలు జారీ చేయరాదన్నదే తమ వాదన అని అడ్వకేట్ జనరల్ వాదించారు. సుప్రీంకోర్టు ఐదుగురు సభ్యుల విస్తృత ధర్మాసనం ఉ త్తర్వుల ప్రకారం ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలపై పిటిషన్లను మూడు నెలల్లోగా పరిష్కరించాలని బీఆర్ఎస్ తరపు లాయర్లు వాదించారు. అయితే బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్కు విచారణార్హత లేదని, కోర్టు ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నామని ప్రభుత్వ లాయర్ వాదించారు.పార్టీ మారిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్లు రాజకీయ లబ్ధి కోసమే పార్టీ మారారని బీఆర్ఎస్ తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల్లో ఒకరైన దానం నాగేందర్ అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా లోక్సభ ఎన్నికల్లో పోటీ కూడా చేశారని బీఆర్ఎస్ తరపు లాయర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. మణిపూర్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించినప్పుడు ఆ రాష్ట్రాల్లోని కోర్టులు వెలువరించిన తీర్పులను ధర్మాసానికి విన్నవించారు. స్పీకర్కు, మణిపూర్ హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన కాపీని సైతం కోర్టుకు అందజేశారు. ఈ క్రమంలో న్యాయస్థానాలు స్పీకర్కి ఆదేశాలు ఇవ్వడం వీలు పడదంటూ పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల తరపున హాజరైన న్యాయవాది వాదనలు వినిపించారు. ప్రజల చేత ఎన్నికైన నాయకుల విషయంలో న్యాయస్థానా లు జోక్యం చేసుకోవడం సాధ్యం కాదని కోర్టుకు తెలిపారు. స్పీకర్ ముందున్న పిటిషన్లను విచారణ చేయాలని ఇప్పటివరకు సుప్రీంకోర్టు ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదని ప్రభుత్వ లాయర్ స్పష్టం చేశారు. కేసు విచారణకు ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్రెడ్డి హాజరయ్యారు.ఎమ్మెల్యేల అనర్హతపై పిటీషన్లను స్పీకర్ పరిశీలించి తగిన నిర్ణయం తీసుకునేందుకు మరికొంత సమయం పడుతుందని కోర్టుకు విన్నవించారు. ఇరుపక్షాల సుదీర్ఘ వాదనల తర్వాత హైకోర్టు తీర్పును రిజర్వ్ చేస్తూ కేసును వాయిదా వేసింది.దీంతో ఏక్షణమైనా పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల కేసులో తీర్పు వెలువడే అవకాశం ఉంది.

# పని ఒత్తిడిలో పోలీస్...

హైదరాబాద్: స్టేట్ హెడ్ క్వార్టర్స్లో పోలీస్ ఉద్యోగం చేయాలంటే సంబరపడే రోజులు మాయమైపోయాంటున్నారు సిటీ పోలీసులు. ఇటీవల కాలంలో పెరిగిన పని ఒత్తిడితో హైదరాబాద్ కమిషనరేట్లో పని చేసేందుకు చాలా మంది వెనకడుగు వేస్తున్నారని టాక్ వినిపిస్తోంది. ఇటీవల సిటీ పోలీసింగ్లో వచ్చిన మార్పులతో హైదరాబాద్లో పోస్టింగ్ అంటేనే పోలీసులు భయపడిపోతున్నా రంటున్నారు. సిటీ పోలీసింగ్ అంటే సవాళ్లతో సహవాసంగా మారుతుం డమే ఎక్కువ మంది ఇంట్రెస్ట్ చూపడం లేదని చెబుతున్నారు. శాంతిభద్రతల నిర్వహణతో పాటు కేసుల దర్యాప్తు, గస్తీ విధులు, ప్రముఖుల పర్యటనల్లో బందోబస్తు, సమస్యాత్మక ప్రాంతాల్లో 24 గంటలూ డ్యూటీలు చేయాల్సి రావడంతో సిటీ పోలీసులపై పని ఒత్తిడి బాగా పెరిగిపోతోంది. దీనికి తగ్గట్టు సిబ్బందిని పెంచకపోవడం, పని చేసిన వారిని టార్గెట్ చేస్తూ ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి పెరిగిపోవడంతో చాలామంది పోలీసులు సిటీలో విధులంటేనే జంకుతున్నారని చెబుతున్నారు.ఒకప్పుడు హైదరాబాద్లో విధులంటే పోలీసులు పోటాపోటీగా ముందుకు వచ్చే వారని చెబుతున్నారు. సిటీలో పోస్టింగ్ కోసం ఎన్నో పైరవీలు చేసేవారు. కోరుకున్న పోస్టింగ్లకు కాసులు కూడా సమర్పించుకునే వారు. కానీ, ప్రస్తుతం పరిస్థితిలో పూర్తిగా మార్పు వచ్చిందంటున్నారు. కోరుకున్న చోట పోస్టింగ్ ఇస్తామంటున్నా? ఎస్ఐలు, సీఐలు మాకొద్దు బాబోయ్ అంటూ దండం పెట్టేస్తున్నారట.. ముఖ్యంగా గత మూడేళ్ల నుంచి ఈ పరిస్థితి ఏర్పడిందంటున్నారు. సిబ్బంది సామర్థ్యం, స్థితిగతులను పట్టించుకోకుండా 24 గంటలూ అందుబాటులో ఉండాలంటూ ఉన్నతాధికారులు ఒత్తిడి చేయడంతో చాలా మంది పోలీసులు మానసికం గా కుంగిపోతున్నారని చెబుతున్నారు.నగరంలో ఏడు జోన్లు ఉండగా, కొన్నిచోట్ల తీవ్ర పని ఒత్తిడి ఉంటోందంటున్నారు. ముఖ్యంగా సెంట్రల్, వెస్ట్, సౌత్ జోన్లలో స్టేషన్ హౌస్ ఆఫీసర్ నుంచి కింద స్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నట్లు చెబుతు న్నారు. క్షణం కూడా ఖాళీ లేకుండా 24 గంటలూ డ్యూటీలు చేయాల్సి వస్తోందని ఆయా ఏరియాల్లో పని చేస్తున్న పోలీసులు వాపోతున్నారు. ఎప్పుడు? ఎక్కడ.. డ్యూటీ వేస్తారో తెలియక తీవ్రంగా సతమతమవుతు న్నారని చెబుతున్నారు. వెస్ట్ జోన్లో వీఐపీ మూమెంట్ ఎక్కువగా ఉండడంతో ప్రతి చిన్న విషయాన్ని పైస్థాయి అధికారులు భూతద్దంలో పెట్టి చూస్తున్నారని చెబుతున్నారు. ఎఫ్ఐఆర్, రిమాండ్ రిపోర్ట్, డైలీ క్రైమ్ రిపోర్ట్, పెండింగ్ కేసులపై సమీక్షలు అంటూ ఉ న్నతాధికారులు ఒత్తిడి పెంచుతుండటం వల్ల క్షేత్రస్థాయి సిబ్బంది చాలా ఇబ్బందులు పడుతున్నారంటున్నారు. ఈ విషయాన్ని బయటకు చెప్పుకోలేక? బాధలు అనుభవించలేక చాలా మంది సిబ్బంది నరకం చూస్తున్నామని చెబుతున్నారు.పని భారం పెరగడం, ఉన్నతాధికారుల ఒత్తిడికి తోడుగా అత్యవసర పరిస్థితుల్లోనూ సెలవు దొరకని పరిస్థితుల్లో హైదరాబాద్ కమిషనరేట్లో ఉద్యోగమంటే భయపడే పరిస్థితి ఏర్పడిందంటున్నారు. సిటీలో ఉద్యోగం హాయిగా ఉంటుందని ఏరికోరి మరీ పోస్టింగ్ తెచ్చుకుంటే.. తమ పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడిన చందంగా మారిందని కొందరు పోలీసులు ఆవేదన చెందుతున్నారు. స్టేట్లో హైదరాబాద్ మినహా ఎక్కడ పోస్టింగ్ ఇచ్చినా వెళ్లిపోతామని తమకు తెలిసిన అధికారులు, ప్రజాప్రతినిధులకు ప్రాధేయపడుతున్నారని చెబుతున్నారు. సిటీలో ప్రజలకు మెరుగైన శాంతి భద్రతలను అందించేం దుకు మెగా సిటీ పోలీసింగ్ అమల్లోకి తీసుకొచ్చి న నుంచి పరిస్థితి మరింత ఘోరంగా తయారైందంటున్నారు. గత ఏడాది హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఐదు జోన్లను ఏడుకు విస్తరించారు.. 11 ఏసీపీ డివిజన్లు, 11 కొత్త స్టేషన్లు అందుబాటులోకి తెచ్చారు.. శాంతిభద్రతలు, మహిళా పోలీస్ స్టేషన్లతో కలిసి నగరంలో మొత్తం 78 పోలీసు స్టేషన్లు ఉండగా, అందుకు తగ్గట్టు సిబ్బంది సంఖ్య పెరగలేదు. దీంతో పని ఒత్తిడి ఎక్కువైపోయిందని చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పని చేయలేమని భావిస్తూ సిటీలోని కీలకమైన స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు సర్కిల్ ఇన్స్పెక్టర్లు దీర్ఘకాలిక సెలవుకు ప్రయత్నిస్తుండటం పోలీసుశాఖలో హాట్టాపిక్గా మారింది. ఆ ఇద్దరు ఇన్స్పెక్టర్లు నగరంలోని పోలీసులు అనుభవిస్తున్న ఒత్తిడికి నిదర్శనమని చెబుతున్నారు.

# 4 ఉద్యోగాలకు ఎంపికైన నల్గొండ అమ్మాయి

నల్గొండ: సర్కార్ కొలువు సాధించాలనేది ఎందరికో కల. డిగ్రీ పట్టాలు చేతికి వచ్చినప్పటి నుంచి కోచింగ్లు తీసుకుంటూ యువత ఉద్యోగ సాధనలో మునిగిపోతుంటారు. ఎంత కష్టపడినా.. కొలువు కొందరినే వరిస్తుంది. అయితే తాజాగా రాష్ట్రానికి చెందిన ఓ యువతి ఏకంగా నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. నల్గొండకు చెందిన చింతల తులసి రాష్ట్రంలో ఇటీవల నిర్వహించిన పలు నియామక పరీక్షల్లో సత్తాచాటి నాలుగు ఉద్యోగాలు సాధించింది. ఇది వరకే ఆమె గ్రూప్-4, పాలిటెక్నిక్ లెక్చరర్ కొలువులు సాధించిన తులసి.. ఏప్రిల్ 24న ఏఈ, ఆగస్టు 2న ఏఈఈ ఉద్యోగాలకు సైతం ఎంపికైంది. చింతల వెంకన్న, లక్ష్మి దంపతుల మూడో సంతానం తులసి. స్వగ్రామలో ప్రభుత్వ పాఠశాలలోనే విద్య అభ్యసించిన తులసి, జేఎన్టీయూహెచ్లో బీటెక్, ఉస్మానియా యూనివర్సిటీలో ఎంటెక్ పూర్తిచేసింది. అనంతరం ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా రెండేళ్లుగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతూ ఉంది. ఈ క్రమంలో టీజీపీఎస్సీ గ్రూప్-4, పాలిటెక్నిక్ లెక్చరర్ ఉద్యోగాలు సాధించింది. అయినా వాటితో సంతృప్తి చెందకుండా ఆ ఉద్యోగాలు వదులుకుని, ఉన్నత కొలువు కోసం అహర్నిశలు కష్టించింది. తాజాగా ఏఈఈ, ఏఈ ఉద్యోగాలు తులసిని వరించాయి. దీనిపై తులసి మాట్లాడుతూ.. ఏఈఈ పరీక్షకు సిద్ధమవుతున్న సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయని తెలిపింది. అయితే వేటికీ బెదరక ట్యూషన్లు చెప్పుకుంటూ.. వచ్చిన డబ్బులతో పుస్తకాలు కొనుగోలు చేసి హాస్టల్లో ఉంటూ చదువుకున్నానని చెప్పుకొచ్చింది. ఎన్ని కష్టాలెదురైనా చదువు వదలకూడదని అమ్మానాన్న చెప్పిన మాటలే తనలో స్ఫూర్తి నింపాయని, వారి ఆశలను వమ్ము చేయకుండా గ్రూప్-1 సాధించడమే తన లక్ష్యమని తులసి తెలిపింది.

# బంగ్లాను షేక్ చేసిన ఒకే ఒక్కడు

ఢాకా: షేక్ హసీనాకు బంగ్లాదేశ్ ఉక్కు మహిళగా పేరు ఉంది. ప్రత్యర్థి పార్టీలను ఎన్నికల్లో పోటీ చేయకుండా తొక్కిపడేశారనే అపవాదు ఉంది. విపక్షాలను అణగదొక్కారనే విమర్శ ఉంది. అయినప్పటికీ ఐదుసార్లు ప్రధానమంత్రి అయిన చరిత్ర ఆమెకు ఉంది. దేశాన్ని ఏకచత్రాధిపత్యంగా పరిపాలించిన ఘనత ఆమె పేరు మీద ఉంది.. పైగా ఆమె బంగ్లాదేశ్ జాతిపిత రెహమాన్ కూతురు. అయినప్పటికీ ప్రజల ఆగ్రహం ముందు తలవంచక తప్పలేదు. ఘన చరిత్ర ఉన్నప్పటికీ.. ప్రాణ భయంతో పారిపోక తప్పలేదు. ఎంతో ధైర్యవంతురాలయిన షేక్ హసీనా భారత్ ఎందుకు పారిపోయారు? ఆమె గద్దె దిగడం వెనుక కారణం ఎవరు? ఆమె దేశం విడిచి వెళ్లిపోవడానికి దోహదం చేసింది ఎవరు? ఇన్నాళ్లు దీని వెనుక ఉంది ప్రతిపక్ష పార్టీలు అనుకున్నారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం హసీనా దేశం విడిచి వెళ్లిపోయేందుకు, ప్రధాన మంత్రి పదవికి రాజీనామా చేసేందుకు ప్రధాన కారణం ఓ విద్యార్థి నాయకుడు. చదువుతుంటే ఆశ్చర్యంగా ఉన్నప్పటికీ.. ఇది ముమ్మాటికి నిజం..బంగ్లాదేశ్లో మాజీ ప్రధాని షేక్ హసీనా ప్రభుత్వాన్ని నిలువునా కూల్చింది విద్యార్థి సంఘం నాయకుడు. అతని పేరు నహీద్ ఇస్లాం. స్వాతంత్ర సమరయోధుల కుటుంబాలకు 30% రిజర్వేషన్ విధిస్తూ తీసుకొచ్చిన చట్టానికి వ్యతిరేకంగా ఇస్లాం తీవ్రమైన పోరాడాలు చేశాడు. బంగ్లాదేశ్ ను అట్టుడికించేలా ఆ ఉద్యమానికి అతడు నాయకత్వం వహించాడు. రిజర్వేషన్ విధానం సరికాదని వెలుగెత్తాడు. సోషల్ మీడియాను ఉపయోగించి.. ప్రభుత్వం చేస్తున్న తప్పిదాలను యువకులకు అర్థమయ్యేలాగా వివరించాడు. రిజర్వేషన్ విధానం పై అతడు సంధించిన ప్రశ్నలు హసీనా ప్రభుత్వాన్ని ఊపిరి ఆడకుండా చేశాయి. చివరికి ఆమె తన పదవికి రాజీనామా చేసే దిశగా పరిస్థితులు దోహదం చేశాయి. ఫలితంగా ఆమె దేశం విడిచి వెళ్లిపోయారు..సహీద్ ఇస్లాం ప్రస్తుతం ఢాకా యూనివర్సిటీలో సోషియాలజీ చదువుతున్నాడు. అతడు మానవ హక్కుల కార్యకర్తగా కూడా పనిచేస్తున్నాడు. విద్యార్థి ఉద్యమ సంఘానికి జాతీయస్థాయిలో కోఆర్డినేటర్ గా వ్యవహరిస్తున్నాడు. స్వాతంత్ర సమరయోధుల కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలలో 30 శాతం రిజర్వేషన్ కల్పించడాన్ని అతడు పూర్తిగా తప్పుపట్టాడు. సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ ఉద్యమానికి శ్రీకారం చుట్టాడు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు దారుణంగా ఉందని నేరుగా ఆరోపించాడు. ప్రభుత్వ ఉద్యోగాలను ఓ పార్టీ వారికి కట్టబెట్టేందుకు ప్రభుత్వం తీసుకుని నిర్ణయాన్ని అతడు పూర్తిగా తప్పు పట్టాడు. అంతేకాదు షేక్ హసీనాకు చెందిన ఆవామీ లీగ్ పార్టీకి వ్యతిరేకంగా బంగ్లాదేశ్లో విస్తృతంగా ప్రచారం చేశాడు నహీద్. షేక్ హసీనా విద్యార్థి నాయకులను ఉగ్రవాదులుగా పోల్చడంతో.. నహీద్ తన ఉద్యమాన్ని తీవ్రతరం చేశాడు. "విద్యార్థులు కట్టెలు పట్టుకుంటే సమస్యలు పరిష్కారం అవుతాయని.. ఒకవేళ కర్రలు కూడా పని చేయని పక్షంలో ఆయుధాలను చేతుల్లోకి తీసుకుంటారని" షాభాగ్ లో నహీద్ చేసిన వ్యాఖ్యలు బంగ్లాదేశ్ లో సంచలనం సృష్టించాయి. నిరసనలు మరింత పెరిగేందుకు కారణమయ్యాయి.కాగా, జూలై 19న సుమారు 25 మంది నహిద్ ను అతడి ఇంటి నుంచి అపహరించారు. కళ్లకు గంతలు కట్టారు. రెండు చేతులకు సంకెళ్లు వేశారు. అతడిని తీవ్రంగా కొట్టారు. ఈ క్రమంలో అతడు పూర్బాచల్ ప్రాంతంలో అపస్మారక స్థితిలో ఉండగా స్థానికులు గుర్తించారు. అతడిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మరోసారి జూలై 26న కూడా అతడిని మరోసారి అపహరించారు.. గోనో సాహస్థ్య నగర్ లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతన్ని అపహరించారు. అయితే నహీద్ ను తాము కిడ్నాప్ చేయలేదని ఢాకా డిటెక్టివ్ పోలీసులు ప్రకటించారు. అయితే వారి మాటలను నహీద్ ఖండించాడు. తనను చంపేందుకు షేక్ హాసినా కుట్ర చేశారని ఆరోపించాడు. అయితే ఆ తర్వాత నహీద్ తన ఉద్యమాన్ని తీవ్రతరం చేశాడు. దీంతో దేశవ్యాప్తంగా రిజర్వేషన్లకు వ్యతిరేకంగా నిరసనలు మిన్నంటాయి.

# యాదాద్రిలో ఉద్యోగుల బదిలీ...

నల్గొండ: యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఉద్యోగుల ప్రక్షాళన ప్రారంభమైంది. ఆలయంలో ఏళ్ల తరబడి తిష్ట వేసిన 26 మంది ఉద్యోగులకు స్థానచలనం కలిగింది. యాదాద్రి నుంచి రాష్ట్రంలోని ఇతర ఆలయాలకు ఉద్యోగులను బదిలీ చేస్తూ రాష్ట్ర దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.రాష్ట్ర వ్యాప్తంగా అన్ని శాఖల్లో సాధారణ బదిలీలను ప్రభుత్వం చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్జేసీ(6ఎ), డీసీ (6బి), ఏసీ (6సి) హోదా కలిగిన దేవాలయాలకు చెందిన ఉద్యోగులలో ఒకే చోట నాలుగేళ్లుగా విధులు నిర్వహిస్తున్న వారిలో 40 శాతం వరకే స్థానచలనం కలిగించాలన్నదే దేవాదాయశాఖ యోచన. ఇందులో భాగంగానే ప్రముఖ ఆలయాల్లో సుదీర్ఘ కాలంగా ఒకేచోట పనిచేయడంతో అవినీతి, అక్రమాల ఆరోపణలను కొందరు ఉద్యోగులు ఎదుర్కొంటున్నారు. దీంతో ఆలయాల్లో ఉన్న అధికారులు, ఉద్యోగులను బదిలీ చేస్తే అవినీతి, అక్రమాలను రూపుమాపవచ్చని సర్కారు బదిలీల ప్రక్రియకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ఆర్జేసీ హోదా గల యాదాద్రి, భద్రాచలం, వేములవాడ ఆలయాల ఉద్యోగులు బదిలీ అయ్యారు. యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం నుంచి 65 మంది ఉద్యోగులు కౌన్సిలింగ్ కు హాజరు కాగా, 26 మంది ఉద్యోగులు బదిలీ అయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలనలో ఉన్న సమయంలో కొమురవెల్లి ఆలయం నుంచి యాదాద్రి, వేములవాడ, కొండగట్టు, భద్రాచలం, బాసర తదితర ఆలయాలకు ఉద్యోగులు బదిలీపై వెళ్లారు. అక్కడ విధులు నిర్వహించిన ఉద్యోగులు ఇక్కడికి వచ్చారు. అప్పట్లో జరిగిన బదిలీలు తప్ప మరోసారి ట్రాన్స్‌ఫర్లు లేకపోవడంతో ఉద్యోగులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నట్లు ప్రధానంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎట్టకేలకు జరిగిన బదిలీల్లో ఇద్దరు ఏఈవోలు, ఆరుగురు సూపరింటెండెంట్లు, ఏడుగురు సీనియర్ అసిస్టెంట్లు, తొమ్మిది మంది జూనియర్ అసిస్టెంట్లు, ఒక సివిల్ ఇంజినీర్ డీఈ, ఒక ఎలక్ట్రికల్ ఏఈ ఉన్నారు. యాదాద్రి ఆలయంలో చివరిసారిగా 2009లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో బదిలీలు జరిగాయి. అప్పటి నుంచి యాదాద్రి ఆలయంలో ఇప్పటివరకు బదిలీలు జరగలేదు. చాలా మంది అధికారులకు, పలు విభాగాలలో పనిచేసే ఉద్యోగులకు పదోన్నతులు లభించి యాదగిరిగుట్టలోనే ఉద్యోగాలు చేస్తున్నారు. దాదాపుగా 15 ఏళ్ల తర్వాత, తెలంగాణ ఏర్పడ్డాక తొలిసారిగా బదిలీలు జరిగాయి.

# ఇలా అయితే ఎలా...?

హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పూర్తిగా ఇంటికే పరిమితమయ్యారు. పార్టీ క్యాడర్ ను కూడా ఆయన పట్టించుకోవడం లేదు. కనీసం ప్రజల ముందుకు వచ్చేందుకుకూడా ఆయన ఇష్టపడటం లేదు. ప్రస్తుతం ఎన్నికలు లేవు కాబట్టి ఆయన వచ్చినా ఏం ప్రయోజనం అంటున్నారు పార్టీ నేతలు. అనవసర ఖర్చు తప్పించి ఎందుకు ఆయన బయటకు రావడం అంటూ కొందరు నేరుగానే చెబుతున్నారు. మరో వైపు పార్టీ నేతలు వరసగా వీడివెళ్లిపోతున్నా ఆయన తన ఇంట్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశమవుతున్నారు కానీ జనంలోకి వచ్చి పార్టీని బలోపేతం చేసే ప్రయత్నం చేయడంలేదు. పార్లమెంటు ఎన్నికల సమయంలో ప్రచారానికి వచ్చిన కేసీఆర్ ఆ తర్వాత అసెంబ్లీలో ఒకరోజు తళుక్కుమని మెరిసి మాయమయి పోయారు. నిజానికి జనంలో పట్టు సంపాదిస్తేనే నేతల వలసలు ఆగుతాయి. జనంలోకి కేసీఆర్ వస్తున్నారంటే అప్పుడు నేతల్లో కూడా ఒకింత భయం ఏర్పడుతుంది. తాము పార్టీ మారితే నియోజక వర్గాల్లో ఏమవుతుందోనన్న ఆందోళన వారిలో కలుగుతుంది. పార్లమెంటు ఎన్నికల్లో తన సొంత జిల్లా మెదక్ ను కూడా చేజార్చుకో వాల్సి వచ్చింది. ఒక్క పార్లమెంటు సీటు కూడా రాకపోయె. ఇంతదారుణమైన పరిస్థితి గతంలో ఎన్నడూ లేదు. ఢిల్లీలో ఆర్భాటంగా బీఆర్ఎస్ పార్టీని ప్రారంభించిన కేసీఆర్ హస్తిన వైపు కూడా చూడటం లేదు. అసలు పార్టీ కార్యాలయం అక్కడ ఉందా? లేదా? అన్న డౌట్ కూడా చాలా మందిలో కలగక మానదు.ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం దూకుడు మీద ఉంది. రైతు రుణమాఫీ అమలు చేసింది. అయితే కొందరికే దక్కిందన్న ప్రచారం జరుగుతుంది. రైతులు కూడా కొన్ని చోట్ల ఆందోళనకు దిగుతున్నారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ బయటకు వచ్చి రైతులకు అండగా నిలబడాల్సిన పరిస్థితి ఉంది. కింది స్థాయి క్యాడర్ లో కూడా కేసీఆర్ బయటకు రావాలని కోరుకుంటున్నారు. కానీ కేసీఆర్ మాత్రం ఇప్పుడు వచ్చి చేసేదేమీ లేదన్న ధోరణితో ఉన్నారు. కేటీఆర్, హరీశ్ రావులు చూసుకుంటారులే అన్న ధీమాలో ఉన్నారు. ఆయన వస్తే కొంత ప్రభుత్వానికి చెక్ పెట్టవచ్చున్న భావన కనిపిస్తుంది. నేతలు కూడా అదే కోరుకుంటున్నారు. కానీ కేసీఆర్ మాత్రం బయటకు కనిపించడానికి ఇష్టపడటం లేదు. మొన్నటి వరకూ కాలు బాగా లేక ఆయన విశ్రాంతి తీసుకున్నారని అనుకోవచ్చు. కానీ ఇప్పుడు ఆయన ఆరోగ్యానికి ఢోకా లేదు. కనీసం జిల్లాల పర్యటనలు చేస్తే క్యాడర్ లో ధైర్యం ఉంటుంది. నూతన నాయకత్వానికి కొంత చేయూత నిచ్చినట్లవుతుంది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల సమయంలో వస్తే జనం పెద్దగా నమ్మరు. అందుకే ఇప్పుడే కేసీఆర్ తమ ఇలాకాకు వస్తే పార్టీ వైపు ప్రజలు మొగ్గు చూపే అవకాశముందని నేతలు భావిస్తున్నారు. కానీ కేసీఆర్ మాత్రం ఇంటి నుంచి కాలు బయటపెట్టడం లేదు. మరి ఎప్పటికి కారు పార్టీ తిరిగి బలం పుంజుకుంటుందన్న భావన గులాబీ శ్రేణుల్లో నెలకొని ఉంది.

# వివాదంలో బీఆర్ఎస్ ఆఫీస్...

నల్గొండ: నల్గొండ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ల మధ్య కొత్త వివాదం నడుస్తోంది. నల్గొండ టౌన్ లో అత్యంత విలువైన ప్రాంతంగా పేరుపడ్డ హైదరాబాద్ రోడ్ లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని నిర్మించడమే ఈ వివాదానికి ప్రధాన కారణం. ఆగ్రోస్ ఇండస్ట్రీస్ కు చెందిన విలువైన భూమిలో ఎకరా స్థలాన్ని బీఆర్ఎస్ 99 ఏళ్లకు లీజుకు తీసుకుంది. అది కూడా గజానికి కేవలం రూ.100 మాత్రమే ఏడాదికి చెల్లించేలా అతి తక్కువ అమౌంట్ కు నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం, జిల్లా బీఆర్ఎస్ జిల్లా శాఖకు లీజు ఇచ్చింది. వరంగల్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి బీఆర్ఎస్ నిర్మించిన పార్టీ కార్యాలయం నిర్మించిందని ఆ స్థలంపై అక్కడి కార్పొరేషన్ లో వివాదాం జరుగుతున్నట్టే.. నల్లగొండ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ ఎలాంటి మున్సిపల్ అనుమతులు లేకుండా భవన్నాన్ని నిర్మించిందని వివాదం జరుగుతోంది. ఆగ్రోస్ నుంచి లీజుకు తీసుకున్న ఎకరా స్థలం కంటే ఎక్కువ స్థలాన్ని బీఆర్ఎస్ వినియోగించుకుందన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ముఖ్యమైన ప్రాంతంలో, విలువైన భూమిని ప్రభుత్వ ప్రజోపయోగ కార్యక్రమాలకు ఉపయోగిస్తామని జిల్లా మంత్రి, నల్గొండ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆరోపిస్తున్నారు. మార్కెట్ రేటు ప్రకారం బీఆర్ఎస్ ఆఫీసు నిర్మించిన స్థలం విలువ రూ.2 కోట్ల పైమాటే. స్థానిక మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన ఆఫీసును కూల్చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి జిల్లా కలెక్టర్ కు, మున్సిపల్ అధికారులకు బహిరంగంగానే పేర్కొనడం ఇరు పార్టీల మధ్య వేడి పుట్టించింది. " నేను అమెరికా వెళ్లొచ్చేలోగా ఈనెల 11 వ తేదీ నాటికి ప్రభుత్వ స్థలంలో ఎలాంటి అనుమతుల్లేకుండా నిర్మించిన బీఆర్ఎస్ ఆఫీసును కూల్చాలి.." అంటూ మంత్రి కోమటిరెడ్డి తాజా హుకుం జారీ చేయడంతో బీఆర్ఎస్ వర్గాలు భగ్గుమంటున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ కు మున్సిపల్ అధికారులు ఫైనల్ నోటీసులు కూడా ఇచ్చేశారు.జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ ఏక పక్షంగా విలువైన భూమిని లీజు కింద తీసేసుకుందన్న ఆరోపణలు మొదటి నుంచీ ఉన్నాయి. వాస్తవానికి నల్గొండ టౌన్ లో టీడీపీ, బీజేపీ, సీపీఐ, సీపీఎంలకు సొంత ఆఫీసు భవనాలు ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీకి స్థానిక ప్రకాశం బజారులో పాత బస్టాండు సమీపంలో భూమి ఉన్నా పార్టీ కార్యాలయ నిర్మాణం అరకొర పనుల తర్వాత నిలిచిపోయింది. అయితే, బీఆర్ఎస్ మొదటి నుంచీ తన పార్టీ కార్యాలయాన్ని అద్దె భవనంలోనే కొనసాగించింది. 2014లో రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఏర్పడిన తొలి ప్రభుత్వం హయాంలో పార్టీ కార్యాలయాలకు భూముల కేటాయింపు జరగలేదు. 2018లో రెండో సారి ప్రభుత్వం ఏర్పాటయ్యాక రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలకు భూముల కేటాయింపు, భూమి పూజలు, భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. 2023లో మూడో సారి తెలంగాణ రాష్ట్రానికి జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ చేతి నుంచి కాంగ్రెస్ అధికారం చేజిక్కించుకుంది.దాదాపు అన్ని జిల్లాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన భూ కేటాయింపులపై వివరాలు సేకరిస్తున్నారు. నల్గొండ జిల్లా కేంద్రంలో ఆగ్రోస్ సంస్థకు ఉన్న విలువైన భూమిలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఒక పెట్రోల్ బంక్ ఏర్పాటు చేశారు. మిగిలిన భూమిలో బీఆర్ఎస్ కు ఎకరం స్థలాన్ని 99 ఏళ్లకు అతి తక్కువ లీజ్ అమౌంట్ కు ఇవ్వడంపై మొదట్లోనే విమర్శలు, వ్యతిరేకత వచ్చింది. అయితే, అప్పుడు బీఆర్ఎస్ అధికారంలో ఉండడం, జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యేతో పాటు, నల్గొండ మున్సిపాలిటీ కూడా బీఆర్ఎస్ చేతిలోనే ఉండడంతో భూ కేటాయింపులు తేలిగ్గా జరిగిపోయాయి. 2023 ఎన్నికల తర్వాత నల్లగొండ ఎమ్మెల్యేగా కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విజయం సాధించడం, ఇప్పుడు రాష్ట్ర కేబినెట్ లో ఆర్ అండ్ బి మంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తుండడం, నల్గొండ మున్సిపల్ చైర్మన్ పై అవిశ్వాసం నెగ్గి, కాంగ్రెస్ చేతిలోకి మున్సిపాలిటీ వెళ్లిపోవడం వంటి పరిణామాలు జరిగాయి. దీంతో విలువైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకునేందుకు నల్గొండ మున్సిపాలిటీ సిద్ధమైంది. దీనికి మంత్రి కోమటిరెడ్డి ఆదేశాలు తోడుకావడంతో ఇది రాజకీయ రంగును పులుముకుంది.

## వ్యభిచార కేంద్రంపై పోలీసుల దాడి

అల్వాల్: అల్వాల్ లో వ్యభిచారం ముఠాలు చెలరేగిపోతున్నాయి.బయట మసాజ్ సెంటర్ బోర్డు పెట్టి లోపల వ్యభిచారానికి పాల్పడుతున్నారు నిర్వాహకులు. అల్వాల్ హిల్స్లో ఓ మసాజ్ సెంటర్ పై ఎస్ ఓ టి పోలీసులు దాడులు చేసారు. ??వెల్నెస్ స్పా సెంటర్లో వ్యభిచార నిర్వహిస్తున్నట్లు ముందస్తు సమాచారం మేరకు ఎస్ఓటి పోలీసులు దాడి చేసారు. ఈ దాడుల్లో వ్యభిచార కేంద్రాన్ని నడుపుతున్న 3 ఆర్గనైజర్లు, మొత్తం తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం, ఇమ్రాన్, సాయి, కిషన్, ముగ్గురు ఆర్గనైజర్లు వీరితోపాటు ఇద్దరు మహిళలు ముగ్గురు విటులు 2000 రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

# లోకల్ బాడీ ఎలక్షన్స్ పై ముందుకు ఎలా

వరంగల్: అసెంబ్లీలో అయినా బయట అయినా తెలంగాణలో అధికార పార్టీపై విరుచుకుపడుతోంది ఎవరు అంటే... భారత రాష్ట్ర సమితి మాత్రమే. అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం, పార్లమెంట్ ఎన్నికల్లో సగానికిపైగా స్థానాల్లో డిపాజిట్లు కోల్పోవడం, కేసీఆర్ ఫీల్డ్‌లోకి వచ్చేందుకు తటపటాయించడం, ఎమ్మెల్యేలు వరుసగా పార్టీ మారడం వంటి ఎన్ని ఎదురు దెబ్బలు తగిలినా బీఆర్ఎస్ .. కాంగ్రెస్ పై పోరాటంలో ఎప్పుడూ వెనక్కి తగ్గలేదు. బీఆర్ఎస్ పని అయిపోయిందని ఎంత మంది చెబుతున్నా.. ఆ పార్టీ హైకమాండ్ మాత్రం.. పూర్వ వైభవం సాధిస్తామన్న నమ్మకంతోనే ఉన్నారు. క్యాడర్ కు ధైర్యం కల్పిస్తున్నారు. అయితే భవిష్యత్ తమదేనని బీఆర్ఎస్ పని అయిపోయిందని అనుకుటున్న బీజేపీ మాత్రం.. కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటంలో పెద్దగా కనిపించడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వంపై రకరకాల కారణాలతో బీఆర్ఎస్ విరుచుకుపడుతోంది. ఆరు గ్యారంటీల అమలు దగ్గర నుంచి రుణమాఫీ వరకూ... శాంతి భద్రతల నుంచి పెట్టుబడుల వరకూ ప్రతి విషయంలోనూ సందు దొరికితే ప్రభుత్వాన్ని ఇరుకున పెడుతున్నారు. కానీ తామే ప్రధాన ప్రతిపక్షమని..దానికి పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చిన ఓట్లు, సీట్లే సాక్ష్యమని వాదిస్తున్న బీజేపీ నేతలు మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. ఎప్పుడో ఓ సారి ప్రెస్ మీట్ పెడతారు. ఆ ప్రెస్ మీట్ పెట్టారన్న సంగతి కూడా చాలా మందికి తెలియదు. రోడ్డు ఎక్కి పోరాడిన సందర్భాలు కూడా లేవు. ఉన్నా... ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇలా పోరాటాల విషయంలో బీజేపీ వెనుకబడిపోవడం ఆ పార్టీ క్యాడర్ కూడా ఆశ్చర్యపోతోంది. అయితే బీజేపీ ఏం చేసినా దానికో వ్యూహం ఉంటుందని ఆ పార్టీ కార్యకర్తలు గట్టిగా నమ్ముతున్నారు. ఆరిపోయే దీపానికి వెలుగు ఎక్కువ అని బీఆర్ఎస్ గురించి అంటున్నారు. అయితే బీజేపీలో అంతర్గత పోరాటాల వల్ల.. పార్టీ ముఖ్య నేతల మధ్య సఖ్యత లేకపోవడం వల్లనే పార్టీ నిస్తేజంగా మారిందని అనే వారు ఎక్కువగా ఉన్నారు. కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు కేంద్ర మంత్రులుగా ఉన్నారు. వీకెండ్స్ లో తప్ప పార్టీ కార్యక్రమాలను పట్టించుకునే పరిస్థితుల్లో లేరు. ఈటల రాజేందర్ చొరవ తీసుకుని బాధ్యత తీసుకుంటే చాలా మంది సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. స్వయంగా బీఎల్ సంతోష్ వచ్చి పరస్థితుల్ని చక్కదిద్దేందుకు ప్రయత్నించారు. ఎంత వరకూ చక్కబెట్టారో ఎవరికీ తెలియదు. కానీ.. ఈ పోరాటం వల్ల మాత్రమే .. పార్టీ కార్యక్రమాలు ముందుకు సాగడం లేదని ఎక్కువ మంది నమ్ముతున్నారు. మరో వైపు బీజేపీలో బీఆర్ఎస్ పార్టీ విలీనం లేదా, పొత్తులు ఖాయమన్న ప్రచారం కొంత కాలంగా జరుగుతోంది. అందులో ఎంత నిజముందో ఆ రెండు పార్టీల ముఖ్య నేతలకే తెలియాలి. కానీ ఆ ప్రచారం మాత్రం గట్టిగా సాగాలని వారు కోరుకుంటున్నారు. అందుకే విలీనం, పొత్తుల వార్తల్ని ఖండించడం లేదు. అసలు స్పందించడం లేదు. ఇలా ప్రచారం జరగడంతో బీజేపీ క్యాడర్ లో గందరగోళం ఏర్పడుతోంది. అలాంటి పరిస్థితే వస్తే.. ఎవరు ఎవరి మీద స్వారీ చేస్తారోనని కంగారు పడుతున్నారు. బీఆర్ఎస్ తో ఇలాంటి సమయంలో ఎలాంటి సంబంధాలు పెట్టుకున్నా అది బీజేపీకి నష్టం చేస్తుంది కానీ.. లాభం చేసే అవకాశం లేదని వాదిస్తున్నారు. అయితే కింది స్థాయి క్యాడర్ మాటలు వినేవారు ఇప్పుడు ఎవరూ బీజేపీ లో లేరు.

# మెడికల్ అడ్మిషన్లలో స్థానిక చిచ్చు

హైదరాబాద్: తెలంగాణలోని వైద్య ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లలో జాతీయ కోటా మినహా మిగిలిన కన్వీనర్ కోటా సీట్లన్నీ స్థానిక విద్యార్థులకే దక్కనున్నాయి. రాష్ట్ర పునర్విభజన చట్టం మేరకు 10 సంవత్సరాలపాటు అమలైన 15 శాతం అన్‌రిజర్వ్‌డ్ కోటా సీట్లు ఈ ఏడాది నుంచి రద్దయ్యాయి. రాష్ట్రంలో 2014కు ముందు ఏర్పాటైన అన్ని మెడికల్ కాలేజీల్లో 15 శాతం అన్‌రిజర్వ్‌డ్ కోటా సీట్లకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు పోటీపడేవారు. అయితే 2024 జూన్ 2 నాటికి రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తయింది. దీంతో కన్వీనర్ కోటా సీట్లన్నీ స్థానిక విద్యార్థులతోనే భర్తీ చేయనున్నారు. అయితే ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్లలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన నిబంధనలతో తెలంగాణ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగనుంది. తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కళాశాలల్లో.. ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల భర్తీకి వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ ఆగస్టు 3న నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. అయితే ప్రవేశ ప్రక్రియకు సంబంధించిన వర్సిటీ విడుదల చేసిన మార్గదర్శకాల్లో.. స్థానికత నిర్ధారణపై గతంలో ఉన్న నిబంధనల్లో మార్పులు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం జులై 19న జారీ చేసిన 33జీవో ప్రకారం స్థానికత నిబంధనలను పేర్కొన్నట్టు వర్సిటీ తెలిపింది. ఈ నిబంధనలతో తీవ్ర అన్యాయం జరిగేలా ఉందని స్థానిక విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఎక్కడ చదివితే అక్కడ స్థానికులుగా పరిగణిస్తామని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అయితే 2023-24 విద్యా సంవత్సరం వరకు 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు 7 సంవత్సరాల కాలంలో గరిష్ఠంగా నాలుగేళ్లు ఎక్కడ చదివితే అక్కడ స్థానికులుగా పరిగణలోకి తీసుకునేవారు. స్థానికతపై ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి చేసిన మార్పులతో తెలంగాణ వారికే ఎక్కువ అన్యాయం జరుగుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం.. హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా 10 సంవత్సరాల గడువు.. ఈ ఏడాది జూన్ 2తో ముగిసింది. విద్యాసంస్థల్లో ఏపీ విద్యార్థులకు కోటాలోనూ ఇదే అమలు కానుంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిష్ఠాత్మక కళాశాలలు లేనందున.. అక్కడి విద్యార్థులకు వైద్యవిద్యలో అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో 33ను తీసుకువచ్చినట్లు స్పష్టమవుతోంది. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు ప్రభుత్వం తాజాగా తీసుకొచ్చిన జీవోతో హైదరాబాద్‌లో చదివిన ఏపీ విద్యార్థులు తెలంగాణలో స్థానికులుగా ఉంటారు. ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లోని చాలా ప్రాంతాలకు చెందిన వారు విజయవాడ, గుంటూరులలో ఇంటర్మీడియట్ చదువుతారు. అదే సమయంలో ఇంటర్మీడియట్ కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లిన తెలంగాణ విద్యార్థులు స్థానికేతరులుగా మారుతున్నారు. వారికి స్థానికత కోటాకు దూరమవుతున్నారు. తెలంగాణలో పుట్టి పెరిగి కేవలం రెండేళ్ల ఇంటర్మీడియట్ చదువుల కోసం ఏపీకి వెళ్లిన వారు సొంత రాష్ట్రంలో స్థానికులు కాకుండా పోతున్నారు. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రైవేటు కాలేజీలకు మేలు చేసేందుకే స్థానికతపై రాష్ట్ర ప్రభుత్వం కొత్త నిబంధనలను పెట్టిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కళాశాలల్లో.. ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల భర్తీకి వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ ఆగస్టు 3న నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. కౌన్సెలింగ్‌కు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆగస్టు 4న ప్రారంభమైంది. నీట్ యూజీ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు ఆగస్టు 13న సాయంత్రం 6 గంటల వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్నవారికి ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించనున్నారు. ఇక ఆలిండియా కోటా సీట్ల భర్తీకి ఆగస్టు 14 నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కానుంది. విద్యార్థుకలు ఆగస్టు 23న మొదటి విడత సీట్లను కేటాయించనున్నారు. ఈ నేపథ్యంలో కాళోజీ యూనివర్సిటీ కూడా ఆగస్టు 20 తర్వాత వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించి, సీట్లను కేటాయించనుంది.

8,315 సీట్లు అందుబాటులో.. రాష్ట్రంలో కొత్తగా అందుబాటులోకి వచ్చిన 4 ప్రభుత్వ మెడికల్ కాలేజీలతో కలిపి మొత్తం కళాశాలల సంఖ్య 60కి చేరింది. ఇందులో 30 ప్రభుత్వ కళాశాలలు, 30 ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి. ఆయా కాలేజీల్లో మొత్తం 8,715 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ కాలేజీల్లో 4,115 సీట్లు; ప్రైవేట్ కాలేజీల్లో 4,600 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ కళాశాలల్లో కన్వీనర్ కోటా కింద 3,498 సీట్లు ఉన్నాయి. ఇక ప్రైవేట్ కళాశాలల్లో కన్వీనర్ కోటా కింద 2,300 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇక మొత్తం సీట్లలో జాతీయ కోటా కింద 617 సీట్లు భర్తీ కానుండగా.. ఇక మిగిలిన సీట్లను రాష్ట్రంలో కాళోజీ హెల్త్ వర్సిటీ భర్తీ చేయనుంది.

రిజర్వేషన్ల వర్తింపు ఇలా ..

- రాష్ట్రంలో ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లలో ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 10 శాతం, బీసీలకు 29 శాతం సీట్లు దక్కనున్నాయి.
- 9, 10, ఇంటర్ ఇక్కడ చదివిన వారినే స్థానికులుగా పరిగణనలోకి తీసుకుంటారు.
- ఈ ఏడాది నుంచి 9, 10, ఇంటర్‌ను (వరుసగా నాలుగేళ్లు) రాష్ట్రంలో చదివినవారినే ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల కేటాయింపులో స్థానిక విద్యార్థులుగా పరిగణనలోకి తీసుకుంటారు.
- రాష్ట్రంలో ఈసారి నీట్-యూజీ పరీక్షను 77,848 మంది విద్యార్థులు నీట్ యూజీపరీక్షకు హాజరుకాగా.. 47,356 మంది అర్హత సాధించారు.

# 17 టన్నుల పీడీఎఫ్ బియ్యం పట్టివేత

హైదరాబాద్: ప్రజా పంపిణీ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తుండగా మేడ్చల్ పోలీసులు పట్టుకున్నారు. భారీ మొత్తంలో బియ్యాన్ని నగరం నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్న క్రమంలో గుండ్లపోచంపల్లి 3 మున్సిపాలిటీ కండ్లకయ సమీపంలో పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... నగరంలోని ఎల్బీనగర్లో 17 టన్నుల రేషన్ బియ్యాన్ని ఫయాజ్ అనే వ్యక్తి లారీ(కేప33 8077)లో లోడ్ చేయించారు.

డ్రైవర్ రాజశేఖర్ (42)ను బియ్యాన్ని మేడ్చల్ మీదుగా మహారాష్ట్రకు తరలించేందుకు పురమాయించాడు. పోలీసులకు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు ఔటర్ రింగు రోడ్డుకు సమీపంలో కండ్లకోయ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో లారీ ప్రజా పంపిణీ బియ్యాన్ని తరలిస్తున్నట్టు గుర్తించారు. డ్రైవర్ రాజశేఖర్ను అదుపులోకి విచారించగా బియ్యాన్ని మహారాష్ట్రకు తరలిస్తున్నట్టు తేలింది. ఫయాజు మహారాష్ట్రకు బియ్యాన్ని తరలిస్తుండగా అక్కడ రత్నాకర్ అనే వ్యక్తిని కొనుగోలు చేస్తున్నారు. డ్రైవర్ను అదుపులోకి తీసుకొని, స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని పోలీస్టేషన్కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

# రెజ్లింగ్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన వినేశ్ ఫోగాట్, ఒలింపిక్స్‌లో ఆమెను అనర్హురాలిగా ప్రకటించడంపై రాజ్యసభలో దుమారం..



భారత ప్రముఖ రెజ్లర్ వినేశ్ ఫోగాట్ రెజ్లింగ్‌కు రిటైర్మెంట్ ప్రకటించారు. పారిస్ ఒలింపిక్స్‌లో ఫైనల్ బౌట్‌కు కొన్ని గంటల ముందు వినేశ్ ఫోగాట్‌ను అనర్హురాలిగా ప్రకటించారు.
అనంతరం ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారు.
ఈ అంశంపై గురువారం రాజ్యసభలో దుమారం రేగింది. అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది.
రిటైర్మెంట్ నిర్ణయాన్ని వినేశ్ ఫోగాట్ గురువారం ఎక్స్ (ట్విటర్)లో ప్రకటించారు.
"అమ్మా, నాపై కుస్తీ గెలిచింది. నేను ఓడిపోయాను. క్షమించు. నీ కల, నా ధైర్యం రెండూ చెదిరిపోయాయి. ఇంతకు మించిన శక్తి ఇక నాలో లేదు.
(కుస్తీకి వీడ్కోలు 2001-2024.)
మీ అందరికీ రుణపడి ఉంటాను, క్షమించండి" అని ఆమె ట్వీట్‌లో పేర్కొన్నారు.
"వినేశ్ మానసికంగా కుంగిపోయారు"
మంగళవారం రాత్రి సెమీస్ గెలిచిన తర్వాత వినేశ్, స్వర్ణ పతక పోరుకు అర్హత సాధించారు.
బుధవారం రాత్రి ఈ పోరు జరగాల్సి ఉండగా, నిర్ణీత బరువు కంటే కొన్ని గ్రాములు అదనపు బరువు ఉన్నారనే కారణంతో వినేశ్‌ను ఫైనల్ పోటీలకు అనర్హులిగా ప్రకటించారు.
ఫోగాట్‌పై అనర్హత వేటు గురించి తెలిసి షాక్ గురయ్యానని, నిరాశ చెందానని భారత ఒలింపిక్ సంఘం (ఐఓసీ) అధ్యక్షురాలు పీటీ ఉష అన్నారు. ప్రస్తుతం వినేశ్ శారీరకంగా, ఆరోగ్యం పరంగా బాగానే ఉన్నారని మానసికంగా కుంగిపోయారని పీటీ ఉష చెప్పినట్లు వార్తా సంస్థ ఏఎన్ఐ పేర్కొంది.
"వినేశ్ అనర్హతకు గురయ్యారనే వార్త ఎంతో షాకింగ్‌గా, నిరాశగా అనిపించింది. తర్వాత వినేశ్‌ను కలిసేందుకు వెళ్లాను. ఆమె ఆరోగ్యంగానే ఉన్నారు. కానీ, మానసికంగా కుంగిపోయారు. మా సహాయక బృందం ఆమెతో ఉన్నారు" అని పీటీ ఉషను ఉటంకిస్తూ వార్తాసంస్థ ఏఎన్ఐ తెలిపింది.
'కాస్'లో వినేశ్ అప్పీల్
అనర్హత వ్యవహారంపై ఫోగాట్, కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్ (కాస్)లో అప్పీల్ చేసినట్లు వార్తా సంస్థ ఏఎన్ఐ పేర్కొంది.
తనకు రజతం ఇవ్వాలంటూ ఫోగాట్ చేసిన అప్పీల్‌పై గురువారం ఉదయం కాస్ తీర్పునిస్తుందని ఐఓఏ వర్గాలను ఉటంకిస్తూ ఏఎన్ఐ తెలిపింది.
"తనపై అనర్హతను సవాలు చేస్తూ వినేశ్, కాస్‌లో అప్పీల్ చేశారు. రజతం ఇవ్వాలని కోరారు. గురువారం ఉదయం కాస్ తీర్పునిస్తుంది" అని ఏఎన్ఐ తన కథనంలో రాసింది.
"వినేశ్, మీరు ఓడిపోలేదు, మిమ్మల్ని ఓడించారు"
వినేశ్ రిటైర్మెంట్ ట్వీట్‌పై సహచర రెజ్లర్ బజ్‌రంగ్ స్పందించారు.
"వినేశ్ మీరు ఓడిపోలేదు, మిమ్మల్ని ఓడించారు. మాకు మీరే ఒక విజేత. మీరు భారత పుత్రిక మాత్రమే కాదు, దేశానికి గర్వకారణం" అని
చేశారు.
వినేశ్ ఫోగాట్ రెజ్లింగ్‌కు వీడ్కోలు పలికిన తర్వాత హరియాణా సీఎం నయాబ్ సైనీ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చేశారు.
"హరియాణాకు చెందిన మా వీర కుమార్తె వినేశ్ ఫోగాట్ అద్భుత ప్రదర్శనతో ఒలింపిక్స్ ఫైనల్స్‌కు చేరారు.
కొన్ని కారణాల వల్ల ఆమె ఒలింపిక్ ఫైనల్ ఆడలేకపోయి ఉండొచ్చు. కానీ ఆమె మనందరికీ చాంపియన్.
వినేశ్ ఫోగాట్‌ను ఒక పతక విజేతగా స్వాగతించాలని, సత్కరించాలని మా ప్రభుత్వం నిర్ణయించింది.
ఒలింపిక్ రజత పతక విజేతకు అందించే అన్ని రివార్డులు, సన్మానాలు, సౌకర్యాలను వినేశ్ ఫోగాట్‌కు కూడా కృతజ్ఞతతో మా ప్రభుత్వం అందజేస్తుంది.
మిమ్మల్ని చూసి గర్విస్తున్నాం వినేశ్" అని ఆయన ట్వీట్ చేశారు.

# నెలసరి మూడో రోజు.. వీక్‌నెస్ వల్ల ఇలా: మీరాబాయి చాను



"నా ప్రదర్శనతో సంతృప్తిగా ఉన్నాను. కోచ్ చెప్పినట్లుగా చేశాను. పతకం సాధించలేకపోయినా నా అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చాను. గాయం నుంచి కోలుకునే క్రమంలో తక్కువ సమయమే దొరికినా దానిని సద్వినియోగం చేసుకోగలిగాను. 85 కిలోల బరువు ఎత్తడం కోసం ఎంతగానో ప్రాక్టీస్ చేశా. కాంపిటీషన్ సమయంలోనూ పొరపాట్లకు తావివ్వలేదు. క్లీన్ అండ్ జెర్క్ విషయంలో పూర్తి ఆత్మవిశ్వాసంతో ఉన్నాను. నిజానికి.. పోటీకి సిద్ధమవుతున్నపుడే నా నెలసరి మొదలైంది. ఇది మూడోరోజు. అది కూడా ప్రభావం చూపింది. వీక్‌నెస్ కారణంగా లక్ష్యాన్ని చేరుకోలేకపోయాను. దేశం కోసం పతకం గెలవాలని ఎంతగానో కృషి చేశాను. అయినా.. ఆటలో గెలుపోటములు భాగమే. వచ్చే ఒలింపిక్స్ కోసం మరింత కష్టపడతా. అత్యుత్తమ ప్రదర్శనతో దేశానికి పతకం అందిస్తా" అంటూ భారత వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను ఉద్వేగానికి లోనైంది.
నాలుగోస్థానంతో సరి
ప్యారిస్ ఒలింపిక్స్-2024లో మీరాబాయి తృటిలో పతకం కోల్పోయిన విషయం తెలిసిందే. మహిళల 49 కేజీల విభాగంలో పోటీపడ్డ ఈ మణిపూర్ ఆణిముత్యం నాలుగోస్థానంతో సరిపెట్టుకుంది. ఫలితంగా కాంస్య పతకం చేజారింది.
ఫైనల్లో 12 మంది పోటీపడగా.. మీరాబాయి మొత్తం 199 కేజీల బరువు మాత్రమే ఎత్తగలిగింది. స్నాచ్‌లో 88 కేజీలు... తర్వాత క్లీన్ అండ్ జెర్క్ అంశంలో 111 కేజీలు బరువెత్తింది. ఈ క్రమంలో నాలుగో స్థానంలో నిలిచింది. కాగా గత టోక్యో ఒలింపిక్స్‌లో మీరాబాయి రజత పతకం గెలిచిన విషయం తెలిసిందే.
ఇక ఈ విభాగంలో చైనా వెయిట్‌లిఫ్టర్ హు జిహుయ్ మొత్తం 206 కేజీల బరువెత్తి( (చైనాబీ స్నాచ్‌లో 93 కేజీలుంక్లీన్ అండ్ జెర్క్‌లో 117 కేజీలు) స్వర్ణం సాధించగా.. రొమేనియాకు చెందిన మిహేలా వలెంటీనా మొత్తం 205 కేజీలు బరువెత్తి రెండో స్థానంలో నిలిచి రజతం సొంతం చేసుకుంది. థాయ్‌లాండ్‌కు చెందిన సురోద్‌చనా ఖాంబావ్ 200 కేజీల బరువెత్తి కాంస్యం కైవసం చేసుకుంది.

# పతకాలను సంఖ్యను పోల్చడం ఏమాత్రం సరికాదు: నీరజ్




పతకాల సంఖ్యను పోల్చడం ఏమాత్రం సరికాదని గోల్డెన్ బాయ్, భారత బల్లెం వీరుడు నీరజ్ చోప్రా అభిప్రాయపడ్డాడు. ఒలింపిక్స్‌లో నాలుగో స్థానం సాధించడం సామాన్యమైన విషయం కాదన్నాడు.
పారిస్‌లో భారత ఆటగాళ్లు సాధించన దాన్ని తక్కువ చేసి చూడటానికి వీల్లేదన్నాడు. క్రీడా సంస్కృతిలో మనకంటే మెరుగ్గా కొన్ని దేశాలు ఉన్నాయని నీరజ్ పేర్కొన్నాడు. టోక్యో ఒలింపిక్స్ పతకాలతో పోలిస్తే పారిస్ ఒలింపిక్స్ 2024లో తగ్గినట్లు వాదనలు వస్తున్న వేళ భారత్ ఒలింపిక్ బృందానికి మద్దతుగా స్పందించాడు. జావెలిన్ త్రో అర్హత పోటీల అనంతరం నీరజ్ చోప్రా మాట్లాడుతూ%ొ% 'పారిస్ ఒలింపిక్స్ 2024లో మన బృందం బాగా ఆడుతోంది. విశ్వక్రీడల్లో నాలుగో స్థానంలో నిలిచిన వారిని మనం ఏమాత్రం విస్మరించలేం. ఒలింపిక్స్‌లో పాల్గొనడం, ఫైనల్స్ ఆడటం సాధారణ విషయం కాదు. మనకే కాదు మిగిలిన దేశాలకు కూడా ఇది పెద్ద అంశమే. క్రీడా సంస్కృతిలో మనకంటే మెరుగ్గా ఉన్న కొన్ని దేశాలు ఉన్నాయి. టోక్యో'తో పతకాల పట్టికతో పోలుస్తున్నారని విన్నా. అలా చేయకూడదు. ప్రతిచోటా భిన్న పరిస్థితులు ఉంటాయి. మనలాగే ఇతరులూ సిద్ధమవుతారు. ఆటల్లో కొన్ని దేశాలు భారత్ కంటే ముందున్నాయనే వాస్తవాన్ని ఒప్పుకోవాలి. ఆట మెరుగుపర్చుకొనే కొద్దీ పతకాల పట్టికలో భారత్ కూడా ముందుకు వస్తుంది' అని అన్నాడు.
ఆగష్టు 6న జరిగిన క్వాలిఫయర్స్‌లో నీరజ్ చోప్రా గ్రూప్-బీ విభాగంలో తొలి ప్రయత్నంలోనే 89.34 మీటర్ల దూరం బల్లెం విసిరి టాప్ ప్లేస్‌లో నిలిచాడు. పురుషుల జావెలిన్ త్రో ఫైనల్ నేటి రాత్రి 11.55 గంటలకు జరగనుంది. అయితే ఫైనల్లో మనోడికి గట్టి పోటీ ఎదురుకానుంది. ఫైనల్ ప్రత్యర్థులు ముగ్గురు నీరజ్ అత్యుత్తమ వ్యక్తిగత ప్రదర్శన (89.94 మీటర్లు) కన్నా మెరుగైన రికార్డును కలిగి ఉన్నారు. అయితే పోటీల రోజు పరిస్థితుల్లో ఎవరు ఉత్తమ ప్రదర్శన చేస్తారన్నదే కీలకం. నేటి రాత్రి జరిగే ఫైనల్ పోరులోనూ నీరజ్ పసిడి గెలవాలని భారత అభిమానులు కోరుకుంటున్నారు.

# పతకానికి లక్ష్యసేన్ అర్హుడే.. తప్పకుండా సాధిస్తాడు: విక్టర్ ఆక్సెల్సెన్



సెమీస్ వరకు అద్భుతంగా ఆడిన లక్ష్యసేన్.. అక్కడ కాస్త తడబాటుకు గురయ్యాడు. దీంతో పతక రేసులో వెనుకబడిపోయాడు. పారిస్ ఒలింపిక్స్‌లో బంగారు పతకం సాధించిన విక్టర్ ఆక్సెల్సెన్ భారత స్టార్ షట్లర్‌పై ప్రశంసల వర్షం కురిపించాడు.
సెమీస్‌లో వీరిద్దరే తలపడిన సంగతి తెలిసిందే. అయితే, ఒలింపిక్స్‌లో సెమీస్‌కు చేరిన తొలి భారత షట్లర్‌గా 22 ఏళ్ల లక్ష్య సేన్ ఘనత సాధించాడు. ఇక కాంస్య పోరులోనూ చివరి వరకూ పోరాడి మలేషియా ఆటగాడు లీ జి జియా చేతిలో లక్ష్యసేన్ పరాజయం చవిచూశాడు.
"లక్ష్యసేన్.. మున్ముందు మరింతగా శ్రమించాలి బ్రదర్. నీ ఆటపట్ల ఎల్లవేళలా గర్వ పడుతూ ఉండు. లక్ష్య అద్భుతమైన ఆటగాడు. ఈ ఒలింపిక్స్‌లో అతడు చూపించిన పోరాటం సూపర్బ్. నేను ఎదుర్కొన్న కఠిన ప్రత్యర్థుల్లో అతడు ఒకరు. రాబోయే నాలుగేళ్లలో ఒలింపిక్స్ బంగారు పతకం సాధించే వారిలో అతడే హాట్ ఫేవరెట్. ఆల్ ది బెస్ట్ లక్ష్యసేన్. ఇప్పుడు ఈ పారిస్ ఒలింపిక్స్‌లో సెమీస్‌కు చేరిన ప్రతి ఒక్కరూ పతకం సాధించేందుకు అర్హులే. ఒలింపిక్స్‌లో అద్భుతమైన ప్రదర్శన చేసిన వారందరికీ కంగ్రాట్స్" అని విక్టర్ ఆక్సెల్సెన్ తెలిపాడు.
భారత స్టార్ షట్లర్ లక్ష్యసేన్‌లో ఛాంపియన్స్‌కు కావాల్సిన అన్ని లక్షణాలు ఉన్నాయని.. మానసికంగా దృఢంగా మారాల్సిన అవసరం ఉందని దిగ్గజ క్రికెటర్ సునీల్ గావస్కర్ సూచించాడు.

# భారత రెజ్లర్‌పై మూడేండ్ల నిషేధం..



పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఫైనల్‌కు ముందు స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగట్ పై అనర్హత వేటు బాధను దిగమింగకముందే యువ రెజ్లర్ అంతిమ్ పంగల్ నిషేధానికి గురైంది. అంతర్జాతీయ ఒలింపిక్స్ సంఘం అంతిమ్‌పై ఏకంగా మూడేండ్ల నిషేధం విధించింది. క్రమశిక్షణ చర్యల్లో భాగంగా భారత రెజ్లర్‌కు ఏఓసీ ఈ శిక్ష వేసింది.
అసలేం జరిగిందంటే..? పారిస్ ఒలింపిక్స్ విలేజ్ నుంచి అంతిమ్ పంఘల్ చెప్పాపెట్టకుండా బయలకు వెళ్లింది. అంతేకాదు అమె సోదరికి తన ఐడీ కార్డు ఇచ్చింది. అయితే.. ఆమె భద్రతా అధికారులకు దొరికింది. దాంతో, క్రమశిక్షణ ఉల్లంఘనకు పాల్పడిన అంతిమ్‌పై ఐఓసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. యువ రెజ్లర్ చర్యను తీవ్రంగా పరిగణిస్తూ మూడేండ్ల నిషేధం విధించింది.
సోదరికి ఐడీ కార్డు ఇచ్చి
'భారత ఒలింపిక్ సంఘం అధికారులు అంతిమ్, ఆమె సహాయ బృందాన్ని స్వదేశం పంపించే ఏర్పాట్లు చేస్తున్నారు. అంతిమ్ క్షమశిక్షణ ఉల్లంఘనకు పాల్పడినట్టు ఫ్రాన్స్ అధికారులు గుర్తించారు. ఒలింపిక్ విలేజ్‌కు రాకుండా అంతిమ్ కోచ్ భగత్ సింగ్, భాగస్వామి వికాస్‌తో కలిసి హొటల్‌కు చేరుకుంది. ఆ తర్వాత సోదరి నిషా(%చీఱంష్ణు%)కు తన గుర్తింపు కార్డు ఇచ్చి ఒలింపిక్ విలేజ్‌లోని తన వస్తువులను తీసుకురావాల్సిందిగా చెప్పింది.
అయితే.. అక్కడ భద్రతా అధికారులు అనుమానం వచ్చి నిశాను ప్రశ్నించగా ఆమె పొంతనలేని సమాధానాలు చెప్పింది. దాంతో, వాళు నిశాను అరెస్ట్ చేశారు. పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి ఆమె వాంగ్మూలాన్ని రికార్డు చేసి పంపించారు. ఒలింపిక్ నిబంధలను ఉల్లంఘించిన అంతిమ్‌పై ఐఓసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. మళ్లీ ఇటువంటి పొరపాటుకు తావివ్వకుండా ఆమెపై మూడేండ్ల నిషేధం విధించింది' అని ఓ ప్రకటనలో ఐఓసీ వర్గాలు తెలిపాయి.
101 సెకన్లలోనే
కెరీర్‌లో తొలి ఒలింపిక్స్ బరిలో నిలిచిన అంతిమ్ తీవ్రంగా నిరాశపరిచింది. బుధవారం జరిగిన 53 కిలోల విభాగం మ్యాచ్‌లో టర్కీ రెజ్లర్ జెయ్‌నెప్ యెట్గిల్(%గవఎఅవజూ్‌వీస్త్రఱశ్రీ%) చేతిలో కంగుతిన్నది. ప్రత్యర్థి ధాటికి కేవలం 101 సెకన్లలోనే చేతులెత్తేసింది. సాంకేతికంగా అత్యధిక పాయింట్లు సాధించిన జెయ్‌నెప్ 10-0తో అంతిమ్‌పై విజయం సాధించింది.

# వినేశ్‌కు హరియాణ సర్కార్ బాసట : నవీన్ జిందాల్




పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రెజ్లింగ్ ఫైనల్‌కు చేరిన వినేశ్ ఫోగాట్ పతకం ఆశలు ఆవిరయ్యాయి.
అధిక బరువు కారణంగా ఆమెపై అనర్హత వేటు పడింది. నంబర్ వన్ రెజ్లర్ సుసాకిపై విజయం సాధించి ఫైనల్‌కు చేరిన ఫోగాట్‌పై అనర్హత వేటు పడటం సర్వత్రా షాక్‌కు గురి చేస్తోంది. మరోవైపు దేశం యావత్తూ వినేశ్ వెంట నిలిచి సంఘీభావం ప్రకటించింది.
ఇక ఈ అనుభవంతో వినేశ్ ఫోగాట్ మరింత దృఢంగా మారుతుందని బీజేపీ ఎంపీ నవీన్ జిందాల్ అన్నారు. సిల్వర్ మెడల్ సాధించిన వారికి అందించే సదుపాయాలన్నీ వినేశ్‌కు కల్పిస్తామని హరియాణ ప్రభుత్వం ప్రకటించిందని, ఈ సౌకర్యాలన్నింటినీ ఆమెకు సమకూరుస్తారని చెప్పారు. వినేశ్ తమ బిడ్డని, ఆమె చాలా సంకల్పబలం కలిగిన మహిళని కొనియాడారు.
ఆమె రెజ్లింగ్ నుంచి రిటైర్ కాబోరని, భవిష్యత్‌లో తమ బిడ్డ మరింత గట్టిగా పోరాట పటిమ ప్రదర్శిస్తుందని నవీన్ జిందాల్ పేర్కొన్నారు. ఈ విషయంలో ఎలాంటి రాజకీయాలకు తావు లేదని ఆయన స్పష్టం చేశారు. కాగా, వినేశ్ ఫోగాట్‌పై ఒలింపిక్స్‌లో అనర్హత వేటు పడటం విచారకరమని రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీ ఎంపీ హనుమాన్ బెనివల్ అన్నారు. మనకు మెరుగైన అంతర్జాతీయ సంబంధాలు ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ చెబుతున్నారని, అలా అయితే వినేష్ విషయంలో ఇలా ఎందుకు జరిగిందని ఆయన ప్రశ్నించారు.

# సమర్పయామి.. మూడో వన్డేలోనూ భారత్‌కు భారీ ఓటమి

**- స్పిన్ పరీక్షలో తేలిపోయిన రోహిత్ సేన**

**- 27 ఏండ్ల తర్వాత సిరీస్ గెలిచిన లంకేయులు**



కొలంబో (శ్రీలంక): అనుకున్నదే అయింది! శ్రీలంక పర్యటనలో ఉన్న టీమ్‌ఇండియాకు అనూహ్య షాకిస్తూ ఆతిథ్య జట్టు సంచలనం సృష్టించింది. లంకేయులు విసిరిన స్పిన్ సవాలు ముందు ప్రపంచంలోనే పటిష్టమైన బ్యాటింగ్ లైనప్ కలిగిన భారత క్రికెట్ జట్టు చిత్తుచిత్తుగా ఓడి 27 ఏండ్ల తర్వాత ప్రత్యర్థికి సిరీస్ (వన్డేలలో)ను అప్పగించింది. లంక నిర్దేశించిన 249 పరుగుల ఛేదనలో భారత్.. 26.1 ఓవర్లలో 138 పరుగులకే కుప్పకూలి 110 పరుగుల తేడాతో ఓడి మ్యాచ్‌తో పాటు సిరీస్‌నూ 0-2తో చేజార్చుకుంది. తొలి వన్డే డ్రా కాగా తర్వాత రెండు వన్డేలలోనూ రోహిత్ సేనకు షాకులు తప్పలేదు. ఈ సిరీస్‌లో బ్యాట్‌తో పాటు బంతితోనూ రాణిస్తున్న ఆల్‌రౌండర్ దునిత్ వెల్లలగె (5/27) ఐదు వికెట్లతో చెలరేగగా రెండో వన్డే హీరో జెఫ్రీ వాండర్సె (2/34), మహీశ్ తీక్షణ (2/45) స్పిన్ ధాటికి భారత బ్యాటింగ్ ఆర్డర్ కకావికలమైంది.
రోహిత్ శర్మ (20 బంతుల్లో 35, 6 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్ కాగా ఆ తర్వాత ముగ్గురు బ్యాటర్లు మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. కోహ్లీ (20), శ్రేయస్ (8), గిల్ (6), రిషభ్ (6) దారుణంగా విఫలమయ్యారు. ఏకంగా ఏడుగురు సింగిల్ డిజిట్‌కే పరిమితమవడంతో మెన్ ఇన్ బ్లూకు దారుణ పరాభవం తప్పలేదు. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన శ్రీలంకకు టాపార్డర్ రాణించడంతో పోరాడగలిగే లక్ష్యం దక్కింది. అవిష్క ఫెర్నాండో (102 బంతుల్లో 96, 9 ఫోర్లు, 2 సిక్సర్లు) తృటిలో శతకం కోల్పోగా కుశాల్ మెండిస్ (82 బంతుల్లో 59, 4 ఫోర్లు), పతుమ్ నిస్సంక (45) రాణించారు. అవిష్కకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్', వెల్లలగెకు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు దక్కాయి. 1997 తర్వాత భారత్‌పై లంకకు స్వదేశంతో పాటు ఆవల కూడా ఇదే తొలి వన్డే సిరీస్ కావడం గమనార్హం.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**